

గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు అలవాటు పడిన పోలీసు అధికారులు అదే పనిలో నిమగ్నం కావడం ఆ శాఖ ప్రతిష్టను దిగజార్చేలా చేస్తోంది. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన కొందరు వాటిని విస్మరించి ఇతర వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు. దీంతో అనేక కేసుల దర్యాప్తు కుంటుపడటంతోపాటు కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. కీలక కేసులు, ఇతర సమస్యల పరిష్కారం కష్టంగా మారుతోంది. క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న పోలీసు శాఖను గాడిన పెట్టేందుకు ఎస్పీ దామోదర్ కొరడా ఝుళిపిస్తున్నా 'మేమింతే.. మారమంతే' అన్నట్లుగా కొందరు పోలీసు అధికారుల ప్రవర్తన ఉంది.

లారీ వదిలి..

గాడిన పడని పోలీసు శాఖ

- కీలక కేసులో సరిగ్గా స్పందించని సీఐ
- వీఆర్‌కు పంపిన ఉన్నతాధికారులు
- ఎన్‌జీపాడు పూర్వ ఎస్‌ఐపై అవినీతి ఆరోపణలు
- యువతిని వేధించిన కానిస్టేబుల్
- కొందరు అధికారుల తీరుతో శాంతిభద్రతల వైఫల్యం
- రెచ్చిపోతున్న అసాంఘిక శక్తులు
- పెరుగుతున్న నేరాలు, అల్లర్లు
- చెలరేగిపోతున్న దొంగలు



కొరవడిన నిఘా

● నాగుల్పులపాడులో ఇటీవల జరిగిన అనేక పరిణామాల పైన ఎస్పీ ఆరా తీశారు. అక్కడ పనిచేస్తున్న ఎస్ఐపై అవినీతి ఆరోపణలకు అవధుల్లేవు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన పోలీసు అధికారులు వారితో చెలిమి చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు.

● నాగులుప్పలపాడులో జాతర విషయంలో ఎస్ఐ ఒక వర్గానికి కొమ్ముకాయడంతో మరో వర్గంవారు నలుగురు ఆత్మహత్య ప్రయత్నం చేశారు. ఇలా బేసిక్ పోలీసింగ్‌ను గాలికి వదిలేసి సొంత లాభాలకు పాల్పడుతున్నారు.

● ఎర్రగొండపాలెంలో జరిగిన బాలుడు హత్య కేసులో ప్రాథమికంగా వాస్తవాలు తెలుసుకొని ఉన్నతాధికారులకు తెలియజేయడంలో అధికారులు వైఫల్యం చెందారు. వాహనాల తనిఖీలకు సంబంధించి జరిమానాలు వేయడం, వాటిని వసూలు చేయడంపై కూడా అనేకమంది శ్రద్ధ చూపించడం లేదు. ఇలాంటి అనేక విషయాలపై ఎస్పీ సీరియస్ అయినా మార్పులేదు.

ఒంగోలు క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో పోలీసు అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. కొన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో అయితే అసలు అధికారులు అందుబాటులోనే ఉండటం లేదు. కొందరు ప్రైవేటు పంచాయితీలకే సమయం కేటాయిస్తూ సాధారణ విధులను పట్టించుకోవడం లేదు. ఇందుకు ఇటీవల వరకు పనిచేసిన కొనకనమిట్ల ఎస్ఐనే ఉదాహరణ. వీరయ్య చౌదరి హత్య కేసు రాష్ట్రంలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. రౌడీలు విచ్చలవిడిగా తిరగడంతోపాటు, అనేక కేసులలో తలదూర్చుతున్నారు. అదే సమయంలో అనుమానితులుగా పోలీసు స్టేషన్లలో షీట్లు ఉన్నవారు యథేచ్ఛగా తిరుగుతూ మరికొన్ని కేసులకు కారణం అవుతున్నారు. ఒంగోలు నగరంలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే ఇట్టే అర్థం అవుతుంది.

కొన్ని ఉదాహరణలు ఇవిగో..

● కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద హత్యకు గురైన బాషాను కేవలం రూ.1500 కోసం హత్య చేశారు. ఈ కేసులో నిందితుడిపై అనేక దొంగతనం కేసులు ఉన్నాయి.

● పెద్దమసీదు సమీపంలో ఓ దర్జీపై హత్యయత్నం చేసిన యువకుడిపై అనేక కేసులు ఉన్నాయి.

● సభ్య సమాజం తలదించుకునే విధంగా ఓ యువకుడిపై

మిగతా 6లో...

అవినీతి ఆరోపణలు.. ఆపై అక్రమాలు



నెల కిందటి వరకు నాగులుప్పలపాడు ఎస్ఐగా పనిచేసిన శ్రీకాంత్ అక్రమాలకు పాల్పడినట్లు బయటకు రావడంతో సెలవుపై వెళ్లారు. శాంతిభద్రతలు పరిరక్షించాల్సిన అతనిపై అనేక అవినీతి ఆరోపణ వచ్చాయి. అదే సమయంలో రౌడీషీటర్లను కట్టడి చేయాల్సింది పోయి వారితో చెలిమి చేస్తూ అనేక సమస్యలు ఉత్పన్నం కావడానికి కారణమయ్యాడని నిర్ధారణ అయింది. మండల కేంద్రంలో రెండు వర్గాలు అంకమ్మ జాతర విషయంలో ఘర్షణలకు దిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగింది. ఒక వర్గంకు కొమ్ము కాసిన ఎస్సైపై ఎస్పీ సీరియస్ కావడంతో సెలవులో వెళ్లాడు.

యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కానిస్టేబుల్

మద్యం పూటుగా సేవించిన కానిస్టేబుల్ ఒంగోలులో యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె వారి బంధువులకు విషయం చెప్పడంతో, వారు అతనిని చితకబాదారు. అయితే బాధితురాలు ఫిర్యాదు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. దీంతో ఆ కానిస్టేబుల్ ప్రవర్తనపై మండిపడిన ఎస్పీ పశ్చిమ ప్రాంతానికి బదిలీ చేశారు.

సార్ స్టేషన్‌కు రారు..

పోలీసు స్టేషన్‌కు రాకుండా బయట సివిల్ పంచాయితీలు చేసుకుంటున్న కొనకనమిట్ల ఎస్ఐని ఇటీవల వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే. పోలీసు స్టేషన్‌లో తనిఖీ చేసేందుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెళ్లి మూడు గంటలు ... ఆ సమయంలో సీఐ ఆ ఎస్ఐకి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నారు అని అడిగితే తాను పోలీసు స్టేషన్‌లోనే ఉన్నాను అంటూ ఓ పాత ఫొటో పంపించారు. ఈ మేరకు సీఐ ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. దీంతో వీఆర్‌కు పంపిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

● పోస్టింగ్‌ల కోసం రాజకీయ నాయకులతో ఒత్తిడి తెస్తున్న పోలీసు అధికారులను రేంజి వీఆర్‌కు పంపించిన పరిస్థితి ఉంది. ఇలా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నా కొందరు పోలీసుల తీరు మాత్రం మారడం లేదు.

సారా రహిత ప్రకాశం

- ప్రకటించిన కలెక్టర్ అన్సారియా
- అధికారులకు అభినందనలు



నవోదయం 2.0 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను నాటుసారారహిత జిల్లాగా ప్రకటించడం సంతోషంగా ఉందని, అందుకు కృషి చేసిన సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా అభినందనలు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో గురువారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలన కార్యక్రమం నవోదయం 2.0పై ఎస్పీ ఏఆర్.దామోదర్‌తో కలిసి జిల్లాస్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటిస్తూ డిక్లరేషన్ చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19న రాష్ట్రస్థాయి నవోదయ2.0 కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించుకొని జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా మార్చేందుకు సంకల్పించినట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ, అటవీశాఖల అధికారుల సహకారంతో ఈ

మిగతా 6లో...

కొత్త కార్డుల కోసం నిరీక్షణ

- ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం ఎదురుచూపులు

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



కొత్తపట్నంలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులను పరిశీలిస్తున్న డీఎస్‌వో

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొత్త రైస్‌కార్డు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఆర్థిక ప్రయోజనం చేకూరే పథకాలను అమలు చేస్తుండటంతో తమకు అందకుండా పోతాయనే భయంతో కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త కార్డుల జారీ నిలిపివేయడంతో గత రెండేళ్ల నుంచి కార్డుల కోసం ప్రజలు ఎదురుచూస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం గత నెల 7వతేదీ నుంచి కొత్త కార్డుల జారీతో పాటు ప్రస్తుతం ఉన్న కార్డుల్లో పేర్ల నమోదుకు సచివాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. దీంతో ప్రజలు కొత్త కార్డులు, పాత కార్డుల్లో పేర్ల నమోదుకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. అలా జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న కార్డుల్లో పేర్ల నమోదు కోసం 49,684 మంది దరఖాస్తు చేసుకోగా కొత్త కార్డుల కోసం మరో 7,883 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం దరఖాస్తులు ఇప్పటివరకు 57,567 వచ్చాయి. తాజాగా ప్రభుత్వం తల్లికివందనం పథకం నిధులు మంజూరు చేయగా త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు లబ్ధి చేకూరనుంది. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది ఆయా పథకాల కోసం రేషన్ కార్డుల్లో పేర్ల నమోదుతో పాటు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న పక్షం రోజుల్లో ఆయా దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డులు జారీచేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో పేర్ల నమోదు చేసి కొత్త కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా ఇంత వరకు కొత్త రేషన్ కార్డులు జారీ కాకపోవడంతో ప్రజలు వాటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం రేషన్ కార్డుల్లో పేర్ల నమోదు కోసం చేసుకున్న దరఖాస్తుల్లో చిన్న పిల్లలు కూడా అధికంగా ఉన్నారు. దీంతో తల్లికి వందనం పథకానికి పేర్లు నమోదు చేసుకొనేందుకు అతృతగా ఎదురు చూస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల ఎప్పుడు వస్తాయె తెలియకపోవడంతో దరఖాస్తులు చేసుకున్న ప్రజలు సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు రేషన్ కార్డుల్లో చేర్పులు మార్పుల కోసం దరఖాస్తులు భారీగా వచ్చాయి. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో అడ్రసు మార్పుల కోసం 2,159 దరఖాస్తులు రాగా, ఆధార్ నమోదు కోసం 915, కార్డుల విభజన కోసం 1195, ఉన్న సభ్యుల తొలగింపు కోసం 5,825 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వారు కూడా తమ కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రద్యుమ్న @ పెదచంద్రపాడు

- హైదరాబాద్‌లో నివాసం..
- ఈషా ఇన్‌ఫ్రా ఏర్పాటు
- సజ్జల భార్గవ్‌రెడ్డికి స్నేహితుడు
- లిక్కర్ స్కాంలో కీలకపాత్ర
- ఆరా తీస్తున్న సిట్ అధికారులు

ఒంగోలు క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడిగా చంద్రపాటి ప్రద్యుమ్న పేరు వెలుగులోకి రావడంతో జిల్లాలో చర్చనీయాంశమైంది. చీమకుర్తి మండలం పెద చంద్రపాడుకు చెందిన అతను 15 ఏళ్ల క్రితమే హైదరాబాద్‌కు మకాం మార్చాడు. ఈషా ఇన్‌ఫ్రా పేరుతో నిర్మాణ రంగం వైపు అడుగులు వేశాడు. అదేక్రమంలో కొన్ని సినిమాలకు నిర్మాతగా వ్యవహరించాడు. సజ్జల భార్గవ్‌రెడ్డి స్నేహితుడు కావడంతో కొందరు వైసీపీ నాయకులకు బినామీగా ఉండేవాడని సమాచారం. ఈ నేపథ్యంలో ఏడాది క్రితం ఎన్నికల సమయంలో ఎన్టీఆర్ జిల్లా గరికపాడు చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా ఓ కారులో రూ.8.37 కోట్ల నగదు పట్టుబడింది. ఆ నగదు అప్పట్లో వైసీపీ తరఫున ఒంగోలు పార్లమెంట్ స్థానానికి పోటీచేసిన చెవిరెడ్డి భాస్కరరెడ్డిదని, ప్రస్తుతం మద్యం కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్న సిట్ తేల్చింది. అయితే అప్పట్లోనే ఆ సొమ్ము అంతా ఈషా ఇన్‌ఫ్రాకు సంబంధించిందని ప్రద్యుమ్న కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆ నగదును చెవిరెడ్డి తరఫున ఓటర్లకు పంచేందుకు తీసుకెళ్లారని, లిక్కర్ కేసులో నిందితుడు రాజ్ కసిరెడ్డి సన్నిహితుడు వెంకటేశ్‌నాయుడు ద్వారా హైదరాబాద్ నుంచి పంపించినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. దీంతో ప్రద్యుమ్న గురించి సిట్ అధికారులు వెతుకుతున్నారు. నిర్మాణ రంగంలో ఆటుపోట్లు ఎదుర్కొన్న ప్రద్యుమ్న సజ్జల భార్గవరెడ్డి ద్వారా వైసీపీకి దగ్గరయ్యాడు. తిరుపతిలో ఓ ఇల్లు కొనుగోలు చేశాడు. అక్కడ చెవిరెడ్డి భాస్కరరెడ్డికి సన్నిహితుడిగా మారాడు. చెవిరెడ్డి అరెస్టు తర్వాత సిట్ అధికారులు ప్రద్యుమ్న వ్యవహారాలపై ఆరా తీస్తున్నారు.

ఆరోగ్య యోగం


ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం ఇచ్చిన పిలుపును అందుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాల వారూ యోగాసనాలు సాధన చేస్తున్నారు. ఈ క్రమంలో ఒంగోలులోని కేశవస్వామిపేట శ్రీ ప్రసన్న చెన్నకేశవ, కాశీవిశ్వేశ్వరాలయంలో పురోహితులు ఆసనాలతో అవగాహన కల్పించారు.

యోగా దినోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

- కలెక్టర్ అన్సారియా పిలుపు

7





బూచేపల్లి క్వారీలో డంపర్ బోల్తా

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

చీమకుర్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం రామతీర్థం వద్ద ఉన్న సూర్య గ్రానైట్ క్వారీలో గురువారం సాయంత్రం ప్రమాదం చోటుచేసుకుంది. క్వారీ పిట్ నుంచి పైకి వస్తున్న డంపర్ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. దాదాపు నలభై అడుగుల ఎత్తు నుంచి కిందకు పిట్‌లోకి పడటంతో డంపర్‌లో ఉన్న నలుగురు వ్యక్తులలో ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి

మిగతా 6లో...



రంగయ్య, సాయిరెడ్డిల మృతదేహాలు

ఎంటీఎస్ టీచర్ల సర్దుబాటు

- ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు ప్రాధాన్యం
- 20లోపు ప్రక్రియ పూర్తికి ఆదేశం

ఒంగోలు విద్య, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు విధానంలో మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్)తో పనిచేస్తున్న టీచర్లను సర్దుబాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. అవసర ప్రాతిపదికన వీరిని పాఠశాలలకు కేటాయించనున్నారు. ఎంటీఎస్ టీచర్లకు పాఠశాలల కేటాయింపులో అనుసరించాల్సిన మార్గదర్శకాలను నిర్దేశిస్తూ పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంటీఎస్ టీచర్లు (2008, 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు) సర్వీసులను 2025-26 విద్యా సంవత్సరానికి కొనసాగిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. వీరు జూన్ 1 నుంచి విధుల్లో ఉన్నట్లే, వీరికి 11 నెలల జీతం చెల్లిస్తారు. మే నెలలో పాఠశాలలకు వేసవి

మిగతా 6లో...

ఎన్టీఆర్ బేబీ కిట్లు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు నిర్ణయం
- తల్లీ బిడ్డల ఆరోగ్యంపై దృష్టి

పొగాకు రైతులను ఆదుకోవాలి

మంత్రి అచ్చెన్నకు ఎరిక్షన్‌బాబు విజ్ఞప్తి

7

మూడు వాహనాల ఢీ

● రాజుపాలెం రెస్ట్ ఏరియా వద్ద పెనుప్రమాదం

మార్టూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న కారును వెనుక నుంచి టిప్పర్ ఢీకొనగా,ఆ టిప్పర్‌ను వెనుకనుంచి కంటెయినర్ ఢీకొంది.ఈ సంఘటన గురువారం మండల పరిధిలో జాతీయరహదారిపై ఒంగోలు వైపు రాజుపాలెం రెస్ట్ ఏరియా వద్ద జరిగింది.అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. టిప్పర్ లారీ వెనుకభాగం, కంటెయినర్ లారీ ముందుభాగం దెబ్బతిన్నాయి. అందినసమాచారం మేరకు ఒంగోలుకు చెందిన పద్మబాపయ్యశెట్టి గుంటూరు నుంచి ఒంగోలుకు కారులో వెళుతుండగా వెనుకనుంచి బాపట్ల బైపాస్ రోడ్డుపనులు నిమిత్తం మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఢీకొన్నది. దాంతో వేగాన్ని అదుపుచేసుకోలేని కారు రోడ్డుమధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొన్నది. అదేవిధంగా టిప్పర్ లారీ వెనుక భాగాన్ని విజయవాడ నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళుతున్న కంటెయినర్ లారీ ఢీకొన్నది. అయితే మూడువాహనాలలోని వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనతో రోడ్డుపై ఏర్పడిన ట్రాఫిక్‌ను హైవే మొబైల్ పోలీసులు తొలగించారు.ఇదిలా ఉండగా హీరోషోరూం ఎదురుగా జాతీయరహదారిపై లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో మార్టూరు గ్రామానికి చెందిన ఒక యువకుడు గాయాలపాలయ్యాడు.

హరితశ్రీకి అభినందనల వెల్లువ

● ఫోన్‌చేసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి గొట్టిపాటి రవికుమార్



హరితశ్రీని అభినందిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

అద్దంకిటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళ విశ్వ విద్యాలయం గురువారం విడుదల చేసిన పీజీ లా సెట్ పరీక్ష ఫలితాలల్లో ప్రథమ ర్యాంకు సాధించిన హరితశ్రీకి అభినందనలు వెల్లువెత్తాయి. పట్టణంలోని బైసాని శ్రీనివాసరావు, సుజాతల కుమార్తె హరితశ్రీ పీజీ లాసెట్ పరీక్షలో 113 మార్కులతో రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించింది. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేకంగా ఫోన్ చేసి హరితశ్రీకి అభినందనలు తెలియజేశారు. అలాగే స్థానిక టీడీపీ నాయకులు చుండూరి మురళి సుధాకరరావు, అంకం నాగరాజు, బీజేపీ నాయకులు షేక్ కాలేషాబాబు విరాట్ తదితరులు హరితశ్రీని శాలువతో సత్కరించి అభినందించారు. హరితశ్రీ 1నుంచి 10వ తరగతి వరకు అద్దంకిలోని హోలీపెయిత్‌లోను, హైదరాబాద్‌లో ఎన్‌టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడిచే ఎన్‌టీఆర్ జూనియర్, డిగ్రీ కాలేజీలో చదువుకుంది. పీజీ విజయవాడలోని సిద్దార్థ లా కాలేజీలో ఎల్ఎల్‌బీ చేసింది.

జాయింట్ ఎల్‌పీఎంలు విడగొట్టండి

పంగులూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):రీసర్వేలో పొందుపరచిన జాయింట్ ఎల్‌పీఎంల స్థానంలో వారి భూహక్కును ధ్రువీకరిస్తూ సింగిల్ ఎల్‌పీఎం నెంబరు కేటాయించాలని మండల తహసీల్దార్ సింగారావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం గ్రామ సర్వేయర్లకు ఎల్‌పీఎం కేటాయింపు విషయమై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి వెంటనే జాయింట్ ఎల్‌పీఎంలు విడగొట్టి సింగిల్ ఎల్‌పీఎంలు కేటాయించాలని సిబ్బందికి సూచించారు. పదిరోజుల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు.

నోటు పుస్తకాల పంపిణీ

మార్టూరు,జూన్19(ఆంధ్రజ్యోతి): జాతీయ పఠన దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని లక్కవరం గ్రామంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, బిస్కట్లు, చాక్‌లెట్లను పంపిణీ చేశారు. ఎంఈవోలు వస్రాంనాయక్, ఎం. ప్రేమలత, రొటేరియన్లు మాదాల సాంబ శివరావు, కొర్రపాటి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కొప్పెరపాలెం సర్పంచ్ అమల మృతి

బల్లికురవ, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాలెం సర్పంచ్ వల్లంరెడ్డి అమల(60) బుధవారం అర్థరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో గుండె పోటుతో ఇంటి వద్ద మృతి చెందారు. ఎంపీడీవో కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావులు అమల మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

రైతు రాజుగా ఉండాలన్నదే లక్ష్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : దేశానికి అన్నంపెట్టే రైతన్నలు రాజుగా ఉండాలన్నదే ప్రజా కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం అనంతరం జరిగిన సభలో ఏలూరి మాట్లాడారు. నల్లబర్లీ పొగాకును రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయటం చరిత్రాత్మకం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ రంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రైతుల పరిరక్షణ ధ్యేయంగా నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసి కూటమి కూటమి ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నది ఇది చరిత్రలో నిలిచిపోతుంది అనటంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు. చివరి రైతు వరకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పుడు కొనుగోలు సాధ్యం కాదని, రైతులు అపోహ పడ్డారని, అసాధ్యాన్ని ప్రభుత్వం సుసాధ్యం చేసిందన్నారు. విదేశీ మారకద్రవ్యం అధికంగా వచ్చే బ్లాక్ బర్లీ పొగాకు పంటను ప్రభుత్వం అదుకుంటుందని ఏలూరి స్పష్టం చేశారు. బర్లీ పొగాకు పంటను రాష్ట్రంలోనే పర్చూరు నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా రైతులు సాగుచేసారని, వారికి ప్రభుత్వం కొండంత అండగా నిలిచిందన్నారు. తదుపరి ప్రభుత్వం నిర్ణయం మేరకు పంట సాగుచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయకుమార్, కలెక్టర్ జె. వెంకట మురళి, వేర్ హౌసింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్, ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఆర్డీవో గ్లోరియా, మార్కెటింగ్‌శాఖ అధికారి రమేష్‌బాబు, జిల్లా సహకార శాఖ అధికారి శ్యాంసన్, బుడ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లను కలుపుతూ విద్యుత్ టవర్ల ఏర్పాటు

అద్దంకి,జూన్19(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ఇప్పటికే ఉన్న రెండు విద్యుత్ సబ్‌స్టేషన్‌లతో పాటు నిర్మాణంలో ఉన్న మరో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్‌లను కలుపుతూ విద్యుత్ టవర్‌ల ద్వారా లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. రాజీవ్‌నగర్, శింగరకొండరోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, నిర్మాణంలో ఉన్న ఎన్ఎస్‌పీ కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్, ద్వారకానగర్ సబ్‌స్టేషన్‌లను కలుపుతూ విద్యుత్ లైన్ ఏర్పాటుకు నామ్ రోడ్డు వెంబడి 62 విద్యుత్ టవర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. సబ్‌స్టేషన్‌లను కలిపే విద్యుత్ లైన్‌లతో పాటు సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు, ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి వినియోగదారులకు విద్యుత్ సరఫరా జరిగే విద్యుత్ లైన్‌లు అన్నీ ఈ టవర్‌లకు ఏర్పాటు చేస్తారు. విద్యుత్ టవర్‌ల ఎత్తు 16 మీటర్లు కాగా, భూమి లోపలకు మూడు మీటర్లతో దిమ్మె ఏర్పాటు చేస్తారు. మిగిలిన 13 మీటర్ల ఎత్తు టవర్‌లకు విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తారు.

ఇప్పటి వరకు విద్యుత్ లైన్ లు తక్కువ ఎత్తు ఉండటంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఎక్కువ చోట్ల విద్యుత్ స్తంభాలు ఉండి స్థానికంగా ఉండే షాపుల నిర్వాహకులకు ఒకింత అంతరాయంగా ఉంటుంది. టవర్‌ల ద్వారా విద్యుత్ లైన్‌ల ఏర్పాటుతో పట్టణంలో ఎత్తు తక్కువగా ఉండే విద్యుత్ లైన్‌లను తొలగించనున్నారు. విద్యుత్ టవర్‌ల ద్వారా 4 సబ్ స్టేషన్‌లను అనుసంధానం చేయటం ద్వారా ఒక సబ్‌స్టేషన్ లో మరమ్మతులు చేయాల్సి వస్తే మిగిలిన సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్ సరఫరాకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దీంతో విద్యుత్ అంతరాయం తగ్గించే అవకాశం ఏర్పడుతుంది.



అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డు వెంబడి ఏర్పాటు చేస్తున్న విద్యుత్ టవర్‌లు

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

● పీడీ వెంకటేశ్వర్లు



ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

అద్దంకి,జూన్19(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు అన్నారు. అద్దంకి పట్టణంలోని బొమ్మనంపాడు రోడ్డు, నాగులపాడు రోడ్డు, వేలమూరిపాడు రోడ్డులలోని లేఅవుట్‌లలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. కాంట్రాక్టర్‌ల ద్వారా నిర్మాణం చేస్తున్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టర్‌లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కాంట్రాక్టర్‌లు నిర్మించే ఇళ్లు లబ్ధిదారుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి ఖచ్చితంగా ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, హౌసింగ్ ఏఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండ రామస్వామి శాంతి కల్యాణం

చినగంజాం, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసియున్న సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి దేవస్థానం ఆవరణలో గురువారం రాత్రి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ పూజారి ఆలహరి శేషతల్పసాయి స్వామి వారికి గురువారం ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దేవతామూర్తులను విశేషంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. సాయంత్రం దేవస్థానం ప్రాంగణంలో వేద పారాణం, నిత్య హోమం కార్యక్రమాలు జరిపారు. అనంతరం శారదాపీఠం వేదపండితులు మనోహర్ రావు ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, పలు రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి, దంపతులచే శాంతి కల్యాణాన్ని వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాములోరి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వినియోగం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వేద పారాయణం నిర్వహిస్తున్న పండితులు

కౌలు కార్డులతో రైతులకు ప్రయోజనం

అద్దంకిటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కౌలు కార్డులతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నామన్నారు, పావలా వడ్డీ, గిట్టుబాటు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి అన్ని పథకాలుకౌలు కార్డుల ద్వారా అందుతాయన్నారు. పొగాకు పంట ఈ సంవత్సరం సాగు చేయరాదని సూచించారు. నల్లబర్లీ పొగాకు ఉన్న రైతులు మండలంలో 187 మంది ఉన్నారని, వారి వద్ద ప్రస్తుతం 3 వేల క్వింటాల వరకు నిల్వ ఉందని తెలిపారు. ఈ మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.

అద్దంకి నుంచి విశాఖకు 22 బస్సులు

గ్రామీణ రూట్లలో బస్సులు లేక ఇక్కట్లు.. మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి



అద్దంకి బస్టాండ్ లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

అద్దంకి,జూన్19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహించే యోగా డే లో పాల్గొనే వారిని సమీప ప్రాంతాల నుంచి తరలించేందుకు అద్దంకి డిపో నుంచి 22 బస్సులు పంపినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. గురువారం సాయంత్రం బయలుదేరి వెళ్లిన బస్సులు తిరిగి ఆదివారం సాయంత్రానికి అద్దంకి చేరుకోనున్నాయి. దీంతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వివిధ గ్రామాలకు నడిపే పల్లెవెలుగు బస్సులు రద్దు అయ్యాయి. గురువారం మధ్యాహ్నం నుంచే బస్సులు రద్దుచేయటంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ప్రధాన రూట్ల లో బస్సులు నడుపుతున్నప్పటికి గ్రామీణ రూట్లలో అత్యధికశాతం బస్సులు రద్దు అయ్యాయి.



మహంకాళి వీధిలో ఉన్న చిన్నపాటి రోడ్డు

అవ్వారువారి వీధిలోని రోడ్డు

ముత్యాల పేటలోని ఇరుకు వీధి

ఇరుకు రోడ్లతో అవస్థలు

అత్యవసర సమయాల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు కదల్లేని పరిస్థితి

చీరాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల పురపాలక సంఘం పరిధిలో ఇరుకు రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మునిసిపాలిటీలో 33 వార్డులు ఉన్నాయి.

అయితే వీటిల్లో ప్రధానంగా పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో రోడ్లు పూర్తిగా ఇరుకు మయంగా ఉన్నాయి. దీంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇదిలాఉంటే సాధారణ రాకపోకలు విషయం అటుంచి కనీసం విపత్కర సమయాల్లో ప్రధానంగా అంబులెన్స్ అగ్నిమాపక వాహనాలు సైతం వచ్చే పరిస్థితి లేదు. ఈక్రమంలో ఏదయినా ప్రమాదం సంభవిస్తే ఎ టూ తేల్చుకోలేని దుస్థితి నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరుతున్నారు.

అవీఇవీ

లారీ వదిలి..

(5వ పేజీ తరువాయి)

మూత్రం పోసిన కేసులో ప్రధాన నిందితుడు రౌడీషీటర్. అలాంటి రౌడీ షీటర్ పప్పుబజారులో హోటల్ నిర్వాహకుడిని చంపివేస్తానని బెదిరించాడు. ఇలా అనేక కేసులలో నిందితులు, రౌడీషీటర్లు విచ్చలవిడిగా తిరుగుతుంటే పోలీసులు చోద్యం చూడటంపై ఇటీవల ఎస్పీ గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేసమయంలో కొంతమంది రౌడీషీటర్లను అదుపులోకి తీసుకొని పోలీసు మార్కు కౌన్సిలింగ్ ఇచ్చారు.

వీరయ్య హత్య కేసు ఎఫెక్ట్

నగరంలో తాలూకా సీఐగా పనిచేసిన అజయ్‌కుమార్‌ను వీఆర్‌కు పంపిన విషయం విదితమే. ఎన్‌జీపాడు టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య తాలూకా పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగింది. హత్యకు ముందు మూడు నెలలుగా కిరాయి హంతకులు ఆ పోలీసు స్టేషన్ పరిధిలో గల లాడ్జీలు, హాస్టల్‌లలో మకాం వేసి ఉన్నారు. కనీసం లాడ్జిలు తనిఖీలు నిర్వహించడం లాంటి చర్యలు చేపట్టి ఉంటే ఇంత దారుణం జరిగి ఉండేది కాదని ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో అజయ్‌కుమార్‌ను వీఆర్‌కు పంపిస్తూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

ఎన్ని చర్యలు తీసుకున్నా మారరు

అవినీతి ఆరోపణలు ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందిపై ఎస్పీ కొరడా ఝుళిపిస్తున్నారు. ఎక్కడికక్కడ చర్యలు తీసుకుంటున్నారు. అయినా మేము అంతే అన్నట్లుగా పోలీసు అధికారుల తీరు ఉంది. ఒంగోలు నగరంలో యాంటీ గుండా స్క్వాడ్‌ను ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠినమైన చర్యలు చేపడుతున్నారు. అందుకు ఓ సీఐ పర్యవేక్షణలో నలుగురు ఎస్ఐలను నియమించారు. ఇలాంటి చర్యలు ఓ పక్క తీసుకుంటుంటే మరోపక్క పోలీసు అధికారుల తీరు మారకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ఎంటీఎస్ టీచర్ల సర్దుబాటు

(5వ పేజీ తరువాయి)

సెలవుల నేపథ్యంలో నో వర్క్-నో పే సిద్ధాంతంతో వీరికి 11 నెలల వేతనం మాత్రమే ఇస్తారు. ప్రస్తుతం రెగ్యూలర్ సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు పూర్తయి టీచర్లందరూ కొత్త స్థానాల్లో చేరిన నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఎంటీఎస్ టీచర్లను అవసరం ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయాలని కమిషనర్ డీఈవోను ఆదేశించారు. ఈనెల 20వ తేదీ నాటికి ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంటీఎస్ టీచర్ల సర్దుబాటులో 2008 డీఎస్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. తర్వాత 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఇస్తారు. ఎంటీఎస్ టీచర్ల కేటాయింపులో అసలు టీచర్‌లేని పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలకు రెండో ప్రాధాన్యత. రెండులేక అంతకంటే ఎక్కువ ఎస్జీటీ పోస్టులు మంజూరై ప్రస్తుతం ఒక టీచర్‌తో నడుస్తున్నన స్కూళ్లకు కేటాయించనున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ఒక పీఎస్ హెచ్‌ఎం, నాలుగు ఎస్జీటీ పోస్టులు మంజూరై ప్రస్తుతం కేవలం ఒక ఎస్జీటీ మాత్రమే పనిచేస్తుంటే ఆ పాఠశాలలకు ఇద్దరు ఎంటీఎస్ టీచర్లను కేటాయించనున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ఒక పీఎస్ హెచ్‌ఎం, మూడు ఎస్జీటీలు మంజూరై ఒక ఎస్జీటీ మాత్రమే పనిచేస్తుంటే ఆ పాఠశాలకు ఒక ఎంటీఎస్ టీచర్‌ను కేటాయించనున్నారు. ముగ్గురు ఎస్జీటీలు మంజూరైన పాఠశాలల్లో ఇద్దరు మాత్రమే పనిచేస్తుంటే అక్కడ ఒక ఎంటీఎస్ టీచర్‌ను నియమించనున్నారు. మార్గదర్శకాల మేరకు ఎంటీఎస్ టీచర్ల సర్దుబాటు చేయగా ఇంకా మిగులుగా ఉంటే వారిని క్లస్టర్ టీచర్లుగా నియమించనున్నారు. కేటగిరీ 4 నుంచి 1 వరకు దామాషా ప్రకారం వీరిని క్లస్టర్‌కు కేటాయించనున్నారు. ఈ సర్దుబాటును ఇంకా ఎంటీఎస్ టీచర్లు మిగులుగా ఉంటే వారిని మొదటగా కేటగిరీ క్లస్టర్లు తర్వాత మూడు ఆ తర్వాత 2, 1 క్లస్టర్లకు కేటాయించనున్నారు.

సారా రహిత ప్రకాశం

(5వ పేజీ తరువాయి)

నాలుగు నెలల కాలంలో జిల్లాలో నాటుసారా తయారీదారులను, వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని వారిలో అవగాహన కల్పించడం, నాటుసారా యూనిట్స్‌ను నిర్మూలించడం వంటి చర్యలు తీసుకోవడం ద్వారా జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించుకొనేందుకు అవకాశం కలిగిందన్నారు. అందుకు కృషి చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఒకసారి జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించిన తర్వాత జిల్లాలో ఎక్కడైనా నాటుసారా తయారీ, వినియోగం జరగకుండా నిరంతరం మానిటరింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఐడీ లిక్కర్ పీడిత గ్రామాల జాబితాను ఎనిమిది మండలాల్లో ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించినట్లు తెలిపారు. ఏ కేటగిరీలో రెండు గ్రామాలు, బీ కేటగిరీలో 27 గ్రామాలు, సీ కేటగిరీలో ఆరు గ్రామాలు కలిపి మొత్తం 35 గ్రామాలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో నాటుసారాను నిర్మూలించి ప్రభుత్వ లక్ష్యం చేరుకొనేలా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్పీ ఏఆర్‌దామోదర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా, నెక్స్ట్ జనరేషన్ ఈ వృత్తిలో కొనసాగకుండా జిల్లాలో నాటుసారా తయారీ, సరఫరాను పూర్తిగా నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నవోదయం 2.0 పై అవగాహన కలిగించే కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, ఎక్సైజ్ సూపరిటెండెంట్ ఆయేషా బేగం పాల్గొన్నారు.

బూచేపల్లి క్వారీలో డంపర్ బోల్తా

(5వ పేజీ తరువాయి)

విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. రామతీర్థం సమీపంలో ఉన్న జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి చెందిన సూర్యా గ్రానైట్ క్వారీలో సాయంత్రం ప్రమాదం చోటుచేసుకుంది. పిట్‌లో పనులు పూర్తయిన తర్వాత బయలుదేరిన డంపర్ దాదాపు నలభై అడుగులు పైకి వచ్చిన తర్వాత అదుపుతప్పి బోల్తాపడి కిందకు పడిపోయింది. ఆ సమయంలో డంపర్‌లో డ్రైవర్ రంగయ్య(51), సూపర్‌వైజర్ సాయిరెడ్డి(25), మరో ఇద్దరు కార్మికులు ఉన్నారు. తీవ్రగాయాలైన వారందరిని తొలుత చీమకుర్తిలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి, తదుపరి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అనంతపురం జిల్లాకు చెందిన రంగయ్య, చీమకుర్తి మండలం నాయుడుపాలెంకు చెందిన సాయిరెడ్డి మృతిచెందగా, గాయపడిన ఇద్దరు కార్మికులను కిమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సరైన కండిషన్‌లో లేని డంపర్‌ని తీసుకెళ్లవద్దు అని అక్కడి వారు వారిస్తున్నా పైకి తీసుకెళ్తుండటం మార్గమధ్యలో బోల్తాపడటం గమనార్హం. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

క్వారీల్లో కొనసాగుతున్న ప్రమాదాల పరంపర

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇటీవల కొద్దినెలల క్రితమే క్వారీల్లో పెద్దఎత్తున భద్రతా వారోత్సవాలు సైతం నిర్వహించారు. కానీ అవి మీటింగ్‌లకే పరిమితమయ్యాయి. నిత్యం ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షించాల్సిన మైన్స్ సేఫ్టీ అధికారులు వారోత్సవాలకే పరిమితమవుతూ తర్వాత క్వారీల వైపు తొంగిచూసిన పాపాన పోవడం లేదు. క్వారీల్లో భద్రతను పర్యవేక్షించాల్సిన కార్యాలయం, అధికారులు సైతం ఏపీలోనే లేకపోవటం గమనార్హం. మైన్స్ సేఫ్టీ కార్యాలయాన్ని నెల్లూరు నుంచి హైదరాబాద్‌కి తరలించటం విశేషం. దీంతో పర్యవేక్షణాధికారులు చుట్టపుచూపుగా వచ్చిపోతుండటంతో క్వారీల్లో భద్రత డొల్లగా మారింది. అనుక్షణం కార్మికుల భద్రతను చూసుకోవాల్సిన మైన్స్ మేనేజర్లు విధుల నిర్వహణలో జరుగుతున్న నిబంధనల ఉల్లంఘన, క్వారీ ఓనర్లు లాభాలపై చూపే ఆసక్తి, భద్రతపై చూపకపోతుండటంతో క్వారీల్లో ప్రమాదాలు ఎక్కువయ్యాయి. ఇకనైనా మైన్స్ సేఫ్టీ కార్యాలయాన్ని ఒంగోలులో ఏర్పాటు చేసి అధికారులు నిత్యం క్వారీల్లో పర్యవేక్షణ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మికసంఘ నాయకులు కోరుతున్నారు.

ఎన్టీఆర్ బేబీ కిట్లు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు ప్రజాప్రభుత్వం నిర్ణయం

ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్టం చేయాలి.. పేద రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి.. ఆసుపత్రుల్లో చేరే వారికి మెరుగైన వసతులు కల్పించాలి.. ఈ ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఈపాటికే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల నియామకాలపై దృష్టిపెట్టగా.. తాజాగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సమర్థంగా అమలైన ఎన్టీఆర్ బేబీ కిట్ పథకాలను పునరుద్ధరించింది. ప్రసవాలకు వచ్చే పేద తల్లుల నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు.



తల్లీ, బిడ్డలకు ఆరోగ్య వనరుల కల్పనపై దృష్టి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాన్ని పునరుద్ధరించిన సీఎం చంద్రబాబు

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు ప్రజాప్రభుత్వం నిర్ణయించింది. ఆసుపత్రుల్లో పురుడు పోసుకున్న ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ బేబీ కిట్లు అందించేలా చర్యలు చేపట్టింది. 2014-19లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ విధానం అమలు చేయడంతో రాష్ట్రంలో లక్షలాది మంది పేద తల్లులు, నవజాత శిశువులు సురక్షితంగా ఇళ్లకెళ్లారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం హయాంలో ఈ పథకాన్ని తొలగించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే తల్లులు, పిల్లల పట్ల నిర్లక్ష్యం వహించింది. ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని తిరిగి పునరుద్ధరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే తల్లులకు త్వరలోనే ఎన్టీఆర్ బేబీ కిట్లు అందించనుంది. వీటిని త్వరితగతిన ఆసుపత్రులకు అందించేలా అవసరమైన చర్యలను చేపట్టింది. దీంతో మహిళల్లో ఆనందంతోపాటు బిడ్డలకు ఈ పథకం రక్షణ కవచం కానుంది.

● జిల్లాలో నెలకు 1500 ప్రసవాలు

జిల్లాలో ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఒకటి ఉండగా, మార్కాపురంలో జిల్లా వైద్యశాల ఉంది. ప్రైమరీ హెల్త్ సెంటర్లు 89, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 9 వరకు ఉన్నాయి. వాటితోపాటు ఏరియా ఆసుపత్రులు మరో 9 వరకు ఉన్నాయి. వీటిల్లో నెలకు సుమారు 1500 వరకు ప్రసవాలు జరుగుతుండగా, వారిలో అత్యధిక శాతం మంది నిరుపేదలే. బిడ్డపుట్టగానే పరిశుభ్ర వస్త్రాల్లో ఉంచి సంరక్షణ చర్యలు చేపట్టాలి. లేకపోతే ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలోనే ఆరోగ్యంపై నిర్లక్ష్యం చూపడంతో శిశుమరణాలు కూడా నమోదైన సందర్భాలు ఉన్నాయి. కాగా ప్రజా ప్రభుత్వం శిశు మరణాలు తగ్గించడంతోపాటు, తల్లుల ఆరోగ్యంపైన ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో ఎన్టీఆర్ బేబీ కిట్లు అందజేసి, తల్లి, బిడ్డ సంరక్షణ ధ్యేయంగా దృష్టి సారించింది.



● కిట్‌లో 11 రకాల వస్తువులు

రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న ఎన్టీఆర్ బేబీ కిట్‌లో 11 రకాల వస్తువులు ఉంచనున్నారు. దీని ఖరీదు సుమారు రూ.1410గా ఉంటుంది. పురిటి బిడ్డలు సుఖంగా నిద్రించేందుకు బెడ్, దోమతెర, తల్లులు చేతులు శుభ్రం చేసుకునే శానిటైజర్, బేబీ సబ్బు, న్యాప్‌కిన్, పౌడర్, రెండు టవల్స్, చిన్న బొమ్మవంటి వస్తువులు ఉంటాయి. వీటిని బయట కొనుగోలు చేయాలంటే సుమారు రూ. 1000 నుంచి రూ.1500 వరకు ఉంటుంది. కాగా ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే పేదవారికి ఎన్టీఆర్ బేబీ కిట్లు ఆరోగ్యకరమైన వనరులుగా మారనున్నాయి.

యోగా దినోత్సవంలో ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, డీఆర్వో ఓబులేసు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతంచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. గురువారంసాయంత్రం స్థానిక మినీస్టేడియంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించనున్న యోగా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదువేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. 21న జరిగే యోగా కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు ఆ రోజున ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబులు విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అదేరోజు జిల్లాలో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 11 లక్షల మంది ప్రజలు యోగాంధ్రలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, అందుకోసం 6,458 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంట డీఆర్వో చిన ఓబులేషు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మెప్మా, డీఆర్‌డీఏ పీడీలు శ్రీహరి, నారాయణ, పశుసంవర్ధకశాఖ జేడీ రవికుమార్ ఉన్నారు.

స్మార్ట్‌జెన్ విద్యార్థినికి గిన్నిస్ రికార్డు



ఆరాధ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ గీతారాణి

సింగరాయకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక స్మార్ట్ జెన్ గ్లోబల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న కేవీ సాయి ఆరాధ్య హైదరాబాద్‌కు చెందిన భారత్ ఆర్ట్ అకాడమీ తరుపున ది లార్జెస్ట్ కూచిపూడి నృత్యంలో పాల్గొంది. కూచిపూడిలో అత్యుత్తమ ప్రదర్శన ప్రదర్శించినందుకు వరల్డ్ గిన్నిస్ రికార్డులో తన పేరును నమోదు చేసుకుంది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో సాయి ఆరాధ్యను కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి, ప్రిన్సిపాల్ లలిత అభినందించారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారి అనిల్‌కుమార్

పొదిలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ అధికారి వి అనిల్‌కుమార్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వ్యాధి ముఖ్యంగా దంతాలకు, ఎముకలకు వస్తుందన్నారు. నీటిలో ఫ్లోరిన్ ఎక్కువగా ఉండడం వలన ఈవ్యాధి వస్తుందన్నారు. దీన్ని నివారించుకునేందుకు సురక్షితమైన నీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. డీఫ్లోరైడ్ లేని నీటిని వాడడం మంచిదన్నారు. నీటిలోని డీఫ్లోరైడ్ శాతం తగ్గించడానికి పద్ధతులు ఉపయోగించాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు. దంతలపై మచ్చలు, దంతాల బలహీనత, ఎముకల నొప్పులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్‌చంద్ర, వైద్య సిబ్బంది ఉన్నారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

మంత్రి అచ్చెన్నకు ఎరిక్షన్‌బాబు విజ్ఞప్తి



పొగాకును కొనుగోలు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడికి విజ్ఞప్తి చేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో రైతులు పండించిన పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించి రైతులను ఆదుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కే అచ్చెన్నాయుడిని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కలసి వినతిపత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. బాపట్ల జిల్లాలోని పర్చూరు నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి అచ్చెన్నను ఎరిక్షన్‌బాబు స్థానిక నాయకులతో కలిశారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 2024.-2025 సంవత్సరాలలో ఎక్కువ మంది రైతులు పొగాకును సాగు చేశారని, రైతుల ఇళ్లల్లో పొగాకు బేళ్లు నిల్వ ఉన్నాయన్నారు. రైతుల నుంచి పొగాకును కొనుగోలు చేసేలా కృషి చేయాలని మంత్రికి ఎరిక్షన్‌బాబు కోరారు. ఆయనవెంట టీడీపీ నాయకులు బీవీ సుబ్బారెడ్డి, గద్దె మల్లయ్య, పుల్లలచెరువు మండల రైతులు ఉన్నారు.

సమగ్ర శిక్షలో బలవంతపు బదిలీల్లేవు

ఒంగోలు విద్య, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను బలవంతంగా బదిలీ చేయరు.. కేవలం సరస్పర బదిలీలు, అభ్యర్థన మేరకు మాత్రమే జరుగుతాయి.. బదిలీకి దరఖాస్తు చేయకపోతే ఎవరినీ కదలించరు.. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బదిలీల మార్గదర్శకాలను జారీ చేశారు. సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టులో వివిధ విభాగాల్లో 1300 మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. అభ్యర్థన లేకుండా ఎవరినీ బదిలీ చేయవద్దని ఆదేశించారు. బదిలీలకు దరఖాస్తుల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమైంది. జిల్లాయూనిట్‌గా బదిలీలు జరుగుతాయి. కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, విలీనవిద్య రిసోర్స్ పర్సన్లు, పార్ట్‌టైం ఇనస్ట్రక్టర్లు, క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్లు, మండల అకౌంటెంట్లు, సైటు ఇంజనీర్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీసు సబార్డినేట్‌లకు బదిలీలు జరుగుతాయి. బదిలీల్లో పోస్టుల భర్తీలో కేటగిరీ 4, 3లోని పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. బదిలీల ప్రక్రియను అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటరు జిల్లానోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. అంతర్ జిల్లా బదిలీలకు సంబంధించి చర్యలు తీసుకుంటారు. బదిలీలకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఏపీసీ మెంబరు కన్వీనర్‌గా, డీఈవో, డైట్ ప్రిన్సిపాల్, ఎఫ్ఏవో, ఏవో, జీసీడీవోలు సభ్యులుగా ఉంటారు. బదిలీలకు సంబంధించి జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ బదిలీలు జరగనున్నాయి.

యోగాంధ్రలో చందలూరు విద్యార్థులకు అవకాశం

ప్రధాని మోదీతో యోగాసన వేదిక పంచుకోనున్న శ్రుతి

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 21న వైజాగ్ అంతర్జాతీయ యోగా దినోత్సవం









పంగులూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, జాతీయస్థాయి యోగా పోటీలలో ప్రతిభ చాటిన చందలూరు ఉన్నత పాఠశాల బాలబాలికలకు ఈ నెల 21వ తేదీన విశాఖ కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనే అవకాశం లభించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి యోగా క్రీడాకారిణి నాయపాము శ్రుతి, మంగిశెట్టి వెంకటేష్‌లతో పాటు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న నాయపాము ప్రీతి, నాయపాము భవ్యశ్రీ, నాయపాము హాసినిలు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కొండా ప్రతిమ నేతృత్వంలో గురువారం విశాఖ వెళ్లారు. విశాఖలోని ఆర్.కె.బీచ్ లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగా వేడుకలో పాల్గొనే అవకాశం లభించడంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాని మోదీ వేదికపై శ్రుతికి అవకాశం

వైజాగ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే యోగాసన కార్యక్రమంలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని, జాతీయస్థాయి యోగా క్రీడాకారిణి శ్రుతికి దక్కింది. నెల రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న యోగా మాసోత్సవాలలో భాగంగా బాపట్ల జిల్లా కేంద్రంలో 10 నుంచి 18 ఏళ్ల లోపు వయస్సువారికి నిర్వహించిన యోగా పోటీలలో శ్రుతి ప్రథమస్థానంలో నిలిచింది. అనంతరం ఈ నెల 16న విజయవాడలో జరిగిన రాష్ట్ర పోటీలలో శృతికి మూడో స్థానం దక్కింది. దీంతో శ్రుతికి అంతర్జాతీయ యోగాసన వేదికపై పాల్గొనే అవకాశం లభించిందని పీడీ ప్రతిమ తెలిపారు. రెండేళ్లుగా పీడీ ప్రతిమ వద్ద శిక్షణ తీసుకుంటున్న శ్రుతి పలు రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీలలో ప్రతిభచూపుతోంది.

గిరిజనుల అభ్యున్నతి కోసమే వికసిత్ కార్యక్రమాలు



పాలుట్లలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీటీడబ్ల్యూవో

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన సాధికారతే లక్ష్యంగా దర్తి ఆబ జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాలు గత మూడు రోజులుగా ఎర్రగొండపాలెం మండలంలోని చెంచు గూడాలలో జరుగుతున్నాయి. గురువారం నల్లమల అటవీ ప్రాంతమైన పాలుట్ల, గుట్టలచెను చెంచు గూడాలలో జిల్లా స్థాయి అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా పాలుట్ల గిరిజన పాఠశాలను డీటీడబ్ల్యూవో లక్ష్మి, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారులు, వాహన రాకపోకలు లేనటువంటి అటవీ ప్రాంతంలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న చిన్నారులను మెచ్చుకున్నారు. మంచి చదువును చదివి ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు. పలు ప్రశ్నలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజనులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మెడికల్ క్యాంప్ నిర్వహించి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో ఏటీడబ్ల్యూవో వెంకటేశ్వర్లు, ఐటీడీఏ పీవో కే నాగేశ్వరరావు, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ అంజయ్య, సర్పంచ్‌లు కే హనుమిబాయ్, శ్రీశైలపతి నాయుడు, డాక్టర్ వెంకటేశ్వర నాయక్, కార్యదర్శి నాగేశ్వరరావు, పాఠశాల్ హెచ్ఎం తాటి బైస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి మూడేళ్ల జైలు

ఒంగోలు క్రైం, జూన్19(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మాధవరావుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి శైలజ గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. కొమరోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020 మే 31న 12 ఏళ్ల బాలిక పట్ల మాధవరావు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కొమరోలులో పనిచేస్తున్న ఏఎస్ఐ గోపాలక్రిష్ణ కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ సాంబశివరావు దర్యాప్తు చేసి నిందితుని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ తరఫున గొట్టిపాటి శ్రీనివాసరావు తమ వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలుశిక్ష, జరిమాన విధించారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు చేసి నిందితునికి శిక్షపడేలా పనిచేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

మెగా పీటీఎంను విజయవంతం చేయండి

రాచర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 5వ తేదీన జరిగే మెగా పీటీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఎంఈవో గిరిధర్ శర్మ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో గురువారం ఆయన మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలతోపాటు కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో యోగాంధ్ర, తల్లికి వందనం, ఆధార్ అప్‌డేషన్, విద్యామిత్ర కిట్లను పంపిణీ, పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల వివరాలు తదితర అంశాలపై ఆయన చర్చించారు.

21న జరిగే యోగాంధ్రను విజయవంతం చేయండి

రాచర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. యోగాంధ్ర దేశవ్యాప్తంగా 21వ తేదీన జరుగుతుందని, అందులో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీలలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, అధికారులు, అనధికారులు ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఉదయం 6 గంటల నుంచి యోగా ప్రారంభమవుతుందని, మండల పరిధిలోని వివిధ కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

● సీఎం చంద్రబాబు ఆదేశం



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. యోగాంధ్ర కార్యక్రమంపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్వో చినఓబులేషు, అధికారులు చిరంజీవి, కిరణ్‌కుమార్, నారాయణ, శ్రీహరి, వెంకటేశ్వరరావు, రవికుమార్, సైమన్‌విక్టర్, డాక్టర్ బీమానాథ్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ యోగా కార్యక్రమం ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.

కంచర్ల రామయ్య మృతిపై మాగుంట సంతాపం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల అధినేత కంచర్ల రామయ్య మృతి పట్ల ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం సంతాపం వ్యక్తం చేశారు. రామయ్య మృతి చెందినట్లు తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న ఎంపీ మాగుంట ఫోన్ చేసి రామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను పరామర్శించారు. రామయ్య ఒక జర్నలిస్టుగా ప్రజలకు, ఇంజనీరింగ్ కాలేజీ అధినేతగా విద్యార్థి లోకానికి ఎనలేని కృషి చేశారన్నారు. మంచితనానికి, మానవత్వానికి ఆయన నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. రామయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢసంతాపాన్ని మాగుంట వ్యక్తం చేశారు.

లాసెట్‌లో శ్రీప్రతిభ విద్యార్థికి 133వ ర్యాంకు



యశ్వంత్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ లా సెట్‌లో ఒంగోలులోని శ్రీప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థి సుంకె యశ్వంత్ రాష్ట్ర స్థాయిలో 133వ ర్యాంకు సాధించారు. ఐదు సంవత్సరాల లా కోర్సుకు అడ్మిషన్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాన్ని సాధించారు. లాసెట్‌లో ర్యాంకు సాధించిన యశ్వంత్‌ను శ్రీ ప్రతిభ విద్యా సంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ నల్లూరి రామాంజనేయులు, సంస్థ సీఈవో నల్లూరి జయప్రకాష్‌నారాయణలు అభినందించారు. ఈ ఫలితం కళాశాల ఖ్యాతిని మరింత పెంచుతూ ప్రతిభతో పాటు శిక్షణ, నాణ్యతను ప్రతిబింబిస్తుందని వారు తెలిపారు.

సమగ్ర వివరాలతో ఐడీఆర్ఎన్ పోర్టర్ : డీఆర్వో



మాట్లాడుతున్న డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సమాచారంతో ఇండియన్ డిజాస్టర్ రిసోర్స్ నెట్‌వర్క్(ఐడీఆర్ఎస్) పోర్టర్‌ను రూపొందించినట్లు కేంద్ర విపత్తుల నిర్వహణ ప్రకటించింది. అందుకు సంబంధించి గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విపత్తుల సమయంలో వివిధ రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం కోసం ఈ వెబ్‌సైట్ దోహదపడుతుందని తెలిపారు. విపత్తుల నిర్వహణ విధులతో సంబంధం ఉన్న అన్నిశాఖల అధికారులు తమ వద్ద ఉన్న పరికరాలు, మానవ వనరుల వివరాలను ఈ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మర్రిపూడి సొసైటీ సీఈవోగా అశోక్

మర్రిపూడి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడి ప్రాథమిక సహకార సంఘం ఇన్‌చార్జి సీఈవోగా నల్లూరి అశోక్‌ను నియమిస్తూ పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య నియామక పత్రాన్ని అందజేశారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఆనంద్ దర్శి మండలానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో కందుల కొనుగోళ్లలో ఆటంకం ఏర్పడటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందుల నేపథ్యంలో మంత్రి స్వామి ఆదేశాల మేరకు చిమట సహకార సంఘం సీఈవోగా పనిచేస్తున్న అశోక్‌కు మర్రిపూడి సహకార సంఘం సీఈవోగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కందుల కొనుగోళ్లు వేగవంతం కానున్నాయి. నియామక పత్రం అందజేసే కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి మాజీ అధ్యక్షులు వెంకటరెడ్డి ఉన్నారు.

200 రోజుల పని దినాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న మస్తాన్

కొండపి, జూన్19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని వ్యసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే జీ.మస్తాన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని మూగచింతల, నెన్నూరుపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు.

పచ్చిరొట్ట పంటలను సాగు చేయాలి



వంగ మొక్కలను పరిశీలిస్తున్న ఏవో రమేష్‌బాబు

ఒంగోలు(రూరల్), జూన్19 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాలను సారవంతంగా చేయడానికి పచ్చిరొట్ట పంటలను సాగు చేయాలని ఏవో కె. రమేష్‌బాబు కోరారు. ఒంగోలు మండలం బొద్దులూరి వారిపాలెంలో గురువారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జామాయిల్ తోటలలో సాగు చేసిన కూరగాయ పంటలను పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. పచ్చిరొట్ట పంటలు సాగు చేసి 40రోజులు దాటిన తరువాత పొలంలో దున్ని వేయాలని, దీంతో భూములు సారవంతం అవుతాయని తెలిపారు. నవధాన్యాల కిట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వీవోఏలు కేశవ, బాలకృష్ణ, ఐశ్వర్య, కృష్ణవేణి, నాని పాల్గొన్నారు.

రేపు అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 21వ తేదీన ఒంగోలులో జరుగుతుందని పీడీసీఏ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యేవారు శనివారం ఉదయం 9గంటలకు స్థానిక మంగమూరు రోడ్‌లోని అసోసియేషన్ సబ్ సెంటర్‌లో హాజరు కావాలన్నారు. ఎంపికైన జట్టు జూలై 3వ తేదీ నుంచి మంగళగిరి, పేరేచర్లలో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అంతర్ జిల్లా పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నెం. 9701022333 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



రాంబాబును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సింగరాయకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాత సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని మల్లికార్జున్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై గౌదగట్లవారిపాలెం ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాంబాబును గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు సత్కరించారు. ఆయన కృషిని కొనియాడారు.



రోడ్డు పక్కన పేరుకున్న మురుగు

కొప్పోలురోడ్డులో మురుగు అవస్థలు

డ్రైనేజీ వ్యవస్థ లేక వెదజల్లుతున్న దుర్వాసన

దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిన వైనం

ఇబ్బందిపడుతున్న ప్రజలు

ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులోని పలు కాలనీల సమీపంలో సైడు కాలువల్లో మురుగునీరు పారుదల లేక స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగా కొప్పోలురోడ్డులోని ఇందిరమ్మకాలనీ, రాజీవ్ స్వగృహకాలనీ, డ్రీమ్స్ స్కూల్ దగ్గర సైడుకాలువలలో నీటి ప్రవాహం లేకపోవటంతో నెలలు తరబడి నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోంది. దీనికితోడు సైడుకాలువలు దోమలు ఉత్పత్తికేంద్రాలుగా మారాయి. ఈక్రమంలో ఆయా కాలనీల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువల్లో ఖాళీ ప్లాస్టిక్ బాటిల్స్, చెత్తాచెదారం పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి



సైడుకాలువలో రంగుమారిన మురుగు, పేరుకున్న చెత్తాచెదారం

పేలవంగా మర్రిపూడి మండల సమావేశం

● సమస్యలపై నోరుమెదపని ప్రజాప్రతినిధులు

మర్రిపూడి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయిలో మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు అర్థరహితంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై గళం ఎత్తాల్సిన ప్రజా ప్రతినిధులు మూగనోము నోస్తున్నారు. అధికారులు సైతం తమశాఖల నివేదికలు చదవడానికే పరిమితమవుతున్నారు. మండలలోని పలుగ్రామాలలో విద్యుత్ సమస్యలు ఆయా గ్రామస్థులను కలవరపెడుతున్నాయి. తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. గ్రామస్థులు తాగునీటిని బబుల్స్ ద్వారా కొని తాగాల్సి వస్తోంది. పలు చెరువుల కింద పంటకాలువలు ధ్వంసమయ్యాయి. చెరువు కట్టలు సైతం చిల్లచెట్లు పెరిగి బలహీనపడ్డాయి. గ్రామీణ లింక్‌రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గ్రామాల్లో మురుగునీటి సరఫరా నిలిపోయి కాలువల్లో దోమలు విలయతాండవం చేస్తున్నాయి. ఉపాధిహామీ కూలీలకు సకాలంలో డబ్బులు పడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధిక విద్యుత్ బిల్లులతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. పలు రహదారుల్లో చిల్లచెట్లు పెరిగిపోయి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. టంగుటూరు - పొదిలి ఆర్అండ్‌బీ రహదారి ప్రమాదకరంగా మారింది. అడుగడుగునా గోతులతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. పలురక్షిత నీటి ట్యాంకులు ఎప్పుడు కూలిపోయి ఏ ప్రమాదం జరుగుతందోనని ఆయా గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కూచిపూడి లాంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తరగతి గదులు, మౌలిక వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో సమస్యలు తాండవిస్తుంటే ప్రజాగొంతు వినిపించాల్సిన ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం అధికారులకు అలుసుగా మారింది. దీన్ని ఆసరా చేసుకొని కీలకమైన శాఖల అధికారులు సైతం సమావేశాలకు డుమ్మా కొడుతున్నారు. గురువారం జరిగిన సమావేశంలో గైర్హాజరు అవుతున్న అధికారులపై ఎంపీపీ వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఆయన కోరారు. ఎంపీడీవో జగదీస్, జడ్పీటీసీ సభ్యురాలు మాకినేని సుధారాణి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న ఎంపీపీ వెంకటరెడ్డి

పంచాయతీ కార్మికుల జీతాలను చెల్లించాలి

● ఉప్పుగుండూరులో ధర్నా



పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

నాగులుప్పలపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు చెల్లించాలని సీఐటీయూ మండలాధ్యక్షుడు నలతోటి రామారావు డిమాండ్ చేశారు. గురువారం పంచాయతీ కార్మికులు తమ పెండింగ్ జీతాల కోసం విధులు పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారికి సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి పంచాయతీ కార్మికులకు అధికారులు జీతాలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. పేద కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకుంటే వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ విషయం పలుమార్లు పంచాయతీ పాలకులు, అధికారులకు విన్నతించినా ఫలితం లేకపోవడంతో ధర్నా చేపట్టాల్సి వచ్చిందని సీపీఎం మండల కార్యదర్శి తూబాటి శ్రీకాంత్ అన్నారు. సర్పంచ్ దేవరకొండ జయమ్మ కార్మికులకు మద్దతుగా ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నిధులు ఉన్నాయని, అధికారులు జీతాలు చెల్లించకుండా ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ తనపై ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. వెంటనే కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. దాంతో నూతనంగా విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ధర్నా చేస్తున్న కార్మికుల వద్దకు వచ్చి సోమవారం నాటికి జీతాలు అందేలా చూస్తానని తెలపడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు కండ్లగుంట శ్రీనివాసరావు, తెలగతోటి శామ్యూల్ పాల్గొన్నారు.

దేశ రక్షణ, అభివృద్ధి కోసం ప్రధాని మోదీ కృషి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణ, అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న కృషి అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు పేర్కొన్నారు. వికసిత్ భారత్ కోసం పేదల అభివృద్ధి, సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. 11 సంవత్సరాల అమృతకాలం పేరుతో ప్రచురించిన కరపత్రాలను గురువారం స్థానిక అన్నవరప్పాడులో పార్టీ మండల అధ్యక్షురాలు దేవరపల్లి శ్రీలక్ష్మి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలు, అణగారిన వర్గాల ప్రజల కోసం 81 కోట్ల మందికి ప్రధానమంత్రి గరీబ్ అన్న కళ్యాణ యోజన కింద ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారని చెప్పారు. రైతు సంక్షేమానికి భరోసాగా కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ యోజన, మెగా ఫుడ్ పార్కులను ప్రారంభించారన్నారు. అలాగే రాష్ట్రం, ప్రకాశం జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, నాయకులు అమరసింహం, సీతారామయ్య, బి.విజయారావు, ధనిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో పిలిచి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై హత్యాయత్నం

● దుండగులతో దాడి చేయించిన ప్రేమికుడు

● ఒంగోలులో ఘటన

ఒంగోలు క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పరిచయం ఉన్న యువతి ప్రేమగా మాట్లాడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రమ్మని పిలిచి తన ప్రియుడుతో కలిసి హత్య చేసేందుకు యత్నించారు. ఈ సంఘటన ఒంగోలులోని కిమ్స్ ఆసుపత్రి సమీపంలో గల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు మండలం కరవది గ్రామానికి చెందిన ఓ యువతి, యలమంద అనే యువకుడు ఐదు నెలల క్రితం ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్ళారు. అక్కడ ఒంగోలు నగరం శ్రీరామ్‌కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బూసి వెంకటేష్ వారికి పరిచయం అయ్యాడు. ఈక్రమంలో సదరు యువతికి వెంకటేష్‌తో ప్రేమగా మాట్లాడుతూ సన్నిహితులయ్యారు. ఇలా నాలుగు నెలలు తరువాత ఆ యువతి, యలమంద కలిసి హైదరాబాద్ నుంచి తిరిగి స్వగ్రామం వచ్చారు. అయితే వారి ఇరువురు ప్రేమించుకున్నారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న వెంకటేష్‌తో తన ప్రియురాలు మాట్లాడుతుందని గుర్తించిన యలమంద ఆమెతో గొడవపడ్డాడు. ఈక్రమంలో ఇరువురు కలిసి ఓ పథకం రూపొందించారు. తన ప్రియురాలితో సన్నిహితంగా ఉంటున్న వెంకటేష్‌ను అడ్డు తొలగించాలని యలమంద తన మిత్రులతో కలిసి మాట్లాడుకున్నాడు. ఈనేపథ్యంలో తన ప్రియురాలితో వెంకటేష్‌కు ఫోన్ చేయించాడు. మనం కలవాలంటూ వెంకటేష్‌ను ఒంగోలుకు పిలిపించారు. కిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఉన్నానంటూ ఆమెతో ఫోన్ చేయించాడు యలమంద. దీంతో అక్కడకు కారులో వెంకటేష్ రాగానే యలమంద, మరో నలుగురు యువకులు పూటుగా మద్యం తాగి అతడిని చితకబాది హత్యాయత్నం చేశారు. అదే సమయంలో గస్తీలో ఉన్న పోలీసులు గుర్తించి అక్కడకు వెళ్లేసరికి దుండగులు పరారీ అయ్యారు. చావుబతుకుల మధ్య ఉన్న వెంకటేష్‌ను వెంటనే రిమ్స్‌కు తరలించారు. దుండగులలో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

ఉత్సాహంగా యోగా సాధన

మద్దిపాడు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఒంగోలు నగరంలో ముందస్తు యోగా వేడుకలు నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేట శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో దేవ దాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో ఆలయాల అర్చకులు, సిబ్బందితో పాటు పలువురు భక్తులు ఉత్సాహంగా యోగా సనాలు వేశారు. దేవస్థాన ఈవో రావెళ్ల శివశంకర్ పాల్గొన్నారు.

- స్థానిక అంజయ్యరోడ్ ఏకేవీకే కళాశాల ఎదురుగా ఉన్న నిరంతర యోగా కేంద్రంలో యోగా గురువులు బత్తినేని సుబ్బారావు, చుండూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో యోగా సాధన చేశారు. అనంతరం సుబ్బారావు మాట్లాడుతూ ప్రకాశం యోగా విజ్ఞాన కేంద్రం ద్వారా ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు నిరంతర యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవంలో ప్రజలు పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆవుల ప్రసాద్, తులసి తదితరులు పాల్గొన్నారు.



యోగా ఆసనాలు వేస్తున్న సాధకులు

ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అమలుపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉద్యోగుల ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అమలు జరిగే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నోటిఫికేషన్ జారీచేయడం పట్ల మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్ హర్షం వ్యక్తంచేశారు. గురువారం ఒంగోలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించిందన్నారు. అదేవిధంగా ఎస్సీ ఉద్యోగుల ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అమలు చేసే విధంగా జీవోకు సవరణ చేయడంపై ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాదిగలను అన్ని విధాలుగా మోసం చేశారని ఆరోపించారు. అందుకే గత ఎన్నికల్లో ఆ ప్రభుత్వానికి మాదిగలు బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో త్యాగరాజు, విజయ, శ్రీను, జయరాజు, శేఖర్, ఇలియాజర్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి 97శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు గురువారం 97శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లలో జరిగిన పరీక్షకు 1785 మంది అభ్యర్థులను కేటాయించగా 1726 మంది హాజరు కాగా 59 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 889మందికి 851 మంది హాజరు కాగా 38 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 896కి 875 మంది హాజరు కాగా 21 మంది గైర్హాజరైనట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

నేడు సింగరాయకొండలో జాబ్‌మేళా

సింగరాయకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సయుక్తంగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు పలు బహుళజాతీయ కంపెనీలు హాజరవుతాయని పేర్కొన్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదువుకొని ఖాళీగా ఉన్న 18-30 ఏళ్ల మధ్యగల నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఒక ఇంటి ఓటర్లంతా జాబితాలో ఉండాలి



మాట్లాడుతున్న ఈఆర్వో కుమార్

కొండపి, జూన్19 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో ఒక ఇంటిలోని ఓటర్లందరూ ఒకేచోట, ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలని పలు పార్టీల నాయకులు కొండపి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.కుమార్‌ను కోరారు. గురువారం కొండపిలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకుల సమావేశం జరిగింది. ఈసమావేశంలో నాయకులు మాట్లాడుతూ పైవిధంగా సూచించారు. ఒక ఇంటిలోని ఓటర్లు పలు పోలింగ్ కేంద్రాల్లో ఉండటం వల్ల ఇబ్బందిగా ఉందని వారు తెలిపారు. ఈ విషయాన్ని ఈసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆర్వో కుమార్ తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకుడు వై.వెంకటేశ్వర్లు, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీపతి సతీష్, సీపీఎం నాయకుడు కేజీ మస్తాన్ పాల్గొన్నారు.

టీడీపీ బూత్, గ్రామ కమిటీల నియామకం

జరుగుమల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ బూత్, గ్రామ కమిటీలను నియమించారు. గురువారం జరుగుమల్లిలోని పార్టీ కార్యాలయంలో సమావేశమై ఈ ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమానికి అబ్జర్వర్‌గా నియోజకవర్గ పరిశీలకుడు స్వాములు హాజరయ్యారు.

రోగులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కొండపి, జూన్19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కొండపిలోని సీహెచ్‌సీలో రోగులకు ఆ పార్టీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీపతి సతీష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ప్రసన్నకుమార్‌రాజు పాల్గొన్నారు.

యోగా విశిష్టతను చాటిన తహసీల్దార్



తహసీల్దార్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న నాయకులు

కొండపి, జూన్19 (ఆంధ్రజ్యోతి): యోగా ప్రాధాన్యతను తన పాట ద్వారా తహసీల్దార్ శీలం శ్రీనివాసరావు చాటిచెప్పారని కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి అన్నారు. రాష్ట్రస్థాయి యోగాంధ్ర పాటల పోటీల్లో తృతీయ స్థానంలో శ్రీనివాసరావును గురువారం తహసీల్దార్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, ఆరు మండలాల తహసీల్దార్లు సన్మానించారు. ఈసందర్భంగా పలువురు తహసీల్దార్లు కొండపి తహసీల్దార్ శ్రీనివాసరావును శాలువాలు, పూలదండలతో సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.కుమార్, తహసీల్దార్లు పుల్లారావు, జనార్ధన్‌రావు ఆంజనేయులు, కొండపి ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బత్తుల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి మరణం టీడీపీకి తీరనిలోటు

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నాయకురాలు సరస్వతి మరణం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం వెల్లంపల్లిలో జరిగిన సరస్వతి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతి టీడీపీలో ఎంతో చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు.

ఆరోగ్య కేంద్రాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

మద్దిపాడు, జూన్19 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో పెరుగుతున్న రొమ్ము సర్విక్ ఓరల్ క్యాన్సర్లను గుర్తించేందుకు వీలుగా ప్రభుత్వం స్క్రీనింగ్ కేంద్రాలను అందుబాటులోకి తేనుంది. ఇందులో భాగంగా మద్దిపాడు ఆరోగ్య కేంద్రంలో స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు. రొమ్ము ఓరల్ గర్భాశయం ముఖ ద్వారం సర్విక్ క్యాన్సర్లు గుర్తించేందుకు ముందస్తు పరీక్షలు చేస్తారు. మహిళా వైద్యులతో పాటు మహిళా సిబ్బంది ఈ సేవలు అందిస్తారని డాక్టర్ ఆనంద్‌మోహన్ గురువారం తెలిపారు. అనుమానిత లక్షణాలు గుర్తిస్తే వారిని జిల్లా వైద్యశాలకు పరీక్ష నిమిత్తం పంపించి చికిత్స చేస్తారన్నారు. మధుమేహం, రక్తహీనత, థైరాయిడ్, అయోడిన్ సమస్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

■ ముఖాముఖి

సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకోవాలి

బీ సంగమేశ్వరరెడ్డి, వ్యవసాయాధికారి



ప్రశ్న : పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు ఏమి తెలియ జేస్తున్నారు?

జవాబు : రైతులకు నూతన వ్యవ సాయ పద్ధతులు, సాంకేతిక పరి జ్ఞానం తెలియజేయడమే దీని ఉద్దేశం. ప్రతి వారంలో రెండు రోజుల పాటు నాలుగు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అధునా తన సాంకేతిక వ్యవసాయ పద్ధతులు తెలియజేస్తాం.

ప్ర : వ్యవసాయ సీజన్ ప్రారం భంలో రైతులకు మీరిచ్చే సూచనలు ఏమిటి?

జ : త్రిపురాంతకం ప్రాంతంలో భూసార పరీక్షలు ద్వారా తెలిసిన సారాంశం బట్టి రైతులు పచ్చిరొట్ట ఎరు వులు సాగు చేస్తే మంచిది. జీలుగలు, జనుములు, పిల్లిపెసర వంటి వాటిని సాగు చేసి 45 రోజుల తరువాత భూమిలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది. రైతులు ఈ విధానం ఆచరించాలి.

ప్ర : మొక్కజొన్నలో ఇటీవల గుర్తిం చిన లోపాలకు మీరిచ్చే సలహాలు?

జ : మండలంలో సాగు చేసిన మొక్కజొన్నలో సూక్ష్మధాతు లోపాలు గుర్తించాం. జింకులోపం కూడా ఈ భూముల్లో ఉంది. కాబట్టి ఎకరాకు 20 కిలోల జింకు భూమిలో వేసుకుని దీనిని నివారించవచ్చు.

ప్ర : వేసవి పత్తిలో తెగుళ్ల నివారణ చర్యలు ఏమిటి?

జ : ప్రస్తుతం వేసవి పత్తి పూత, కొన్నిచోట్ల కాయ దశలో ఉంది. ఈ సమయంలో కాయతొలుచు పురుగు, రసం పీల్చేపురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ లీటరు నీటికి 1 ఎంఎల్ చొప్పున పిచి కారీ చేయాలి. ఇతర ఏ సమస్యలు ఉన్నా రైతులు నేరుగా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి సలహాలు తీసుకోవాలి.

అధ్వానంగా మరుగుదొడ్లు

- మూత్రశాలల్లో కొరవడిన పారిశుధ్య చర్యలు
- అధిక రేట్లు వసూలు
- కంపుతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : లక్షా 10వేలకు పైగా జనాభా ఉన్న మార్కాపురం పట్టణం, పైగా డివిజన్ కేంద్రం, నిత్యం వేలాది మంది మార్కాపురం పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. మున్సిపల్ పరిధిలో పట్ట ణంలో ఉన్న వివిధ మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వాన్నంగా తయారయ్యాయి. కొన్ని ప్రాంతాలలో మూత్రశాలలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. పట్టణంలో 2015లో కూరగాయాల మార్కెట్, కోర్టు సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, సప్తగిరి లాడ్జి వద్ద మూత్రశాలలను ఏర్పాటు చేశారు. కానీ పర్యవేక్షణ, పారిశుధ్య చర్యలు కొరవడంతో వాటిలో కొన్ని పనికిరాకుండా పోయాయి. కూరగాయల మార్కెట్ వద్ద ఎంతో అవసరమైన మూత్రశాల మూలనపడి ఉంది. వినియోగంలోకి తేవాల్సిన అధి కారులు దానిని గాలికొదిలేశారు. ఎన్నికల సమ యంలో కోర్టు సెంటర్‌లోని మూత్రశాలను తొలగిం చారు. ఆర్టీసీ బస్టాండ్, సప్తగిరి లాడ్జి వద్ద నున్న మూత్రశాలలు దుర్గంధంగా ఉంది. సాక్షాత్తు మున్సి పల్ కార్యాలయం పక్కనే ఉన్న మరుగుదొడ్లలో సౌక ర్యాలు లేకపోవడంతో పాటు ప్రజల వద్ద నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారు. మరుగుదొడ్లకు రూ.5 చెల్లించాల్సి ఉండగా రూ.10 వసూలు చేస్తు న్నారు. చేపల మార్కెట్, ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న మరుగుదొడ్లలో కూడా ఇదే పరిస్థితి. మరుగు దొడ్ల వద్ద ధరల బోర్డు కచ్చితంగా ఏర్పాటు చేయాలి. కానీ లేదు. మరుగుదొడ్లలో హ్యాండ్ వాష్, డెటాల్ సబ్బు, కలరా ఉండలు వేయాల్సి ఉండగా ఇవేవి కానరావు. కంపుకొడుతున్న నీళ్లే గతి. అయ్య ప్పస్వామి గుడి ఎదురుగా ఉన్న మరుగుదొడ్లదీ అదే పరిస్థితి. పాతబస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లను విస్తరణలో భాగంగా కూల్చివేశారు. పట్టణంలోని కంభం సెంటర్, దోర్నాల సెంటర్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాలలో మూత్రశాలలు లేవు. మున్సి పాలిటీ ఆధీనంలోని మరుగుదొడ్లలో కాంట్రాక్టర్లు, అక్కడ ఉన్న సిబ్బంది అధిక రేట్లు వసూలు చేస్తు న్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మరుగుదొడ్లు మూత్రశాలల్లో పరిశు భ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి.



మున్సిపాలిటీ వద్ద అధిక ధరలను వసూలు చేస్తున్న మరుగుదొడ్లు



సప్తగిరి లాడ్జి వద్ద అధ్వానంగా మూత్రశాల



కోర్టు సెంటర్‌లో తొలగించిన మూత్రశాల

అధిక ధరలు వసూలు చేయరాదు

మున్సిపల్ మరుగుదొడ్లలో అధిక ధరలు వసూ లు చేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ నారా యణరావు తెలిపారు. ఆయా మరుగుదొడ్ల వద్ద బో ర్డుల పట్టిక ఏర్పాటు చేస్తామన్నారు. నిత్యం శానిట రీ ఇన్‌స్పెక్టర్, ఏఈలు పారిశుధ్య విభాగం సిబ్బంది పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బందెలదొడ్డిలో నీటి పాట్లు

గిద్దలూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని రేడియోబావి సెంటర్ నందు గల బందెల దొడ్డి వీధిలో నీటి సమస్య నెలకొన్నది. గత మూడు రోజులుగా కొళాయిలకు నీరు రాక ఆప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీసం మున్సిపల్ ట్యాంక ర్లను కూడా పంపక పోవడంతో ప్రైవేటు ట్యాంక ర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆప్రాంత ప్రజలు వాపోతున్నారు. వెంటనే బోరుకు మరమ్మతులు చేసి లేదా పక్కవీధుల నుంచి పైపు లైన్ నీటిని మళ్లించి నీటి సమస్య తీర్చాలని స్థాని కులు కోరుతున్నారు.

గోమాతకు శస్త్ర చికిత్స

పెద్దదోర్నాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : దోర్నాల వీధుల్లో తిరుగుతన్న గోవుకు కన్నుకు తీవ్ర గాయమై రక్త సిక్తంగా వీధుల వెంట తిరుగుతోంది. గాయంతో ఇబ్బందులు పడు తున్న గోవును చూసిన సత్యసాయి సేవా సంస్థకు చెందిన రమణారెడ్డి గోపాలమిత్ర కావడంతో గాయాన్ని శుభ్రం చేసి శస్త్ర చికి త్సలు నిర్వహించాడు. జంతు ప్రేమికులు ఆయన్ని అభి నందించారు.

గోవుకు శస్త్ర చికిత్స చేసిన రమణారెడ్డి





వైద్యశాలలో బాధితులను పరామర్శిస్తున్న ఎరిక్షన్‌బాబు

బాధితులను పరామర్శించిన ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నగుడి పాడు గ్రామంలో బుధవారం జరిగిన టీడీపీ వైసీపీ వర్గీయుల ఘర్ష ణలో గాయపడిన టీడీపీ నాయకులు ఐనేని పెద్ద ఆంజనేయులు, చిన్న ఆంజనేయులు నర్సరావుపేట అరవిందబాబు వైద్యశాలలో చికిత్సలు పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు గురువారం వారిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. వైసీపీ వర్గీయుల దాడిని ఎరిక్షన్‌బాబు ఖండించారు. పరామ ర్శించినవారిలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దొడ్డా శేషాద్రి ఉన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

రాచర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుమలపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మండల ఆర్యవైశ్య సంఘం అధ్య క్షుడు లకుమారపు రమణ నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు తనవంతు సహకారం అందించాలన్నదే తన ఆశయమన్నారు.కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, ఎస్‌ఎంసీ చైర్మన్ కాశయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ముస్లిం మైనారిటీ సంఘ నాయకులు

గిద్దలూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మసీద్‌లలో పని చేస్తున్న ఇమామ్‌లు, మౌజన్‌లకు వేతన బకాయిలను వెంటనే చెల్లించి ఆదుకో వాలని ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక బిలాల్ మసీద్ ఆవరణలో ఇమామ్‌లు, మౌజన్‌ల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మహబూబ్‌బాషా మాట్లాడుతూ గత 8 నెల లుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇమామ్‌లు, మౌజన్‌ల కుటుం బాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాచర్ల మండలం ప్రభుత్వ ఖాజీని నియమించాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షులు పఠాన్ జఫ్రుల్లాఖాన్ మాట్లాడుతూ వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని అధికారులను కోరారు. సమావేశంలో ఇమామ్‌లు, మౌజన్‌ల సంఘం ప్రతినిధులు పఠాన్ మహబూబ్‌ఖాన్, షబ్బీర్, హుస్సేన్‌పీరా, దస్తగిరి పాల్గొన్నారు.

సమ్మెకు సహకరించాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మి కుల సమ్మెకు సహకరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ అన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని కార్మి కులు ఈనెల 20 తర్వాత సమ్మెకు వెళుతున్నారని, ప్రజలు సహకరిం చాలని కోరుతూ కార్మికులు గురువారం బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, రూబెన్, సలాంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొమరోలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30గంటలకు మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో చెన్నారావు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల, గ్రామ స్థాయి ప్రభుత్వ అధికారులు విధిగా హాజరుకావాలని తెలిపారు. పూర్తి స్థాయి సమాచారంతో హాజరుకావాలని తెలిపారు.

మోటార్ సైకిళ్లు ఢీ.. ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమణారెడ్డి

రాచర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న మోటారు సైకిళ్లు ఢీకుని ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని అనుమలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం జరిగింది. జేపీచెరువు గ్రామానికి చెందిన చెదలూరి రమణారెడ్డి రాచర్లకు వచ్చి పనులు చూసుకుని తిరిగి వెళ్తుండగా, చోళ్లవీడుకు చెందిన రమణ, నెమలిగుండం, దాన మయ్య ముగ్గురు వ్యక్తులు గిద్దలూరుకు బైక్‌పై వస్తుండగా అనుమల పల్లి సబ్‌స్టేషన్ వద్ద ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమా దంలో రమణారెడ్డి తలకు తీవ్రగాయాలు కాగా, రమణ, నెమలి గుండం, దానమయ్యకు స్వల్పగాయాలయ్యాయి. 108లో గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రమణారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో నంద్యాలకు తరలించారు. రాచర్ల ఎస్సై ఇమ్మానియేలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గిద్దలూరు టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. వచ్చేనెల 5వ తేదీన జరుగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, భరణం కేసులు, గృహ హింస కేసులు, రాజీపడదగిన క్రిమి నల్ కేసులు, ప్రిలిటికేషన్ కేసులు, బ్యాంక్‌లకు, టెలిఫోన్‌కు సంబంధిం చిన కేసులు, పంచాయతీ ఆస్తి పన్నులు, బిల్డింగ్‌ప్లాన్లు, మ్యుటేషన్, నీటి కలుషితం, వాతావరణ కలుషితం సంబంధించిన అన్ని రకాల కేసులను ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరిస్తారన్నారు. కక్షిదారులం దరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారి ఓంకార్ ఒక ప్రకటనలో తెలిపారు.

నికరంపల్లిలో తాచును పట్టిన స్నేక్ క్యాచర్

మార్కాపురం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నికరంపల్లి గ్రా మంలో నివాసాల మధ్య సంచరిస్తుం దని స్థానికులు స మాచారం ఇవ్వడంతో తాచు పామును స్నేక్ క్యాచర్ నిరంజన్ గురువా రం చాకచక్యంగా పట్టుకున్నారు. దీంతో అక్కడివారు ఊపిరిపీల్చుకున్నారు. నివాసాల మధ్య పాము కన్పిస్తే దానికి హాని చేయకుండా వెంటనే తనకు సమా చారం ఇస్తే పట్టుకొని అడవిలో విడిచిపెడ తానని నిరంజన్ తెలిపారు.



తాచు పామును పట్టు కుంటున్న నిరంజన్



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సికిల్‌సెల్ వ్యాధిపై అప్రమత్తం

రాచర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సికిల్ సెల్ (ఎర్ర రక్త కణాల సంబం ధిత వ్యాధి) పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనుమలవీడు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ ముత్యాలప్రసాద్ అన్నారు. అంత ర్జాతీయ సికిల్ సెల్ వ్యాధి నివారణ దినం సందర్భంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఆ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎర్ర రక్తకణాలు సాధారణంగా గుండ్రంగా కాకుండా పొడవైన ఆకారంలో ఉంటాయని, అలా ఉన్న కణాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయన్నారు. శ్వాస తీసుకోవడం, చేతులు, కాళ్ల నొప్పి రావడం, పక్షవాతం లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తా యన్నారు. కార్యక్రమంలో హెల్త్ కమ్యునిటీ ఆఫీసర్ రామాంజనేయులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా రమేష్

రాచర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుమలవీడు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారిగా డాక్టర్ కనుమర్ల రమేష్ నియ మితులయ్యారు. ఈయన ఏలూరు జిల్లా ఏలూరు మండలం కుకునూరు పీహెచ్‌సీలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీలో ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ కమలాదేవి సంజీవరాయునిపేట పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు.

మోదీ పాలనలో దేశాభివృద్ధి



గిద్దలూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పరిపాలనలో దేశం అభివృద్ధి పథంలో నడిచిందని బీజేపీ నాయకులు అన్నారు. బీజేపీ నాయకులు పట్టణంలోని ఆర్టీసీ డిపో తదితర ప్రాంతాలలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. పేదలకు సేవ, రైతు సంక్షేమం, మహిళలకు ప్రోత్సాహం, ఆరోగ్య సంరక్షణ, ప్రపంచ ఆర్థిక రంగంలో సూపర్‌పవర్ తదితర కరపత్రాలలోని అంశాలను ప్రజలకు వివ రించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు బొంతల కృష్ణనా యకులు శాసనాల సరోజిని, పీవీ కృష్ణారావు, ఎం.చిన్నయ్య, పొట్టి సుబ్బా రావు, రామకృష్ణ, గురుమూర్తి, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

గిద్దలూరు : ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో జరిగిన సంక్షేమం, అభివృ ద్ధికి సంబంధించిన కరపత్రాలను బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రజ లకు అందించారు. పట్టణంలోని 195వ పోలింగ్ బూత్ పరిధిలోని వీధులకు నాయకులు వెళ్లి ప్రజలకు కరపత్రాలను అందించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు, పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షుడు కొప్పరపు నాగేశ్వర రావు, నాయకులు ఎం.పుల్లయ్య, వెంకటేశ్వర్లు, రామకృష్ణ పాల్గొన్నారు.

మూడు రోజులపాటు కరెంట్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అంబవరం సబ్‌స్టేషన్ పరి ధిలో ఈనెల 20 శుక్రవారం నుంచి 22వ తేదీ ఆదివారం వరకు ఆర్ డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ బి.శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించాలన్నారు.

పార్టీ సంస్థాగత కమిటీలను పూర్తి చేయాలి

మార్కాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న కమిటీలను వెంటనే పూర్తి చేయాలని టీడీపీ సంస్థాగత కమి టీల నియోజకవర్గ పరిశీలకుడు ఎస్‌ఎమ్‌డీ ఫిరోజ్ అన్నారు. జవహర్‌నగర్ కాల నీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకుల సమా వేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజ రైన పార్టీ సంస్థాగత కమిటీల నియోజక వర్గ పరిశీలకులు ఫిరోజ్ మాట్లాడుతూ పార్టీ కమిటీలను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. ఏవైనా పెండింగ్ లుంటే నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని అందరినీ సమన్వయ పరిచి వెంటనే కమిటీలను వేసుకోవాల న్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పార్టీ కోసం శ్రమించిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందనే భరోసా వారికి ఇవ్వాలన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వ యంతో పనిచేయాలన్నారు. నియోజకవర్గ పోల్‌మేనేజిమెంట్ క్లస్టర్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైని కుడిలా కష్టపడి పనిచేయడంవల్లే 2024లో పార్టీ అధికారంలోకి వ చ్చిందన్నారు. కార్యకర్తల సేవలను చంద్రబాబు ఎన్నికటికీ మరువర న్నారు. కార్యక్రమంలో మాలపాటి వెంకటరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారా యణ, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మైనార్టీ నాయకులు పఠా న్ హుసేన్‌ఖాన్, గులాబ్ పాల్గొన్నారు.



నియోజకవర్గ పరిశీలకుడు ఫిరోజ్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు



బస్సు పత్రాలను పరిశీలిస్తున్న ఎమ్‌వీఐ

స్కూల్ బస్సులు ఫిట్‌నెస్‌తో ఉండాలి

మార్కాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ బస్సులు తప్పక ఫిట్‌నెస్ కలిగివుండాలని మార్కా పురం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎమ్‌వీఐ) ఎమ్.మాధవరావు అన్నారు. మార్కాపురం ఉపరవా ణాశాఖాధికారి ఆదేశాల మేరకు గురువారం పట్ట ణంలో తిరుగుతున్న స్కూల్ బస్సులను ఆయన తనిఖీ చేశారు. ప్రతి వాహనానికీ సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అనంతరం వాహనాన్ని పూర్తి స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్కూల్ బస్సులపైన స్పెషల్ డ్రైవ్ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ప్రతి బస్సులో తప్పకుండా ఆర్‌సీ, ఇన్సూరెన్స్, మెడికల్ కిట్, ఫైర్ సిలిండర్ తప్పక ఉండాలన్నారు. డ్రైవర్లు కూడా తప్పకుండా లైసెన్స్ కలిగివుండాలన్నారు. ఎలాంటి పత్రా లు లేక పోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఎర్రగొండపాలెంలో సాగుకు సిద్ధంగా ఉన్న పొలం

ఖరీఫ్ సాగుకు భూములు సిద్ధం

వర్షం కోసం రైతుల ఎదురు చూపు

ఎర్రగొండపాలెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మండల కేంద్రంతో పాటు చుట్టూ ఉన్న గ్రామాల రైతులు 15 రోజుల కిందట కురిసిన వర్షాలకు తడి దుక్కులు దున్ని రైతులు ఖరీఫ్ సాగుకు భూములు సిద్ధం చేశారు. అయినా నేటికీ వానలు కురవకపోవడంతో ఖరీఫ్ వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. వర్షం కురిస్తే విత్తనాలు విత్తుకునేందుకు ముందస్తుగా రైతులు విత్తనాలు కొనుగోలుచేశారు. ఖరీఫ్ సీజన్‌లో వరి 7 హెక్టార్లు, జొన్న 8 హెక్టార్లు, నల్లపెసలు 34 హెక్టార్లు, కంది పైరు 1225 హెక్టార్లు, ఆముదాలు 44 హెక్టార్లు, పత్తి 2366 హెక్టార్లు, మిర్చి 2942. ఉల్లిగడ్డలు 98 హెకార్లు, కూరగాయాలు సాగు 995 హెక్టార్లలో, సొద్ద 1 హెక్టారు, జొన్న 4 హెక్టార్లు విస్తీర్ణంలో రైతులు పైర్లు సాగు చేసేందుకు వ్యవసాయ భూ ములను సిద్ధం చేసి ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు.

రీసర్వేలో తప్పులను సరిచేస్తున్నాం

మార్కాపురం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రీసర్వేలో జరిగిన తప్పు లను సరిదిద్ది రైతులకు నష్టం జరకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు తహ సీల్దార్ చిరంజీవి తెలిపారు. మండలం లోని శివరాంపురం గ్రామంలో గతంలో రీసర్వేలో రైతులకు జరిగిన తప్పులను సరిచేసేందుకు గురువారం అధికారులతో కలిసి భూములను క్షేత్ర స్థాయిలో తహ సీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గత ప్రభు త్వం నిర్వహించిన భూ సర్వేలో ఒక రైతు కు ఒక కమతం ఇవ్వలేక కొంతమంది రైతులతో కలిసి ఒకే కమతంగా ఇవ్వడం వలన కొందరికి వాస్తవంగా ఉన్న భూమి కంటే ఆన్‌లైన్‌లో అధికంగా కనబడడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలలైన తల్లికి వం దనం వంటి పథకాలనకు అనర్హులుగా మిగిలిపోతూ నష్టపోతున్నారని తెలిపా రు. అలాంటివారి సమస్యలను పరిష్కరి స్తున్నామన్నారు. కార్యక్రమంలో రెవె న్యూ సిబ్బంది, సర్వేయర్‌లు పాల్గొన్నారు.



శివరాంపురం పరిధిలో రీసర్వే భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

దొనకొండ ఎంపీడీవోగా వసంతరావునాయక్



వసంతరావునాయక్‌ను అభినందిస్తున్న సిబ్బంది

దొనకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వసంతరావునాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పుల్లలచెరువు ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన శ్రీదేవి బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా వసంతరావు నాయక్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులోని ఉండి ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా బాధ్యతగా పనిచేస్తానని చెప్పారు. కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు ఎంపీడీవోను అభినందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దొనకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో వసంతరావు నాయక్ తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు వారిశాఖలకు చెందిన పూర్తి సమాచారంతో సకాలంలో హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని కోవిలంపాడు పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఆర్కే వలి ఆర్థి సహకారంతో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వలి మాట్లాడుతూ పాఠశాల అవసరాలకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో చందలూరి బాలకాశయ్య, తిరుపతయ్య, టి.బాబు, డోలా శేషాద్రి, డి.నారాయణ, ఆర్కే షకీర్ పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

సీఎస్‌పురం(పామూరు), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దర్శిలో ఈనెల 21,22,23 తేదీల్లో జరిగే సీపీఐ 17వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ మండల కార్యదర్శి పెద్దమస్తాన్ పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను గురువారం సీఎస్‌పురంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈసందర్భంగా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గువ్వల నరసింహులు, ఎస్కే మౌలాలి, ఎస్.నారాయణ, ఎస్.రాయులు, వెంకటస్వామి, గణేష్ పాల్గొన్నారు.

టవర్ ఏర్పాటుకు స్థల పరిశీలన

సీఎస్‌పురం(పామూరు), జూన్ 19(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం బోయమడుగుల పంచాయతీ బాలుపల్లిలో బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ నిర్మాణానికి గురువారం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు స్థలపరిశీలన చేశారు. 2024లో టవర్ ఏర్పాటుకు కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి స్థలపరిశీలన చేశారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొట్ల చిరంజీవి యాదవ్, ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, వీఆర్వో మాలకొండయ్య పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. యోగాంధ్ర కార్యక్రమంపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్వో చినఓబులేషు, అధికారులు చిరంజీవి, కిరణ్‌కుమార్, నారాయణ, శ్రీహరి, వెంకటేశ్వరరావు, రవికుమార్, సైమన్‌విక్టర్, డాక్టర్ బీమానాథ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ యోగా కార్యక్రమం ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.

సమగ్ర వివరాలతో ఐడీఆర్ఎన్ పోర్టర్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సమాచారంతో ఇండియన్ డిజాస్టర్ రిసోర్స్ నెట్‌వర్క్(ఐడీఆర్ఎస్) పోర్టర్‌ను రూపొందించినట్లు కేంద్ర విపత్తుల నిర్వహణ ప్రకటించింది. అందుకు సంబంధించి గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. విపత్తుల సమయంలో వివిధ రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం కోసం ఈ వెబ్‌సైట్ దోహదపడుతుందని తెలిపారు. విపత్తుల నిర్వహణ విధులతో సంబంధం ఉన్న అన్నిశాఖల అధికారులు తమ వద్ద ఉన్న పరికరాలు, మానవ వనరుల వివరాలను ఈ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని సూచించారు.

వేధిస్తున్న ఇంజనీరింగ్ అధికారుల కొరత

- కుంటుపడుతున్న పనులు
- దర్శి పంచాయతీరాజ్‌శాఖ దుస్థితి



దర్శి పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం

దర్శి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దర్శి పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారుల కొరత తీవ్రంకావటంతో పనులు కుంటుపడుతున్నాయి. ఎంతోకాలంగా ఇంజనీరింగ్ అధికారుల కొరత కొనసాగుతోంది. దీంతో రోడ్ల అభివృద్ధి పనులు, మరమ్మతుల పనులు సకాలంలో పూర్తికావటంలేదు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు, నిర్వాహకులు ఇంజనీరింగ్ అధికారులు సకాలంలో అందుబాటులోకి రాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు.

దర్శి పంచాయతీరాజ్‌శాఖ సబ్‌డివిజన్ పరిధిలో దర్శి, కురిచేడు, దొనకొండ, తాళ్ళూరు, ముండ్లమూరు మండలాలు ఉన్నాయి. ఐదుగురు ఏఈలు ఉండాల్సి ఉండగా, ఎంతోకాలంగా ఇద్దరు మాత్రమే ఉన్నారు. మిగిలిన మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దర్శి, కురిచేడు, దొనకొండ మండలాల్లో ఒక ఏఈ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. తాళ్ళూరు, ముండ్లమూరు మండలాల్లో మరో ఏఈ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖ పనులతో పాటు జడ్పీ పనులు కూడా వీరే నిర్వహించాల్సి ఉంది.

గతంలో జడ్పీ పనుల నిర్వహణకు ప్రత్యేక ఏఈ ఉండేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జడ్పీ పనులు నిర్వహించే ప్రత్యేక ఏఈలను తొలగించి వీరికే అప్పగించారు. దీంతో రెండు శాఖల పనులు ఈ ఇరువురు ఇంజనీరింగ్ అధికారులు నిర్వహించాల్సి రావటంతో పనిభారం అధికమైంది. దీంతో ఇంజనీరింగ్ అధికారులు వర్క్‌ఇన్‌స్పెక్టర్లపైన ఆధారపడాల్సి వస్తుంది. ఇంజనీరింగ్ అధికారుల కొరతతో పనులు భారం ఎక్కువై సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. ఇదే అదునుగా కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ముందుగా పర్సెంటేజీలు ఇచ్చిన కాంట్రాక్టర్ల పనులనుచేస్తూ మిగిలిన వారి పనులను జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతోకాలంగా అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మతుల పనులు చేట్టారు. ఉన్నతాధికారులు ఈ విషయాన్ని గుర్తించి ఇంజనీరింగ్ అధికారుల కొరతను భర్తీచేసి పనులన్నీ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధునాతన సౌకర్యాలతో వసతిగృహం

- గత వైసీపీ పాలనలో దయనీయం
- రూ.26 లక్షలతో మరమ్మతులు చేపట్టిన ప్రస్తుత ప్రభుత్వం
- విద్యా సంవత్సరం ప్రారంభానికి సర్వంసిద్ధం
- తల్లిదండ్రుల ఆనందం




వసతిగృహంలో ఆకర్షణీయంగా తయారైన స్టడీ ప్లాట్‌ఫాం

దొనకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని ఎస్సీ-1 బాలుర వసతిగృహం సరికొత్త సౌకర్యాలతో రూపుదిద్దుకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో వసతి గృహాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం ఏమాత్రం దృష్టిపెట్టలేదు. దీంతో విద్యార్థులు పడరాని పాట్లు పడ్డారు. అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి జిల్లాలో వసతి గృహాల్లో చదువుకునే పేద విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

ఈనేపథ్యంలో దొనకొండ ఎస్సీ-1 బాలుర వసతి గృహంలో అధునాతన సౌకర్యాల రూపకల్పనకు రూ. 26 లక్షలు మంజూరుచేసింది. ఈ నిధులతో వసతి గృహంలో స్టడీ ప్లాట్‌ఫాం, వాష్ ప్లాట్‌ఫాం, భవనం మొత్తం విద్యుత్ సౌకర్యం, బాత్‌రూమ్స్, టాయిలెట్స్ మరమ్మతులు, పెయింటింగ్స్, ప్రధాన గేట్ నుంచి టైల్స్‌తో రహదారి, తదితర మౌలిక సౌకర్యాలను సమకూర్చారు.

ప్రస్తుతం ఈ వసతిగృహంలో 3 నుంచి పదో తరగతికి చెందిన 190 మంది విద్యార్థులు ఉంటున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజు నుంచి విద్యార్థులను వసతిగృహంలో చేర్పించేందుకు వచ్చిన తల్లిదండ్రులు అభివృద్ధి పనులు చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈఏడాది వసతిగృహంలో అడ్మిషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.



వసతిగృహంలో ప్రధాన గేట్ నుంచి టైల్స్‌తో ఏర్పాటుచేసిన దారి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఉపాధ్యాయులకు ఎస్ఐ కోటయ్య సూచన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కోటయ్య

పీసీపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ఉపాధ్యాయులు అవగాహన కలిగిఉండాలని ఎస్ఐ జి.కోటయ్య అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో గురువారం ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, సంజీవి అధ్యక్షతన జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరాలపై పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్న సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని అన్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు నేరాల నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. పరిచయం లేని వ్యక్తుల నుంచి వీడియోకాల్స్, వాట్సప్ కాల్స్ వచ్చినప్పుడు స్పందించవద్దని సూచించారు. వాట్సప్‌లో తెలియని నెంబర్స్ నుంచి ఏపీకే ఫైల్స్ వచ్చినప్పుడు వాటిని ఓపెన్ చేయవద్దని సూచించారు. ఏదైనా సంఘటన జరిగినపుడు వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయడంతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

యాప్‌లో పన్నుల వివరాల నమోదులో

తాళ్లూరు వెనుకంజ

- ఎంపీడీవో దారా హనుమంతరావు



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

తాళ్లూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో వసూలు చేసిన పన్నుల వివరాలను స్వర్ణపంచాయతీ యాప్‌లో నమోదుచేయడంలో తాళ్లూరు మండలం వెనుకంజలో ఉందని ఎంపీడీవో దారా హనుమంతరావు తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పంచాయతీ అధికారికి పంపిన నివేదికలో మండలంలోని పంచాయతీల్లో 75శాతం పన్నులు వసూళ్ల చేసినట్టు తెలిపి 25శాతం మేర కూడా స్వర్ణ పంచాయతీయాప్‌లో నమోదు చేయలేదన్నారు. వసూళ్ల చేసిన పన్నులను ట్రెజరీలకు జమచేసి చలానా వివరాలను ఎందుకు యాప్‌లో నమోదు చేయలేదన్నారు. నమోదు చేయని కారణంగా తాళ్లూరు మండలం వెనుకంజలో ఉందన్నారు.

రెండు రోజుల్లో అన్ని పంచాయతీల పన్నుల వసూళ్ల రసీదులను స్వర్ణ పంచాయతీ యాప్‌లో నమోదు చేయాలని, లేకుంటే శాఖాపరచర్యలు తప్పవని ఎంపీడీవో హనుమంతరావు హెచ్చరించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శుక్రవారం జరగనున్న యోగాంధ్రను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల దరిచేర్చాలి

- ఎంపీపీ దంతులూరి ప్రకాశం



మాట్లాడుతున్న ఎంపీపీ దంతులూరి ప్రకాశం

కనిగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పథకాల లబ్ధిని ప్రజలకు అందేలా అధికారులు చొరవచూపాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వివిధ శాఖల ద్వారా అందుతున్న ప్రభుత్వ పథకాలను అధికారులు వివరించారు. మండలంలోని వంగపాడు గ్రామంలో విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎంపీపీ ప్రకాశం మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. కనిగిరిలో ఐసీడీఎస్ భవనం మరమ్మతులకు గురై శిథిలావస్థకు చేరుకుంటుందని సీడీపీవో సరోజిని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆయన సహకారంతో జడ్పీ, ఎంపీపీ నిధుల నుంచి నూతన భవన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తెలిపారు.

కృష్ణాపురం, పునుగోడు, బడుగులేరు గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు కందులు కొనుగోలు చేయటం లేదన్నారు. ఏవో జైనులాబ్దిన్ మాట్లాడుతూ ఈకేవైసీ చేసిన ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేసిందని తెలిపారు. మిగిలిఉన్న కందులను రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉందని చెప్పారు. ఈకేవైసీ జరిగిన ప్రతి కుటుంబంలో ఒకరికి అన్నదాతా సుఖీభవ కింద నగదు జమ అవుతుందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వ్యవసాయశాఖ అధికారులకు ఎంపీపీ సూచించారు. కనిగిరి మండలానికి నూతనంగా ఎంపీయూపీ స్కూల్స్ మంజూరు అయినట్లు ఎంఈఓ యూవీ నారాయణరెడ్డి తెలిపారు. కొన్ని గ్రామాల్లో మంజూరైన రోడ్లను నిర్మించకుండా కాంట్రాక్టర్లు మరోగ్రామంలో రోడ్డు వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వైఖరిని అడ్డుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులను ఎంపీపీ ఆదేశించారు. సమావేశానికి గైర్హాజరైన శాఖల అధికారులకు నోటీస్‌లు ఇవ్వనున్నట్లు ఎంపీపీ చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో ప్రభాకరశర్మ, తహసీల్దార్ రవిశంకర్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్త రుగ్మతపై అవగాహన అవసరం

పామూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సికెల్ సెల్(రక్త రుగ్మత) గురించి ప్రతిఒక్కరూ అవగామాన కలిగి ఉండాలని ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ అన్నారు. వరల్డ్ సికెల్ సెల్‌డే సందర్భంగా అంకాలమ్మ వీధి ఎస్సీ కాలనీలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీహెచ్‌వో సురేష్ మాట్లాడుతూ సికెల్ సెల్ అనీమియా అనేది ఎర్ర రక్తకణాలకు సంబంధించిన జన్యుపరమైన రుగ్మతని అన్నారు. సాధారణంగా ఎర్ర రక్తకణాలు గుండ్రంగా, మృదువుగా ఉండి రక్త ప్రవాహంలో సులభంగా కదులుతాయి. ఇవి శరీరంలోని భాగాలకు ఆక్సిజన్‌ను తీసుకెళ్లడంలో సహాయ పడుతాయని చెప్పారు.

ఈవ్యాధి ఉన్నవారిలో ఎర్ర రక్తకణాలు గట్టిగా జిగటగా కొడవలి ఆకారంలో ఉండి రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటాయని సీహెచ్‌వో సురేష్ తెలిపారు.. దీనివల్ల నొప్పి, అలసట, ఇతర ఆరోగ్య సమస్యలు ఏర్పడి రోగనిరోధక వ్యవస్థ బలహీన పడుతుందన్నారు. అనంతరం పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ ఆవుల బండ్లమ్మ, నారాయణ, హెఈవో ఎస్.బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

పామూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘునాథపురం, కమ్మవారిపాలెం గ్రామాల్లో వెలసిఉన్న శ్రీఅచ్చమాంబతల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి గణపతి పూజ, తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు, గ్రామోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఎడ్ల బలప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివరాలకు 9701115809, 9916622599, 9440878147 నెంబర్లకు సంప్రదించి ఎడ్లజత పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కల్యాణ మండపం నిర్మాణానికి స్థలపరిశీలన

పామూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని శ్రీమదన వేణుగోపాలస్వామి దేవస్థాన ప్రాంగణంలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మండపం నిర్మాణం కోసం గురువారం ఒంగోలు దేవదాయ శాఖ ఇంజనీరింగ్ అధకారులతో కలిసి ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా నిర్మాణ పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈసందర్భంగా దేవదాయశాఖ అసిస్టెంట్ ఇంజనీరింగ్ యుగంధర్‌తో కల్యాణ మండపం నిర్మాణంలో అనుసరించాల్సిన సాంకేతిక అంశాలపై చర్చించారు. వీలైనంత త్వరలో కల్యాణ మండపం నిర్మాణ పనులు చేపడతామని ఈవో తెలిపారు. త్వరలో టీటీడీ నుంచి ఆర్థిక అనుమతులు రాగానే నిర్మాణ పనులకు సంబంధించి కార్యాచరణ రూపొందుతుందని తెలిపారు.

అసైన్మెంట్ భూములకూ అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలి



రైతులతో మాట్లాడుతున్న పిల్లి తిప్పారెడ్డి

కనిగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అసైన్మెంట్ భూముల్లో సాగుచేసిన రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పిల్లి తిప్పారెడ్డి కోరారు. గురువారం మండలంలోని చాకిరాల గ్రామంలో అసైన్మెంట్ భూముల రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద కుటుంబాలు వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేందుకు ప్రభుత్వం అసైన్మెంట్ భూములను మంజూరు చేసిందన్నారు. ఈ భూములను సాగుచేస్తున్న వారిలో ఎక్కువ శాతం బడుగు, బలహీన వర్గాలకు చెందినవారితో పాటు చిన్న, సన్నకారు రైతులు అధికంగా ఉన్నారని తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఆర్థికంగా చితికిపోతున్న సన్నకారు రైతులకు ప్రభుత్వం ద్వారా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేస్తే వారిని ఆర్థికంగా ఆదుకున్నవారవుతారన్నారు. ఈవిషయంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి పథకం వర్తింప చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే రైతుల పక్షాన పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కనిగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీహెచ్‌పీఎస్ నాయకుడు పి.మోహన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదోని మండలం దానాపురం గ్రామంలో ఈనెల 16న కూటమి ప్రభుత్వ ఏడాది సంబరాల్లో సర్పంచ్ చంద్రశేఖర్‌ను కులం పేరుతో అవమానించారని ఆరోపించారు. సభ నుంచి కిందకు దించి పక్కన ఉండమని ఆదేశాలివ్వటం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిని రాజ్యాంగహక్కులను ఉల్లంఘించటం కింద పరిగణించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ డేను విజయవంతం చేయాలి

కనిగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డేను విజయవంతం చేయాలని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం జరిగే రెవెన్యూ డేలో డివిజన్‌లోని 13 మండలాల తహసీల్దార్‌లు, సిబ్బంది విధిగా హాజరై విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కనిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ఆర్డీవో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన కలిగిఉండాలి



ఫ్లోరోసిస్ బాధితులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ విభాగం బృందం

కనిగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ వి.అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని మాచవరం, బూతంవారిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం ఫ్లోరోసిస్ బాధితులను కలసి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఫ్లోరోసిస్ బాధితలకు ఇచ్చిన ఎక్విప్‌మెంట్‌పై తనిఖీ చేశారు. ఇచ్చిన ఎక్విప్‌మెంట్ ఏ విధంగా పనిచేస్తుందో బాధితులను విచారించారు. ఇంకా ఎవరైన బాధితుల ఉంటే వారి వివరాలను నమోదు చేసి వారికి కూడా ఎక్విప్‌మెంట్ అందజేస్తామన్నారు. ఫ్లోరోసిస్ బాధితులు పాలు, పెరుగు, రాగిజావ అధికంగా తీసుకోవాలని సూచించారు. గ్రామంలో బృందం పర్యటించి నీటిని పరీక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దాదా షరీఫ్, ఎల్‌టీ అనూష, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం ఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక, ఉపాధి శాఖల మంత్రి మున్సుఖ్ మాండవీయను మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించే స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి సహకారం అందించాలని మంత్రి లోకేష్ కోరారు. ఖేలో ఇండియా పథకంలో క్రీడా మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 39 ప్రాజెక్టులకు సంబంధించి రూ.341.57 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలకు త్వరగా ఆమోదం తెలపాలని లోకేష్ కోరారు. అనంతరం పలు అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు.

ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అమలుపై కృతజ్ఞతలు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉద్యోగుల ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అమలుజరిగే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నోటిఫికేషన్ జారీచేయడం పట్ల మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్ హర్షం వ్యక్తంచేశారు. గురువారం ఒంగోలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించిందన్నారు. అదేవిధంగా ఎస్సీ ఉద్యోగుల ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అమలు చేసే విధంగా జీవోకు సవరణ చేయడంపై కొమ్ము సృజన్ ధన్యవాదాలు తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాదిగలను అన్ని విధాలుగా మోసం చేశారని ఆరోపించారు. అందుకే గత ఎన్నికల్లో ఆ ప్రభుత్వానికి మాదిగలు బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో త్యాగరాజు, విజయ, శ్రీను, జయరాజు, శేఖర్, ఇలియాజర్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత (అంచనా) 20-6-2025

	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	27
తెనాలి	38	28
నరసరావుపేట	38	27
బాపట్ల	39	28
రెంటచింతల	37	27
చీరాల	39	28



స్వర్ణ పంచాయతీలు.. వేగవంతం

చురుగ్గా సాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ

ప్రజలకు అందుబాటులోకి పల్లె వివరాలు

వివాదాలు లేని గ్రామాలు.. ఆన్‌లైన్‌లోనే పన్నులు

వెబ్‌లోనే వివరాలన్నీ..

స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో గ్రామానికి చెందిన అన్ని వివరాలు ఉంటాయి. గ్రామ ముఖ చిత్రం, ఆ పంచాయతీలోని ఇళ్ల విస్తీర్ణం, హద్దులు, యాజమాని పూర్తి వివరాలు ఉంటాయి. అంతేకాకుండా ఏడాదికి ఎంతపన్ను చెల్లిస్తున్నారు, ఆస్తి వ్యాపార సముదాయాలకు సంబంధించి పన్నులు, చెరువులు, స్థలాలు, లీజు, సెల్ టవర్లు, పరిశ్రమల వివరాలు ఉంటాయి. పంచాయతీ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చాక సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు. అవసరమైన ధృవీకరణ పత్రాలు, అనుమతులు ఆన్‌లైన్ ద్వారా తీసుకోవచ్చు.

గుంటూరు సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కువగా జరిగే గొడవలన్నీ ఇళ్ల సరిహద్దులకు సంబంధించినవే. ఎప్పుడో రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజులు ఉన్నా ఆ పంచాయితీ పరిష్కారానికి తరాలు మారాల్సిందే. అటువంటి గొడవలు, సివిల్ వివాదాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చక్కని పరిష్కార మార్గాన్ని ఎన్నుకుంది. స్వర్ణ పంచాయతీ పేరుతో చారిత్రక కార్యక్రమానికి ఊపిరి పోసింది. వాస్తవానికి ఈ కార్యక్రమం గత వైసీపీ ప్రభుత్వంలోనే ఆరంభమైనా ముందుకు పోవడానికి ఆపసోపాలు పడింది. కూటమి ప్రభుత్వం అదే కార్యక్రమాన్ని జెట్ స్పీడ్‌తో పరుగులు పెట్టిస్తోంది. స్వర్ణ పంచాయతీ నిబంధనలకు అనుగుణంగా అన్ని వివరాలు ఆన్‌లైన్ లో నమోదు అయితే గ్రామ పంచాయతీ వ్యవస్థలో ఒక సువర్ణ అధ్యాయం ఆరంభం అవుతుంది. స్వర్ణ పంచాయతీ ప్రక్రియ చురుగ్గా సాగుతుంది. గుంటూరు జిల్లాలో 2,49,067 పాత రసీదులు అసెస్మెంట్లు ఉండగా 1,67,818 అసెస్మెంట్లు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు. పల్నాడు జిల్లాలో 389433 అసెస్మెం ట్లు ఉండగా 346902 మంది యజమానులు ఉన్నారు. వారిలో 319138 మంది ఆధార్‌లు అనుసంధానం చేశారు. బాపట్ల జిల్లాలో కూడా ఈ ప్రక్రియ చురుగ్గా సాగుతుంది.

సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే...

స్వర్ణ పంచాయతీ పేరుతో అన్ని సేవలను ఆన్‌లైన్‌లో పొందు పరుస్తున్నారు. ముఖ్యంగా ఇంటి కొలతలు, పన్ను చెల్లింపులు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం ఎవరైతే సదరు ఇంట్లో నివాసం ఉంటున్నారో గమనించి, వారి దస్తావేజులు పరిశీలించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ ఇల్లు ఎంత విస్తీర్ణంలో ఉంది.. కొలతలను పక్కాగా రూపొందించి మ్యాప్ సహా కంప్యూటరైజేషన్ చేస్తారు. దానివల్ల గతంలో మాదిరిగా ఒకరి ఆస్తిని మరొకరు ఆక్రమించడం, దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కుదరదు. ఇంటి పన్ను కూడా ఇష్టానుసారంగా మార్చే అవకాశం ఉండదు.

పన్నులు గల్లంతు..

గతంలో పంచాయతీ కార్యదర్శి రసీదులు ఇచ్చి పన్నులు వసూలు చేసే వారు. వాటిలో కొంత భాగం పక్కదారి పట్టించేవారు. గృహ యజమానుల నిరక్షరాస్యతను అడ్డం పెట్టుకుని ఒకే పన్ను రెండు మూడు సార్లు వసూలు చేసే వారు. స్వర్ణ పంచాయతీ విధానంలో గృహ యజమాని ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో కూడా చెల్లించవచ్చు. ఇంటి పన్ను ఒక వేళ సచివాలయంలో చెల్లించినా దానికి సంబంధించిన రసీదును కంప్యూటర్ నుంచి పొందవచ్చు. ఇంటి పన్ను చెల్లింపు వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదవుతాయి కాబట్టి మళ్లీ మళ్లీ చెల్లించాల్సిన అవసరం ఉండదు.



రాజధాని నిర్మాణ సంస్థలలో కార్మికుల వసతులను పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బృందం సభ్యులు

కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

○ సీఆర్డీఏకు ప్రపంచ బ్యాంకు బృందం సూచన

తుళ్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఆర్డీఏ అధికారులకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం సూచించింది. ఈ బృందం గురువారం అమరావతిలో పర్యటించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాస సముదాయాలు, శాఖమూరు రిజర్వాయర్, ఎల్పీఎస్ జోన్ 2ఏ ప్రాజెక్టు సైట్, కార్మికుల క్యాంపులను పరిశీలించింది. కార్మికులతో బృందం సభ్యులు మాట్లాడారు. మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. తొలుత బృందం రాజధాని అమరావతి నిర్మాణంలో అమలు చేయాల్సిన పర్యావరణ, సామాజిక రక్షణ, కార్మికుల భద్రత తదితర అంశాలపై విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో అదనపు కమిషనర్ జీ.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ నుంచి వివరాలు తీసుకుంది. అమరావతిలో నివసిస్తున్న ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్ర మాలు, నైపుణ్య శిక్షణ ఉపాధి అవకాశాల గురించి తెలిపారు. లింగ వివక్ష, బాల కార్మికులకు తావు లేకుండా పనులు చేపట్టినట్లు వివరించారు. అమరావతి నిర్మాణం ప్రాజెక్టులో భాగంగా పర్యావరణ, సామాజిక వ్యవస్థల అసెస్‌మెంట్ ప్రక్రియపై బృందంలోని సీనియర్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ బాయన వెంకట్రావు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో బృందంలోని సీనియర్ ఎన్విరాన్‌మెంట్ స్పెషలిస్టు జోసెఫ్, పర్యావరణ సంరక్షణ కార్యకలాపాల సలహాదారుల దమన్‌జిత్‌సింగ్ మిన్హాస్, మహిళా ప్రతినిధి జయశర్మ, సీఆర్డీఏ, ఏడీసీఎల్ చీఫ్ ఇంజనీర్లు సీహెచ్ ధనుంజయ, ఎన్.శ్రీనివాసులు, ఎం.ప్రభాకరరావు, ఎస్ఈ హనుమంత రెడ్డి, డీఈ పి.వెంకటేశ్వర్లు, ఈఈ కె.శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

దూరమైన... కంటి వైద్యం

● సీఎంఈఐ కేంద్రాల తొలగింపు

● కంటి పరీక్షకు పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి



వేమూరు సీఎంఈఐ కేంద్రం (ఫైల్ ఫొటో)

వేమూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రజలకు కంటి వైద్యాన్ని అందుబాటులోకి తేవాలని గత టీడీపీ ప్రభుత్వం సంకల్పించగా వైసీపీ ప్రభుత్వం మార్పులు చేసి దానికి తూట్లుపొడిచింది. 2014లో టీడీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రాల్లో సీఎంఈఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు కంటి వైద్యాన్ని చేరువ చేసింది. ఈ కేంద్రాల్లో ప్రతి వ్యక్తి ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేసుకుని కంటి పరీక్షలు చేయడంతో పాటు మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందించే వారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేశారు. గ్రామీణులు ఎందరో అప్పట్లో కంటి వైద్యం అందుకున్నారు. ఉదాహరణకు ఒక్క వేమూరులోని కేంద్రంలోనే రోజుకు 70 నుంచి 100 మందికి పైగా నెలలో 2000 మందికి పైగా వైద్య సేవలు అందుకునేవారు. ఇదే పరిస్థితి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కేంద్రాల్లో కూడా ఉండేది. తద్వారా గ్రామీణ ప్రజల కళ్లకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఎందరో పేదలు, వృద్ధులు, ఆపరేషన్లు ద్వారా వెలుగును చూడగలిగారు. అలాంటి విధానాన్ని 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం కంటి వెలుగుగా మార్పు చేసింది. ఆయా కేంద్రాల్లో పని చేసే టెక్నికల్ అసిస్టెంట్లను గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందించాలని ఆదేశించింది. ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టి మెరుగైన విధానానికి తూట్లు పొడిచింది. చంద్రబాబు ఆలోచనలకు విరుద్ధంగా సేవలను మార్చడంతో ప్రజలు ఫలితాలను అంతగా అందుకోలేకపోయారు. కూటమి పాలన రావడంతో తిరిగి సీఎంఈఐ కేంద్రాలు పునరుద్ధరిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్న తరుణంలో అపోలో కాంట్రాక్టు రద్దైంది. దీంతో ఈ కేంద్రాలను ప్రభుత్వం మూసేసింది. దీంతో గ్రామీణ ప్రజలకు కంటి వైద్యం దూరమైంది. పట్టణ ప్రాంతాలకు వెళ్లి ఖరీదైన కంటి వైద్యం చేసుకునేందుకు పేదలు ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తిరిగి సీఎంఈఐ కేంద్రాలను పునః ప్రారంభించేందుకు ఆలోచన చేసి కంటి వైద్య సేవలను చేరువ చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బర్లీ సంబరం

రైతుల ఆనందోత్సాహాల మధ్య కొనుగోళ్లు

పర్చూరులో అట్టహాసంగా మార్క్‌ఫెడ్ కేంద్రం ప్రారంభం

చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామన్న మంత్రి అచ్చెన్నాయుడు

అసాధ్యాన్ని సుసాధ్యం చేశామన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బర్లీ పొగాకు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధర లేక కొందరు.. కొనుగోళ్లు చేయలేక మరికొందరు అల్లాడిపోయారు. కంపెనీల ద్వారా కొనుగోళ్లకు ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసినా రైతుల్లో ఆందోళన తగ్గలేదు. దీంతో ఎట్టకేలకు నేరుగా ప్రభుత్వమే రంగంలోకి దిగి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లకు సిద్ధమైంది. సీఎం చంద్రబాబు ప్రకటించినట్లుగా బాపట్ల, పల్నాడు, గుంటూరు రైతులకు ఊరట ఇస్తూ గురువారం నుంచి బర్లీ పొగాకు కొనుగోళ్లకు అధికారులు శ్రీకారం చుట్టారు. చరిత్రలో ఎప్పుడూలేని విధంగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్ల కార్యక్రమానికి పర్చూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు వేదికగా నిలిచింది. కొనుగోళ్లను ప్రారంభించడానికి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పర్చూరుకు రాగా రైతులు ఘనస్వాగతం పలికారు. దాదాపు 500 ట్రాక్టర్లతో పర్చూరులో రైతులు ర్యాలీ నిర్వహించారు. పండుగ వాతావరణం తలపించేలా కొనుగోళ్ల కార్యక్రమం జరిగింది. మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు కొనడం అసాధ్యమని విమర్శించిన వారందరికీ ప్రారంభమైన కొనుగోళ్లే సమాధానమని మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. రైతులెవరూ అధైర్యపడవద్దని చివరి ఆకు వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు. పొగాకు కంపెనీల ఉచ్చులో పడి పొగాకు సాగు

(మిగతా 6లో)



కొనుగోలు కేంద్రంలో పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఏలూరి.. అలుపెరగని పోరాటం

● పొగాకు కేంద్రం ప్రారంభోత్సవంలో అచ్చెన్నాయుడు



మంత్రి అచ్చెన్నాయుడుకి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు కొనుగోలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం.. వారి సమస్యను పరిష్కరించేలా అధికారులను కదిలించడంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అలుపెరగని పోరాటం చేశారని మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు అన్నారు. రైతులకు న్యాయం చేయాలని వెంటపడ్డారన్నారు. పర్చూరు యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటులో ఏలూరి కృషి గురించి మంత్రి వివరించారు. అప్పుల ఊబిలో చిక్కుకున్న పొగాకు రైతులను ఆదుకోవడానికే ప్రభుత్వం ముందుకు వచ్చి బ్లాక్ బర్లీని కొనుగోలు చేస్తుందని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ప్రతి రైతు వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

అవగాహన లేక.. ఈ-కేవైసీ కాక

రెండువేల మందికి 'తల్లికి వందనం' దూరం



గుంటూరు సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా 'తల్లికి వందనం' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చే సింది. అయితే కొందరికి ఈ పథకం దూరమైంది. ఇందుకు కారణం వారికి ఈ-కేవైసీపై సరైన అవగా హన లేకపోవడమే. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు రెండు వేల మందికి పథకం అందలేదు. గుంటూరు జిల్లాలో 603, బాపట్ల జిల్లా లో 557, పల్నాడు జిల్లాలో 903 మంది ఈ-కేవైసీ చేయించు కోలేదని అధికారులు లెక్కలు తేల్చారు. వారి జాబితాలను సచివాలయాల్లో అం దుబాటు లో ఉంచి ఈ-కేవైసీ వెంటనే చేయించుకోవాలని సమాచారం పంపుతున్నారు. ఈ విషయంపై బుధవారం సచివాలయ సిబ్బందితో టెలీకాన్ఫ రెన్స్ నిర్వ హించిన అధికారులు తక్షణం ఈ-కేవైసీ పూర్తి చేయించాలని ఆదేశాలు జారీ చేశారు.

తల్లి లేకపోతే తండ్రి..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 978 మంది విద్యా ర్థులకు తల్లి మరణించటం వల్ల 'తల్లికి వందనం' వర్తించలేదని అధికారులు తేల్చారు. గుంటూరు జి ల్లాలో 340 మంది, బాపట్లలో 226 మంది, పల్నా డు జిల్లాలో 412 మంది విద్యార్థులు ఈ పథకానికి దూరమయ్యారు. తండ్రితో ఈ-కేవైసీ పూర్తి చేయిం చాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

గర్భిణులు, బాలింతలకు కిల్కారి కాల్ సేవలు

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కిల్కారి కాల్ సేవల ద్వారా గర్భిణులు, బాలింతలకు పలు ప్రయోజనాలు చేకూరతాయని కిల్కారి ప్రోగ్రామ్ అధికారి రాజు పేర్కొన్నారు. గురువారం మండలపరిధిలోని వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు కిల్కారి కాల్ సర్వీసులపై అవగాహన కల్పించారు. కిల్కారి కాల్ ద్వారా తల్లి బిడ్డల ఆరోగ్య సమాచారం అందిస్తార న్నారు. గర్భిణులు నాలుగో నెల మొదలుకుని బిడ్డ పుట్టిన సంవత్సరం వరకు కిల్కారి కాల్ సేవలు వస్తాయన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కాల్స్ ద్వారా వివరిస్తారన్నారు. కిల్కారి కాల్ నెంబరు 01244451660 నుంచి వస్తాయన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు సుష్మాసుసాన్, ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు, ఎంపీహెచ్‌ఎస్ వై శ్రీనివాస్, హెచ్‌వీపీ రాజ్యలక్ష్మి, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా గ్లోరియా



బాపట్ల ఆర్డీవో పీ గ్లోరియా

బాపట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బాపట్ల సబ్ డివిజనల్ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న పి.గ్లోరియాకు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. బాపట్లజిల్లా ఏర్పడిన అనంతరం చిత్తూరుజిల్లా నుంచి బాపట్లకు బదిలీపై సబ్‌డివిజనల్ అధికారిగా గ్లోరియా బాధ్యతలు చేపట్టారు. 2002లో తహసీల్దార్‌గా ఉద్యోగం ప్రారంభించిన ఆమె వివిధ ప్రాంతాలలో పనిచేశారు. 2011లో డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొంది ఒంగోలు, కరీంనగర్, గుంటూరులో వివిధ హోదాల్లో పనిచేశారు. బాపట్లలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఆర్డీవోగా పనిచేస్తున్న ఆమె ప్రస్తుత తరుణంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందారు.

నాటు సారా తయారుచేస్తే క్రిమినల్ చర్యలు

● జిల్లా ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు

నిజాంపట్నం(రేపల్లె), జూన్ 19(ఆంధ్రజ్యోతి): నాటుసారా కాచేవారిపై నిరంతరం నిఘా ఉంటుందని నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బాపట్ల జిల్లా ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నిజాంపట్నం మండలం పరిశావారిపాలెం, జంపానివారిపాలెం, యేమినేని వారిపాలెం, కేసనవారిపాలెంలను సందర్శించి దాడులు నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నాటుసారా కాయటానికి అవసరమైన ముడిసరుకులు, నల్లబెల్లం అమ్మేవారిపై కూడా నిఘా ఉంచామన్నారు. సారా తయారు చేసేవారిపై ఇప్పటికి పలుమార్లు కేసులు నమోదు చేశామని ఈసారి నాటుసారా తయారుచేస్తూ దొరికితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, జడ్పీటీసీ నర్రాసుబ్బయ్య, ఎక్సైజ్ సీఐ ఎం శ్రీరామ్‌ప్రసాద్, ఎస్ఐ భార్గవ్ పాల్గొన్నారు.

బీ ఫార్మసీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

పెదకాకాని, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం ఏడు, ఎనిమిదవ సెమిస్టర్ల(రెగ్యులర్, సప్లమెంటరీ) పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు గుంటూరు జిల్లాలో 16, ప్రకాశం జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎనిమిదవ సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఏడవ సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతున్నాయి. వర్సిటీ పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు పరీక్ష కేంద్రాల్లో పరిశీలకుల నియామకంతో పాటు తనిఖీ బృందాలను నియ మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో చివరి బ్యాచ్ ఎనిమిదవ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు.

23న ఇంకొల్లుకు లోకేశ్

దగ్గుబాటి విద్యాసంస్థల స్థల పరిశీలన



దగ్గుబాటి విద్యాసంస్థలో భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

ఇంకొల్లు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఈ నెల 23న ఇంకొల్లు పర్యటన ఖరారైంది. దీంతో దగ్గుబాటి విద్యాసంస్థల స్థలాన్ని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ గురువారం పరిశీలించారు. దగ్గుబాటి విద్యాసంస్థల ఆవరణలో డీవీఆర్ సైనిక్‌స్కూల్‌ను ప్రారంభించేందుకు మంత్రి లోకేశ్ రానున్నారు. దీనికి సంబంధించి దగ్గుబాటి విద్యాసంస్థలలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. డీఎస్పీ వెంట ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ సురేష్ తదితరులు ఉన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

బాపట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పచ్చనిచెట్లు-ప్రగతికి మెట్లు, వృక్షో రక్షతి రక్షతః.. నినాదాలు ఊకదంపుడు ఉపన్యాసాలకు పరిమితమయ్యాయి. టీడీపీ వ్యవస్థాపకులు, మాజీముఖ్యమంత్రి ఎన్టీరామారావు హయాంలో నాటిన మొక్కలు నేడు మానులుగా మారాయి. వీటిపై కొంతమంది స్వార్థపరులు గొడ్డలి వేటు వేస్తున్నారు. సముద్రతీర ప్రాంత గ్రామాలకు సాగునీరు అందించే ప్రధాన ఫిటి చానల్, తిమ్మరాజు కాల్వ కట్టలపై పెద్ద పెద్ద చెట్లు ఉన్నాయి. సమ్మెటవారిపాలెం రోడ్డులో తిమ్మరాజు కాల్వ కట్టపై అనేక చెట్లు కొద్దిరోజులుగా నరికేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే చెట్లు పెద్దవి కావడంతో.. వేర్లు పెరిగి కాల్వ కట్టలు పగలిపోతున్నాయని సాకులు చెబుతున్నారు. నీటి సంఘాల నాయకులు సైతం ఇదంతా మేమే చేయిస్తున్నామనడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇరిగేషన్ అధికారులు కూడా చెట్లు తీసుకోమని తామే చెప్పినట్లు మాట్లాడడం అనేక విమర్శలకు ఊతమిస్తోంది. నరికిన చెట్ల దుంగలను ట్రాక్టర్లలో నిజాంపట్నం పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నారు. తుమ్మల శాఖ బ్రాంచ్ కాల్వ ఎదురుగా ఫిటి చానల్ కట్టపై, అడవి బ్రాంచ్ కాల్వ పక్కనే తిమ్మరాజు కాల్వ కట్ట మీద, పేరలి బ్రాంచ్ కాల్వకట్టపై ఉన్న పదుల సంఖ్యలో చెట్లను నరికేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలో ఆర్అండ్‌బీ రోడ్డుపైకి చెట్లు వాలాయని పెద్ద ఎత్తున నరికి తరలించారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ వెంకట రమణను వివరణ కోరగా కాల్వలోకి వాలిన కొమ్మలు మాత్రమే తాము తొలిగించా సమాధానం ఇచ్చారు. చెట్లు నరికివేయడంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



నరికిన చెట్టు దుంగలను ఒడ్డుకు చేరుస్తున్న కూలీలు



అతిపెద్ద దుంగలను ట్రాక్టర్‌లో తీసుకెళుతున్న దృశ్యం


లారీని వెనుక నుంచి ఢీ కొన్న ఆర్టీసీ బస్ (ఇన్‌సెట్లో) హుస్సేన్ మృతదేహం

లారీని ఢీ కొన్న ఆర్టీసీ బస్

● వ్యక్తి మృతి ● ఆరుగురికి గాయాలు

సంతమాగులూరు(అద్దంకి),జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీ ని వెనుక నుంచి ఆర్టీసీ బస్ ఢీ కొనటంతో ఒక ప్రయాణికుడు మృతి చెందగా ఆరుగురు ప్రయాణికులకు గాయాలుఅయ్యాయి. పోలీసీల కథనం మేరకు అనంతపురంకు చెందిన దూదేకుల హుస్సేన్, స్నేహితుడు అబ్దుల్ దౌలా సొంత పనుల నిమిత్తం 17 వ తేదీ విజయవాడ వెళ్లారు. పనులు ముగించు కొని అనంతపురంకు ట్రైన్‌లో వెళ్ళేందుకు బుధవారం రాత్రి రైల్వేస్టేషన్‌కు వెళ్ళగా ఒక్క బెర్త్ మాత్రమే ఉండటంతో అబ్దుల్ దౌలా వెళ్లారు. హుస్సేన్ బస్టాండ్‌కు వచ్చి శ్రీశైలం బస్సు ఎక్కారు. విజయవాడ నుండి శ్రీశైలం వెళ్తున్న ఆర్టీసీ బస్ బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత రెండున్నర గంటల సమయంలో సంతమాగులూరు మండలం పాతమాగులూరు వద్ద కు వచ్చే సరికి ముందు ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. బస్సులో ఉన్న హుస్సేన్ మృతి చెందగా ఆరుగురు ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిలో విజయవాడకు చెందిన వూటుకూరు సుబ్బారావు, పద్మావతి దంపతులు, గుంటూరు జిల్లా క్రోసూరు మండలం బయ్యారంకు చెందిన నాగమణిలతో పాటు స్వామి వెంకటేశ్వరరావు మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. సంఘటనాస్థలాన్ని సంతమాగులూరు ఎస్సై పట్టాభిరామయ్య పరిశీలించారు.

మోటార్ బైక్ కవర్‌లో రూ.2.5 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

అద్దంకి,జూన్19(ఆంధ్రజ్యోతి): మోటార్‌బైక్ ట్యాంక్ కవర్‌లో ఉన్న 2.5 లక్షల రూపాయల నగదును ఇద్దరు వ్యక్తులు అపహరించుకుపోయిన సంఘటన గురువారం మధ్యాహ్నం అద్దంకి పట్టణంలోని కలవకూరు క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని ధర్మవరంకు చెందిన గూడాల వెంకటరామిరెడ్డి అద్దంకి పట్టణంలోని ఎస్‌బీఐ(మెయిన్ బ్రాంచ్) లో బంగారం తాకట్టు పెట్టి 2.5 లక్షల రూపాయల రుణం తీసుకున్నాడు. ఆ డబ్బు ను మోటార్‌బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టి కలవకూరు క్రాస్ రోడ్డు వద్ద బైక్ ఆపి సమీపంలో ఉన్న టీ స్టాల్ లో టీ తాగుతున్నాడు. ఇద్దరు వ్యక్తులు వెంకటరామిరెడ్డి మోటార్‌బైక్‌ను వెంబడిస్తూ వచ్చి ట్యాంక్ కవర్‌లో ఉన్న 2.5 లక్షల రూపాయల నగదును అపహరించుకు పోయారు. వెంటనే పోలీస్ లకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలలో ఫుటేజ్ పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు మోటార్‌బైక్‌పై వచ్చి నగదు తీసుకు వెళ్తున్నట్లు రికార్డు అయ్యింది. సీఐ సుబ్బరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటరామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

5 న జాతీయ లోక్ అదాలత్

అద్దంకి,జూన్19(ఆంధ్రజ్యోతి):జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జూలై 5 వ తేదీ అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో ఇరువర్గాల కక్షిదారుల అంగీకారం మేరకు కేసులు రాజీ చేసుకోవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి తెలిపారు. రాజీకి అర్హత కలిగిన అన్ని క్రిమినల్ కేసులు,చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇరు వర్గాల ఆమోదంతో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అద్దంకి కోర్టుపరిధిలోని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

● సీఎం చంద్రబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జరిగే అంతర్జా తీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. యోగాంధ్ర కార్యక్రమంపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్వో చినఓబులేషు, అధికారులు చిరంజీవి, కిరణ్‌కుమార్, నారాయణ, శ్రీహరి, వెంకటేశ్వరరావు, రవికుమార్, సైమన్‌విక్టర్, డాక్టర్ బీమానాథ్ పాల్గొన్నారు. అనంతరం అధికా రులతో కలెక్టర్ యోగా కార్యక్రమం ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.


సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా

కంచర్ల రామయ్య మృతిపై మాగుంట సంతాపం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల అధినేత కంచర్ల రామయ్య మృతి పట్ల ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం సంతాపం వ్యక్తం చేశారు. రామయ్య మృతి చెందినట్లు తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న ఎంపీ మాగుంట ఫోన్ చేసి రామయ్య కుమారుడు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను పరామర్శించారు. రామయ్య ఒక జర్నలిస్టుగా ప్రజలకు, ఇంజనీరింగ్ కాలేజీ అధినేతగా విద్యార్థి లోకానికి ఎనలేని కృషి చేశారన్నారు. మంచితనానికి, మానవత్వానికి ఆయన నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. రామయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢసంతాపాన్ని మాగుంట వ్యక్తం చేశారు.

సమగ్ర వివరాలతో ఐడీఆర్ఎన్ పోర్టల్ : డీఆర్వో

ఒంగోలు కలెక్టరేట్, జూ న్ 19 (ఆంధ్రజ్యోతి): విప త్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసర మైన సమాచారంతో ఇండియన్ డిజాస్టర్ రిసోర్స్ నెట్‌వర్క్(ఐడీఆర్ఎస్) పోర్టల్‌ను రూపొందించినట్లు కేంద్ర విపత్తుల నిర్వహణ ప్రకటించింది. అందుకు సంబంధించి గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విపత్తుల సమయంలో వివిధ రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం కోసం ఈ వెబ్‌సైట్ దోహదపడుతుందని తెలిపారు.

బర్లీ సంబరం

(5వ పేజీ తరువాయి)

చేపట్టవద్దన్నారు. తొలిదశలో నాలుగు జిల్లాల పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ తెరిచిందని, వీటిని 15 వరకు పెంచే ఆలోచన ఉందన్నారు. స్లాట్ ప్రకారం పొగాకును కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. రైతులు తమ దగ్గర నిల్వలు లేవు అని చెప్పేవరకు కూడా కేంద్రాలు తెరిచే ఉంచాలన్నారు. ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ పొగాకు కొనుగోళ్లపై అసాధ్యాన్ని సుసాధ్యం చేశామన్నారు. పదిశా తం మంది పొగాకు రైతులు సాగు వివరాలను నమోదు చేసుకోలేదని అలాంటి వారివిషయంలో ఉదారంగా వ్యవహరించాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్‌ను కోరగా ఎమ్మెల్యే కోరగా సానుకూలంగా స్పందించారు.

తొలి రోజు 101 క్వింటాళ్లు..

పర్చూరు యార్డులో బర్లీ పొగాకు కేంద్రం ప్రారంభించిన తొలి రోజు గురువారం 101 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ తెలిపారు. దాదాపు 12 లక్షల విలువైన కొనుగోళ్లు సాగాయి. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ ఎండీ మంజీర్‌జిలాని, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, వేర్‌హౌసింగ్ డైరెక్టర్ సురేష్, కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యేలు కొండయ్య, బీఎన్ విజయ్‌కుమార్, బుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బూచేపల్లి క్వారీలో డంపర్ బోల్తా

ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

గ్రానైట్ గనుల్లో భద్రత డొల్ల


రిమ్స్‌లో ఉన్న మృతదేహాలు

చీమకుర్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం రామతీర్థం వద్ద ఉన్న సూర్య గ్రానైట్ క్వారీలో గురువారం సాయంత్రం ప్రమాదం చోటుచేసుకుంది. క్వారీ పిట్ నుంచి పైకి వస్తున్న డంపర్ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. దాదాపు నలభై అడుగుల ఎత్తు నుంచి కిందకు పిట్‌లోకి పడటంతో డంపర్‌లో ఉన్న నలుగురు వ్యక్తులలో ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. రామతీర్థం సమీపంలో ఉన్న జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి చెందిన సూర్యా గ్రానైట్ క్వారీలో సాయంత్రం ప్రమాదం చోటుచేసుకుంది. పిట్‌లో పనులు పూర్తయిన తర్వాత బయలుదేరిన డంపర్ దాదాపు నలభై అడుగులు పైకి వచ్చిన తర్వాత అదుపుతప్పి బోల్తాపడి కిందకు పడిపోయింది. ఆ సమయంలో డంపర్‌లో డ్రైవర్ రంగయ్య(51), సూపర్‌వైజర్ సాయిరెడ్డి(25), మరో ఇద్దరు కార్మికులు ఉన్నారు. తీవ్ర గాయాలైన వారందరిని తొలుత చీమకుర్తిలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి, తదుపరి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అనంతపురం జిల్లాకు చెందిన రంగయ్య, చీమకుర్తి మండలం నాయుడుపాలెంకు చెందిన సాయిరెడ్డిలు మృతిచెందగా గాయపడిన ఇద్దరు కార్మికులను కిమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సరైన కండిషన్‌లో లేని డంపర్‌ని తీసుకెళ్లవద్దు అని అక్కడివారు వారిస్తున్నా పైకి తీసుకెళ్తుండటం మార్గమధ్యలో బోల్తాపడటం గమనార్హం. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

క్వారీల్లో కొనసాగుతున్న ప్రమాదాల పరంపర

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇటీవల కొద్దినెలల క్రితమే క్వారీల్లో పెద్దఎత్తున భద్రతా వారోత్సవాలు సైతం నిర్వహించారు. కానీ అవి మీటింగ్‌లకే పరిమితమయ్యాయి. నిత్యం ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షించాల్సిన మైన్స్ సేఫ్టీ అధికారులు వారోత్సవాలకే పరిమితమవుతూ తర్వాత క్వారీల వైపు తొంగిచూసిన పాపాన పోవడం లేదు. క్వారీల్లో భద్రతను పర్యవేక్షించాల్సిన కార్యాలయం, అధికారులు సైతం ఏపీలోనే లేకపోవటం గమనార్హం. మైన్స్ సేఫ్టీ కార్యాలయాన్ని నెల్లూరు నుంచి హైదరాబాద్‌కి తరలించటం విశేషం. దీంతో పర్యవేక్షణాధికారులు చుట్టపుచూపుగా వచ్చిపోతుండటంతో క్వారీల్లో భద్రత డొల్లగా మారింది. అనుక్షణం కార్మికుల భద్రతను చూసుకోవాల్సిన మైన్స్ మేనేజర్లు విధుల నిర్వహణలో జరుగుతున్న నిబంధనల ఉల్లంఘన, క్వారీ ఓనర్లు లాభాలపై చూపే ఆసక్తి, భద్రతపై చూపకపోతుండటంతో క్వారీల్లో ప్రమాదాలు ఎక్కువయ్యాయి. ఇకనైనా మైన్స్ సేఫ్టీ కార్యాలయాన్ని ఒంగోలులో ఏర్పాటు చేసి అధికారులు నిత్యం క్వారీల్లో పర్యవేక్షణ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘ నాయకులు కోరుతున్నారు.

ఎంటీఎస్ టీచర్ల సర్దుబాటు

● టీచర్లు లేని పాఠశాలలకు ప్రాధాన్యత

● 20లోపు ప్రక్రియ పూర్తికి ఆదేశం

ఒంగోలు విద్య, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు విధానంలో మినిమం టైం స్కేల్(ఎంటీఎస్)తో పనిచేస్తున్న టీచర్లను సర్దుబాటు చేసేందుకు రంగంసిద్ధమైంది. అవసర ప్రాతిపదికన వీరిని పాఠశాలలకు కేటాయించనున్నారు. ఎంటీఎస్ టీచర్లకు పాఠశాలల కేటాయింపులో అనుసరించాల్సిన మార్గదర్శకాలను నిర్దేశిస్తూ పాఠశాల విద్యాకమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంటిఎస్ టీచర్లు (2008, 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు)సర్వీసులను 2025-26 విద్యా సంవత్సరానికి కొనసాగిస్తూప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. వీరు జూన్ 1నుంచి విధుల్లో ఉన్నట్లే. వీరికి 11నెలలజీతం చెల్లిస్తారు. మే నెలలో పాఠశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో నో వర్క్-నో పే సిద్ధాంతంతో వీరికి 11నెలల వేతనం మాత్రమే ఇస్తారు. ప్రస్తుతంరెగ్యులర్ సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు పూర్తయి టీచర్లందరూ కొత్త స్థానాల్లో చేరిన నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఎంటీఎస్ టీచర్లను అవసరం ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయాలని కమీషనర్ డీఈవోను ఆదేశించారు. ఈనెల 20వతేదీ నాటికి ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. ఎంటిఎస్ టీచర్ల సర్దుబాటులో 2008 డీఎస్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. తర్వాత 1998 డిఎస్సీ అభ్యర్థులకు ఇస్తారు. ఎంటిఎస్‌టీచర్ల కేటాయింపులో అసలు టీచర్‌లేని పాటశాలలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఏకో ఉపాధ్యాయ పాఠశాలలకు రెండో ప్రాధాన్యత. రెండులేక అంతకంటే ఎక్కువ ఎస్‌జిటిపోస్టులు మంజూరై ప్రస్తుతం ఒక టీచర్‌తో నడుస్తున్నన స్కూళ్ళకు కేటాయించనున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్ళకు ఒక పిఎస్‌హెచ్‌ఎం, నాలుగు ఎస్‌జిటి పోస్టులు మంజూరై ప్రస్తుతంకేవలం ఒ క ఎస్‌జిటి మాత్రమే పనిచేస్తుంటే ఆ పాఠఋశాలలకు ఇద్దరు ఎంటిఎస్ టీచర్లను కేటాయించనున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్ళకు ఒకపిఎస్ హెచ్‌ఎం, మూడు ఎస్‌జిటిలు మంజూరై ఒక ఎస్‌జిటి మాత్రమే పనిచేస్తుంటే ఆ పాఠశాలకు ఒక ఎంటీఎస్ టీచర్‌ను కేటాయించనున్నారు. ముగ్గురు ఎస్‌జిటిలు మంజూరైన పాఠశాలల్లో ఇద్దరు ఎస్‌జిటిలు మాత్రమే పనిచేస్తుంటే అక్కడ ఒక ఎంటిఎస్ టీచర్‌ను నియమించనున్నారు. మార్గదర్శకాల మేరకు ఎంటిఎస్ టీచర్ల సర్దుబాటు చేయగా ఇంకా ఎంటీఎస్ టీచర్లుమిగులుగా ఉంటే వారిని క్లస్టర్ టీచర్లుగా నియమించనున్నారు. కేటగిరి 4నుంచి1 వరకు దామాషా ప్రకారం వీరిని క్లస్టర్‌కు కేటాయించనున్నారు. ఈ సర్దుబాటును ఇంకాఎంటిఎస్ టీచర్లు మిగులుగా ఉంటే వారిని మొదటగా కేటగిరి క్లస్టర్లు తర్వాత మూడు ఆ తర్వాత 2,1 క్లస్టర్లకు కేటాయించనున్నారు.

కొత్త కార్డుల కోసం నిరీక్షణ

ప్రభుత్వ పథకాల లబ్ధికోసం ఎదురుచూపులు

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొత్త రైస్‌కార్డు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఆర్థిక ప్రయోజనం చేకూరే పథకాలను అమలు చేస్తుండటంతో తమకు అందకుండా పోతాయనే భయంతో కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త కార్డుల జారీ నిలిపివేయడంతో గత రెండేళ్ళ నుంచి కార్డుల కోసం ప్రజలు ఎదురు చూస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం గత నెల 7వతేదీ నుంచి కొత్త కార్డుల జారీతో పాటు ప్రస్తుతం ఉన్న కార్డుల్లో పేర్ల నమోదుకు సచివాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. దీంతో ప్రజలు కొత్త కార్డులు, పాత కార్డుల్లో పేర్లనమోదుకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. అలా జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న కార్డుల్లో పేర్ల నమోదు కోసం 49684 మంది దరఖాస్తు చేసుకోగా కొత్త కార్డుల కోసం మరో 7,883 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలా ఆ రెండు రకాల దరఖాస్తులు ఇప్పటివరకు 57,567 మంది దరఖాస్తులు చేసుకున్నారు. తాజాగా ప్రభుత్వం తల్లికివందనం పథకం నిధులు మంజూరు చేయగా త్వరలో లో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు లబ్ధి చేకూరనుంది. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది ఆయా పథకాల కోసం రేషన్ కార్డుల్లో పేర్ల న మోదుతో పాటు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న పక్షంరోజుల్లో ఆయా దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న వారందరికి రేషన్ కార్డులు జారీచేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో పేర్ల నమోదు చేసి కొత్త కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా ఇంత వరకు కొత్త రేషన్ కార్డులు జారీ కాకపోవడంతో ప్రజలు వాటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం రేషన్ కార్డుల్లో పేర్ల నమోదు కోసం చేసుకున్న దరఖాస్తుల్లో చిన్న పిల్లలు కూడా అధికంగా ఉన్నారు. దీంతో తమకు తల్లికివందనం పథకానికి పేర్లు నమోదు చేసుకోనేందుకు అతృతగా ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డుల జారీ ఎప్పుడు వస్తాయె తెలియకపోవడంతో దరఖాస్తులు చేసుకున్న ప్రజలు సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాలచుట్టూ తిరుగుతున్నారు. మరో వైపు రేషన్ కార్డుల్లో చేర్పులు మార్పుల కోసం దరఖాస్తులు భారీగా వచ్చాయి. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో అడ్రసు మార్పుల కోసం 2,159 దరఖాస్తులు రాగా, ఆధార్ నమోదు కోసం 915, కార్డుల విభజన కోస 1195 , ఉన్న సభ్యుల తొలగింపు కోసం 5,825 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వారు కూడా కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు.

పంచాయతీ కార్మికుల జీతాలను చెల్లించాలి

● ఉప్పుగుండూరులో ధర్నా


పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

నాగులుప్పలపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికుల జీతాలు చెల్లించాలని సీఐటీయూ మండలాధ్యక్షుడు నలతోటి రామారావు డిమాండ్ చేశారు. గురువారం పంచాయతీ కార్మికులు తమ పెండింగ్ జీతాల కోసం విధులు పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారికి సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి పంచాయతీ కార్మికులకు అధికారులు జీతాలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. పేద కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకుంటే వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ విషయం పలుమార్లు పంచాయతీ పాలకులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ధర్నా చేపట్టాల్సి వచ్చిందని సీపీఎం మండల కార్యదర్శి తూబాటి శ్రీకాంత్ అన్నారు. సర్పంచ్ దేవరకొండ జయమ్మ కార్మికులకు మద్దతుగా ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నిధులు ఉన్నాయని, అధికారులు జీతాలు చెల్లించకుండా ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ తనపై ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. వెంటనే కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. దాంతో నూతనంగా విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ధర్నా చేస్తున్న కార్మికుల వద్దకు వచ్చి సోమవారం నాటికి జీతాలు అందేలా చూస్తానని తెలపడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు కండ్లగుంట శ్రీనివాసరావు, తెలగతోటి శామ్యూల్ పాల్గొన్నారు.

రేపు అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 21వ తేదీన ఒంగోలులో జరుగుతుందని పీడీసీఏ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు గు రువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యేవారు శనివారం ఉదయం 9గంటలకు స్థానిక మంగమూరు రోడ్‌లోని అసోసియేషన్ సబ్ సెంటర్‌లో హాజరు కావాలన్నారు. ఎంపికైన జట్టు జూలై 3వ తేదీ నుంచి మంగళగిరి, పేరేచర్లలో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అంతర్ జిల్లా పో టీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నెం. 9701022333 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన ఎస్పీ దామోదర్

సారా రహిత జిల్లా ప్రకాశం

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను నాటుసారారహిత జిల్లాగా ప్రకటించడం సంతోషంగా ఉందని,అందుకు కృషి చేసిన సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అభినందనలు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో గురువారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలన కార్యక్రమం నవోదయం2.0పై ఎస్పీ ఏఆర్.దామోదర్‌తో కలిసి జిల్లాస్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్‌మాట్లాడారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటిస్తూ డిక్లరేషన్ చేయడంజరిగిందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19న రాష్ట్రస్థాయి నవోదయ2.0 కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించుకొని జిల్లాను ఎనాటు సారా రహిత జిల్లాగా మార్చేందుకు సంకల్పం తీసుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ, అటవీశాఖలఅధికారుల సహకారంతో ఈ నాలుగు నెలల కాలంలో జిల్లాలో నాటుసారా తయారీదారులను, వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని వారిలో అవగాహన కల్పించడం, నాటుసారా యూనిట్స్‌ను నిర్మూలన చేయడం వంటి చర్యలు తీసుకోవడం ద్వారా జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించుకోనేందుకు అవకాశంకలిగిందన్నారు. అందుకు కృషి చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఒక సారి జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించిన తర్వాత జిల్లాలో ఎక్కడైనా నాటుసారా తయారీ, వినియోగం జరగకుండా నిరంతరం మానిటరింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇజల్లాలో ఐడి లిక్కర్‌పీడిత గ్రామాల జాబితాను ఎనిమిది మండలాల్లో ఎ, బిసి కేటగిరిలుగా విభజించడంజరిగిందన్నారు. ఏ కేటగిరిలో రెండు గ్రామాలు, బీ కేటగిరిలో 27 గ్రామాలు, సీ కేటగిరిలో ఆరు గ్రామాలు కలిపి మొత్తం 35 గ్రామాలను గుర్తించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో నాటుసారా ను నిర్మూలించి ప్రభుత్వ లక్ష్యం చేరుకోనేలా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ ఏఆర్‌దామోదర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా, నెక్స్ట్ జనరేషన్ ఈ వృత్తిలో కొనసాగకుండా జిల్లాలో నాటుసారా తయారీ, సరఫరాను పూర్తిగా నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లాలో నటుసారాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్‌శాఖ క్షేత్ర స్థాయిలో పూర్తి సహకారం అందిస్తుందని తెపారరను. ప్రతి పోలీస్ స్టేషన్‌లో డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని, మనుషులు వెళ్ళలేని ప్రదేశాల్లో డ్రోన్ల సహకారంతో వారిని గుర్తించి నాటుసారాను అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం నవోదయం 2.0 పై అవగాహన కలిగించే కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్‌డిప్యూటీకమీషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమీషనర్ దయాసాగర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం, డీఆర్‌డీఏ పీడీ నారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అమలుపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉద్యోగుల ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అమలు జరిగే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నోటిఫికేషన్ జారీచేయడం పట్ల మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్ హర్షం వ్యక్తంచేశారు. గురువారం ఒంగోలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించిందన్నారు. ఆదేవిధంగా ఎస్సీ ఉద్యోగుల ఉద్యోగోన్నతుల్లో వర్గీకరణ అమలు చేసే విధంగా జీవోకు సవరణ చేయడంపై ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాదిగలను అన్ని విధాలుగా మోసం చేశారని ఆరోపించారు. అందుకే గత ఎన్నికల్లో ఆ ప్రభుత్వానికి మాదిగలు బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో త్యాగరాజు, విజయ, శ్రీను, జయరాజు, శేఖర్, ఇలియాజర్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి 97శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు గురువారం 97శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లలో జరిగిన పరీక్షకు 1785 మంది అభ్యర్థులను కేటాయించగా 1726 మంది హాజరు కాగా 59 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 889మందికి 851 మంది హాజరు కాగా 38 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 896కి 875 మంది హాజరు కాగా 21 మంది గైర్హాజరైనట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

నేడు సింగరాయకొండలో జాబ్‌మేళా

సింగరాయకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు పలు బహుళజాతీయ కంపెనీలు హాజరవుతాయని పేర్కొన్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదువుకొని ఖాళీగా ఉన్న 18-30 ఏళ్ల మధ్యగల నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రేమ పేరుతో పిలిపించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై హత్యాయత్నం

ఒంగోలు క్రైం, జూన్19 (ఆంధ్రజ్యోతి): పరిచయం ఉన్న యువతి ప్రేమగా మాట్లాడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రమ్మని పిలిచి తన ప్రియుడుతో కలిసి హత్య చేసేందుకు యత్నిం చారు. ఈ సంఘటన ఒంగోలులోని కిమ్స్ ఆ సుపత్రి సమీపంలో గల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళి తే... ఒంగోలు మండలం కరవది గ్రామానికి చెందిన ఓ యువతి, యలమంద అనే యు వకుడు ఐదు నెలల క్రితం ఉద్యోగం కోసం హై దరాబాద్ వెళ్ళారు. అక్కడ ఒంగోలు నగరం శ్రీరామ్‌కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బూసి వెంకటేష్ వారికి పరిచయం అయ్యాడు. ఈక్ర మంలో సదరు యువతికి వెంకటేష్‌తో ప్రేమగా మాట్లాడుతూ సన్నిహితులయ్యారు.

ఇలా నాలుగు నెలలు తరువాత ఆ యువతి, యలమంద కలిసి హైదరాబాద్ నుంచి తిరిగి స్వగ్రామం వచ్చారు. అయితే వారి ఇరువురు ప్రేమించుకున్నారు. దీంతో హైదరాబాద్‌లో ఉ న్న వెంకటేష్‌తో తన ప్రియురాలు మాట్లాడు తుందని గుర్తించిన యలమంద ఆమెతో గొడవపడ్డాడు. ఈక్రమంలో ఇరువురు కలిసి ఓ ప థకం రూపొందించారు. తన ప్రియురాలితో స న్నిహితంగా ఉంటున్న వెంకటేష్‌ను అడ్డు తొలగించాలని యలమంద తన మిత్రులతో కలిసి మాట్లాడుకున్నాడు. ఈనేపథ్యంలో తన ప్రియు రాలితో వెంకటేష్‌కు ఫోన్ చేయించాడు. మనం కలవాలంటూ వెంకటేష్‌ను ఒంగోలుకు పిలి పించారు. కిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఉన్నా నంటూ ఆమెతో ఫోన్ చేయించాడు యల మంద. దీంతో అక్కడకు కారులో వెంకటేష్ రాగానే యలమంద, మరో నలుగురు యువకు లు పూటుగా మద్యం తాగి అతడిని చితకబాది హత్యాయత్నం చేశారు. అదే సమయంలో గ స్తీలో ఉన్న పోలీసులు గుర్తించి అక్కడకు వెళ్లే సరికి దుండగులు పరారీ అయ్యారు. చావుబ తుకుల మధ్య ఉన్న వెంకటేష్‌ను వెంటనే రి మ్స్‌కు తరిలించారు. దుండగులలో ఒకరిని పో లీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

ఏపీ పీజీ లాసెట్‌లో మెరిసిన చీరాల విద్యార్థి

● రాష్ట్ర స్థాయిలో 20వ ర్యాంకు

చీరాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పీజీ లాసెట్ పరీక్షల్లో చీరాల మండల పరిధిలోని రామకృష్ణాపురంకు చెందిన అన్నపరెడ్డి దేవీ వరప్రసాద్ మెరిశాడు. ఏకంగా రాష్ట్ర స్థాయిలో 20వ ర్యాంకు సాధించి చీరాల ఘనతను చాటాడు. ఒంగోలు ప్రియదర్శిని లా కళాశాలలో ఎల్ఎల్‌బీ విద్యాభ్యాసం చేసిన వర ప్రసాద్ ప్రస్తుతం చీరాల కోర్టులో న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు.

అవీ.. ఇవీ



హరితశ్రీని అభినందిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

హరితశ్రీకి అభినందనల వెల్లువ

● ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకిటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళ విశ్వ విద్యాలయం గురువారం విడుదల చేసిన పీజీ లా సెట్ పరీక్ష ఫలితాలల్లో ప్రథమ ర్యాంకు సాధించిన హరితశ్రీకి అభినందనలు వెల్లువెత్తాయి. పట్టణంలోని బైసాని శ్రీనివాసరావు, సుజాతల కుమార్తె హరితశ్రీ పీజీ లాసెట్ పరీక్షలో 113 మార్కులతో రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించింది. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేకంగా ఫోన్ చేసి హరితశ్రీకి అభినందనలు తెలియజేశారు. అలాగే స్థానిక టీడీపీ నాయకులు చుండూరి మురళి సుధాకరరావు, అంకం నాగరాజు, బీజేపీ నాయకులు షేక్ కాలేషాబాబు విరాట్ తదితరులు హరితశ్రీని శాలువతో సత్కరించి అభినందించారు. హరితశ్రీ 1నుంచి 10వ తరగతి వరకు అద్దంకిలోని హోలీపెయిత్‌లోను, హైదరాబాద్‌లో ఎన్‌టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడిచే ఎన్‌టీఆర్ జూనియర్, డిగ్రీ కాలేజీలో చదువుకుంది. పీజీ విజయవాడలోని సిద్దార్థ లా కాలేజీలో ఎల్ఎల్‌బీ చేసింది.



యోగాసనాల్లో కలెక్టర్ వెంకట మురళీ, ఎమ్మెల్యే కొండయ్య

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం

● కలెక్టర్ వెంకట మురళీ, ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ యోగాసనాలు చేయడం వలనసంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందని కలెక్టర్ వెంకట మురళీ, ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. గురువారం వాడరేవు రోడ్డులోని నగరవనంలో యోగా అవగాహన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొని ఆసనాలు వేశారు. యోగా అత్యంత ప్రాచీనమైన ప్రక్రియని చెప్పారు. ఈనెల 21న జరుగు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, వైద్యాధికారి విజయమ్మ, ఆయుష్ అధికారి శ్రీనివాసరావు, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పర్చూరు ఇందిరా కాలనీలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పర్చూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోదుగుల నాగిరెడ్డి కోరారు. పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఇందిరా కాలనీ, అంబేడ్కర్ నగర్ తదితర కాలనీల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, విద్య ఆవశ్యకత తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైవీ సుబ్బారావు, బొజ్జా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అద్దంకి పట్టణం బొమ్మనంపాడు రోడ్డులోని లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

● పీడీ వెంకటేశ్వర్లు

అద్దంకి,జూన్19(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు అన్నారు. అద్దంకి పట్టణంలోని బొమ్మనంపాడు రోడ్డు, నాగులపాడు రోడ్డు, వేలమూరిపాడు రోడ్డులలోని లేఅవుట్‌లలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. కాంట్రాక్టర్ల ద్వారా నిర్మాణం చేస్తున్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టర్‌లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కాంట్రాక్టర్‌లు నిర్మించే ఇళ్లు లబ్ధిదారుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి ఖచ్చితంగా ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, హౌసింగ్ ఏఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రాజుగా ఉండాలన్నదే లక్ష్యం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : దేశానికి అన్నంపెట్టే రైతన్నలు రాజుగా ఉండాలన్నదే ప్రజా కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం అనంతరం జరిగిన సభలో ఏలూరి మాట్లాడారు. నల్లబర్లీ పొగాకును రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయటం చరిత్రాత్మకం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ రంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రైతుల పరిరక్షణ ధ్యేయంగా నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసి కూటమి కూటమి ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నది ఇది చరిత్రలో నిలిచిపోతుంది అనటంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు. చివరి రైతు వరకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పుడు కొనుగోలు సాధ్యం కాదని, రైతులు అపోహ పడ్డారని, అసాధ్యాన్ని ప్రభుత్వం సుసాధ్యం చేసిందన్నారు. విదేశీ మారకద్రవ్యం అధికంగా వచ్చే బ్లాక్ బర్లీ పొగాకు పంటను ప్రభుత్వం అదుకుంటుందని ఏలూరి స్పష్టం చేశారు. బర్లీ పొగాకు పంటను రాష్ట్రంలోనే పర్చూరు నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా రైతులు సాగుచేసారని, వారికి ప్రభుత్వం కొండంత అండగా నిలిచిందన్నారు. తదుపరి ప్రభుత్వం నిర్ణయం మేరకు పంట సాగుచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్, కలెక్టర్ జె. వెంకటమురళి, వేర్ హౌసింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఆర్డీవో గ్లోరియా, మార్కెటింగ్‌శాఖ అధికారి రమేష్‌బాబు, జిల్లా సహకార శాఖ అధికారి శ్యాంసన్, బుడ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఏఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

పర్చూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన గుంజి వెంకట్రావును వ్యవసాయశాఖ మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నల్లబర్లీ పొగాకు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులను ఉద్దేశించి ఏర్పాటు చేసిన సభలో మంత్రి చైర్మన్‌ను సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లను కలుపుతూ విద్యుత్ టవర్‌ల ఏర్పాటు



అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డు వెంబడి ఏర్పాటు చేస్తున్న విద్యుత్ టవర్‌లు

అద్దంకి,జూన్19(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ఇప్పటికే ఉన్న రెండు విద్యుత్ సబ్‌స్టేషన్‌లతో పాటు నిర్మాణంలో ఉన్న మరో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్‌లను కలుపుతూ విద్యుత్ టవర్‌ల ద్వారా విద్యుత్ లైన్ లు ఏర్పాటు చేస్తున్నారు. అద్దంకి పట్టణంలోని రాజీవ్‌నగర్, శింగరకొండ రోడ్డు లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, నిర్మాణంలో ఉన్న ఎస్ఎస్‌పీ కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్, ద్వారకానగర్ సబ్‌స్టేషన్‌లను కలుపుతూ విద్యుత్ లైన్ ఏర్పాటుకు నామ్ రోడ్డు వెంబడి 62 విద్యుత్ టవర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. సబ్‌స్టేషన్‌లను కలిపే విద్యుత్ లైన్‌లతో పాటు సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి వినియోగదారులకు విద్యుత్ సరఫరా జరిగే విద్యుత్ లైన్‌లు అన్నీ ఈ టవర్‌లకు ఏర్పాటు చేస్తారు. విద్యుత్ టవర్‌ల ఎత్తు 16 మీటర్లు కాగా, భూమి లోపలకు మూడు మీటర్లతో దిమ్మె ఏర్పాటు చేస్తారు. మిగిలిన 13 మీటర్ల ఎత్తు టవర్‌లకు విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తారు.

ఇప్పటి వరకు విద్యుత్ లైన్ లు తక్కువ ఎత్తు ఉండటంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఎక్కువ చోట్ల విద్యుత్ స్తంభాలు ఉండి స్థానికంగా ఉండే షాపుల నిర్వాహకులకు ఒకింత అంతరాయంగా ఉంటుంది. టవర్‌ల ద్వారా విద్యుత్ లైన్‌ల ఏర్పాటుతో పట్టణంలో ఎత్తు తక్కువగా ఉండే విద్యుత్ లైన్‌లను తొలగించనున్నారు. విద్యుత్ టవర్‌ల ద్వారా 4 సబ్ స్టేషన్‌లను అనుసంధానం చేయటం ద్వారా ఒక సబ్‌స్టేషన్ లో మరమ్మతులు చేయాల్సి వస్తే మిగిలిన సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్ సరఫరాకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దీంతో విద్యుత్ అంతరాయం తగ్గించే అవకాశం ఏర్పడుతుంది.



మహంకాళీ వీధిలో ఉన్న చిన్నపాటి రోడ్డు

అవ్వారువారి వీధిలోని రోడ్డు

ముత్యాల పేటలోని ఇరుకు వీధి

ఇరుకు రోడ్లతో అవస్థలు

అత్యవసర సమయాల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు కదల్లేని పరిస్థితి

చీరాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల పురపాలక సంఘం పరిధిలో ఇరుకు రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మునిసిపాలిటీలో 33 వార్డులు ఉన్నాయి.

అయితే వీటిల్లో ప్రధానంగా పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో రోడ్లు పూర్తిగా ఇరుకుమయంగా ఉన్నాయి. దీంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇదిలాఉంటే సాధారణ రాకపోకలు విషయం అటుంచి కనీసం విపత్కర సమయాల్లో ప్రధానంగా అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు సైతం వచ్చే పరిస్థితి లేదు.

ఈక్రమంలో ఏదయినా ప్రమాదం సంభవిస్తే ఎ టూ తెల్చుకోలేని దుస్థితి నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరుతున్నారు.

అద్దంకి నుంచి విశాఖకు 22 బస్సులు

గ్రామీణ రూట్లలో బస్సులు లేక ఇక్కట్లు

మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి



అద్దంకి బస్టాండ్ లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

అద్దంకి,జూన్19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహించే యోగా డే లో పాల్గొనే వారిని సమీప ప్రాంతాల నుంచి తరలించేందుకు అద్దంకి డిపో నుంచి 22 బస్సులు పంపినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. గురువారం సాయంత్రం బయలుదేరి వెళ్లిన బస్సులు తిరిగి ఆదివారం సాయంత్రానికి అద్దంకి చేరుకోనున్నాయి. దీంతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వివిధ గ్రామాలకు నడిపే పల్లెవెలుగు బస్సులు రద్దు అయ్యాయి. గురువారం మధ్యాహ్నం నుంచే బస్సులు రద్దుచేయటంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ప్రధాన రూట్ల లో బస్సులు నడుపుతున్నప్పటికి గ్రామీణ రూట్లలో అత్యధికశాతం బస్సులు రద్దు అయ్యాయి.

జాయింట్ ఎల్‌పీఎంలు విడగొట్టండి

పంగులూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):రీసర్వేలో పొందుపరచిన జాయింట్ ఎల్‌పీఎంల స్థానంలో వారి భూ హక్కును ధ్రువీకరిస్తూ సింగిల్ ఎల్‌పీఎం నెంబరు కేటాయించాలని మండల తహసీల్దార్ సింగారావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం గ్రామ సర్వేయర్లకు ఎల్‌పీఎం కేటాయింపు విషయమై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి వెంటనే జాయింట్ ఎల్‌పీఎంలు విడగొట్టి సింగిల్ ఎల్‌పీఎంలు కేటాయించాలని సిబ్బందికి సూచించారు. పదిరోజుల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు.

నోటు పుస్తకాల పంపిణీ

మార్టూరు,జూన్19(ఆంధ్రజ్యోతి): జాతీయ పఠన దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని లక్కవరం గ్రామంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, బిస్కట్లు, చాక్‌లెట్లను పంపిణీ చేశారు. ఎంఈవోలు వస్రాంనాయక్, ఎం. ప్రేమలత, రొటేరియన్లు మాదాల సాంబ శివరావు, కొర్రపాటి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కొప్పెరపాలెం సర్పంచ్ అమల మృతి

బల్లికురవ,జూన్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పెరపాలెం సర్పంచ్ వల్లంరెడ్డి అమల(60) బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో గుండె పోటుతో ఇంటి వద్ద మృతి చెందారు. ఎంపీడీవో కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావులు అమల మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

అద్దంకిటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అద్దంకి మండలంలో 2024-25 ఆ ర్థిక సంవత్సరానికి సంబంధించి మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు బహిరంగ ప్రజా వేదిక జరుగుతుందని ఎంపీడీవో బత్తిన శింగయ్య, ఏపీవో కోటేశ్వరిలు గురువారం తెలిపారు. 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31 వరకు 26 గ్రామాలలో జరిగిన ఉపాధి పనులపై ఈ నెల 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసిందని తెలిపారు. కావున మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది అందరు సంబంధిత రికార్డులతో హాజరు కావాలని తెలిపారు.

మూడు చక్రాల సైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

మార్టూరు,జూన్19(ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు ఆధ్వర్యంలో నెల్లూరు అలింకో సంస్థ సహకారంతో 80 శాతం వికలత్వం కలిగిన దివ్యాంగులు త్రీవీలర్స్ మోటారుసైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి దమ్ము అంజయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. రెండు చేతులు పని చేస్తూ నడుముక్రింది భాగం పనిచేయని దివ్యాంగులు, సదరం సర్టిఫికెట్,తదిర వివరాలతో మార్టూరులోని వెలుగుకార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు. వారిలో అర్హులైనవారికి ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు చేతుల మీదగా బ్యాటరీ చార్జింగ్ ట్రైసైకిల్‌ను అందజేస్తారన్నారు.



వేద పారాయణం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా కోదండ రామస్వామి శాంతి కల్యాణ మహోత్సవం

చినగంజాం, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసియున్న సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి దేవస్థానం ఆవరణలో గురువారం రాత్రి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ పూజారి ఆలహరి శేషతల్పసాయి స్వామి వారికి గురువారం ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దేవతామూర్తులను విశేషంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. సాయంత్రం దేవస్థానం ప్రాంగణంలో వేద పారాణం, నిత్య హోమం కార్యక్రమాలు జరిపారు. అనంతరం శారదాపీఠం వేదపండితులు మనోహర్‌రావు ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, పలు రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి, దంపతులచే శాంతి కల్యాణాన్ని వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాములోరి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వినియోగం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రైతులకు కౌలు గుర్తింపు కార్డులను అందజేస్తున్న ఏవో వెంకటకృష్ణ

కౌలు కార్డులతో రైతులకు ప్రయోజనం

అద్దంకిటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కౌలు కార్డులతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నామన్నారు, పావలా వడ్డీ, గిట్టుబాటు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి అన్ని పథకాలుకౌలు కార్డుల ద్వారా అందుతాయన్నారు. పొగాకు పంట ఈ సంవత్సరం సాగు చేయరాదని సూచించారు. నల్లబర్లీ పొగాకు ఉన్న రైతులు మండలంలో 187 మంది ఉన్నారని, వారి వద్ద ప్రస్తుతం 3 వేల క్వింటాల వరకు నిల్వ ఉందని తెలిపారు. ఈ మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు కౌలురైతు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ సాయిబాబు,మస్తాన్‌రావు, స్వాములు, రైతులు చింత వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

నాటుసారా తయారీకి దూరంగా ఉండాలి

చీరాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారీకు దూరంగా ఉండటం వలన చక్కని జీవితం అందుకుంటారని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, చీరాల ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఎ క్యాటగిరీ గ్రామం రామనగర్‌లో నాటుసారీ తయారీదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారు పెద్ద సంఖ్యలో మార్పు చెందేందుకు అంగీకరించడంతో డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ శ్రీనివాసరావు సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అధిక సంఖ్యలో మార్పు కలిగించే విధంగా కృషిచేసిన సీఐ నాగేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. అలాగే రామనగర్ పెద్దల సమక్షంలో బైండోవర్ జరిపారు.




టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొన్న కంటెయినర్

మూడు వాహనాలు ఢీ

● రాజుపాలెం రెస్ట్ ఏరియా వద్ద పెనుప్రమాదం

మార్టూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి):ముందు వెళుతున్న కారును వెనుకనుంచి టిప్పర్ ఢీకొనగా,ఆ టిప్పర్‌ను వెనుకనుంచి కంటెయినర్ ఢీకొంది.ఈ సంఘటన గురువారం మండల పరిధిలో జాతీయరహదారిపై ఒంగోలు వైపు రాజుపాలెం రెస్ట్ ఏరియా వద్ద జరిగింది.అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. టిప్పర్ లారీ వెనుకభాగం, కంటెయినర్ లారీ ముందుభాగం దెబ్బతిన్నాయి. అందినసమాచారం మేరకు ఒంగోలుకు చెందిన పద్నబాపయ్యశెట్టి గుంటూరు నుంచి ఒంగోలుకు కారులో వెళుతుండగా వెనుకనుంచి బాపట్ల బైపాస్ రోడ్డుపనులు నిమిత్తం మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఢీకొన్నది. దాంతో వేగాన్ని అదుపుచేసుకోలేని కారు రోడ్డుమధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొన్నది. అదేవిధంగా టిప్పర్ లారీ వెనుక భాగాన్ని విజయవాడ నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళుతున్న కంటెయినర్ లారీ ఢీకొన్నది. అయితే మూడువాహనాలలోని వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనతో రోడ్డుపై ఏర్పడిన ట్రాఫిక్‌ను హైవే మొబైల్ పోలీసులు తొలగించారు.ఇదిలా ఉండగా హీరోషోరూం ఎదురుగా జాతీయరహదారిపై లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో మార్టూరు గ్రామానికి చెందిన ఒక యువకుడు గాయాలపాలయ్యాడు.





ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ పేరంటాల దంపతులు

వైభవంగా వెంగమాంబ తిరునాళ్ల

- అంబరాన్నంటిన సంబరాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు
- ఉత్సాహంగా బండలాగుడు పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



బండలాగుడు పోటీల్లో పాల్గొన్న ఎడ్లు

దుత్తలూరు(ఉదయగిరి); జూన్ 19(ఆంధ్రజ్యోతి): నర్రవాడలోని వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ముగిశాయి. లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈనెల 15న నిలుపుతో ప్రారంభమైన ఉత్సవాలు ఐదు రోజులపాటు వైభవంగా జరిగాయి. చివరి రోజున వెంగమాంబ పేరంటాల దంపతులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఆశీనులు చేసి పరిసర గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచే నర్రవాడకు భక్తుల తాకిడి పెరిగింది. మహిళలు అత్యధికంగా తరలివచ్చి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు ఎండు కొబ్బరి హోమగుండంలో వేసి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం రాత్రి నుంచి

- మిగతా 5వ పేజీలో



హంస వాహనంపై దర్శనమిచ్చిన కామాక్షి సమేత రామలింగేశ్వరుడు

హంసపై రామలింగేశ్వరుడి

వైహోరం

విడవలూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కామాక్షీదేవి సమేత రామలింగేశ్వరస్వామి హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చాడు. పాలు, నీరును హంస వేరు చేసినట్లుగా మానవులు మంచి-చెడును తెలుసుకుని జీవనాన్ని సాగించాలని చాటి చేప్పేందుకు రామలింగేశ్వరుడు వాణీబ్రహ్మ స్వరూపంలో హంస వాహనంపై విహరించారని పురాణాలు పేర్కొన్నాయి. తొలుత ఆలయ ప్రధాన పూజారి శ్రీకాంత్ శర్మ స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, మహన్యాస రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు, నివేదన, బలిహరణ పూజలు చేశారు. అనంతరం అత్యంత సుందరంగా అలంకరించిన హంస వాహనంపై రామలింగేశ్వరుడు కామాక్షీదేవి సమేతుడై రామతీర్థం, వరిణి గ్రామ వీధుల్లో ఊరేగారు. ఈ వేడుకలకు వరిణి గ్రామానికి చెందిన సురేష్‌కుమార్, అశోక్ కుమార్, శిబివాహన్ ఉభయ కర్తలుగా వ్యవహరించారు. రామతీర్థం గ్రామానికి చెందిన ఆవుల చలపతి-వరలక్ష్మీ దంపతులు పూలంగి సేవకు ఉభయకర్తలుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మల్లికార్జునరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్,ఆలయ గుమస్తా వెంకటేశ్వర్లు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు

యోగా దినోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు : కలెక్టర్

నెల్లూరు(విద్య), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో శనివారం యోగాదినోత్సవ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఈనెల 21న నిర్వహించాల్సిన అంతర్జాతీయ యోగా దినోత్సవంపై గురువారం అమరావతి నుంచి సీఎం చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లాలో వార్డు, గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఏడువేల ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది అంతా కూడా తమతమ పరిధిలో ఏర్పాట్లు చేస్తున్నారని కలెక్టర్ వివరించారు. అన్ని ప్రదేశాల్లో యోగా ట్రైనర్స్, ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పదివేలమందితో సామూహిక యోగాసనాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యోగాలో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్‌లను అందచేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ కే. కార్తీక్, నోడల్ ఆఫీసర్ ఆర్‌కే.యతిరాజ్, డీఈవో బాలాజీరావు, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లాసెట్ ఫలితాల విడుదల

- ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లా విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ లాసెట్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయ కళాశాలల్లో ప్రవేశానికి తిరుపతి శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 5న లాసెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. రెండేళ్ల పీజీ లాసెట్‌తోపాటు మూడేళ్లు, ఐదేళ్ల లాసెట్ ఫలితాలను కూడా ఒకేసారి విడుదల చేశారు. పీజీ ప్రవేశ పరీక్షకు జిల్లాలోని ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి మొత్తం 127 మంది దరఖాస్తు చేసుకోగా, 115 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 111 మంది ఉత్తీర్ణత సాధించారు. మూడేళ్ల లాకోర్సుకు మొత్తం 1166 మంది దరఖాస్తు చేసుకోగా, 945 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 934 మంది ఉత్తీర్ణత సాధించారు. ఐదేళ్ల లాకోర్సుకు మొత్తం 228 మంది దరఖాస్తు చేసుకోగా, 194 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 189 మంది ఉత్తీర్ణత సాధించారు.

జూలై 3 వరకు కాకాణికి రిమాండ్

నెల్లూరు (లీగల్), జూన్ 19(ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం పోర్టు సమీపంలో టోల్ గేట్ ఏర్పాటు చేసి డబ్బు వసూలు చేశారన్న కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జూలై 3 వరకు రిమాండ్ విధిస్తూ నెల్లూరు మొదటి తరగతి స్పెషల్ రైల్వే జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ పాలంగళం వినోద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించి ముత్తుకూరు పోలీసులు కాకాణిని పీటీ వారెంట్ మీద కోర్టులో హాజరు పరచగా, న్యాయాధికారి ఇరుపక్షాల వాదనలు విన్నాక, ఐపీసీ సెక్షన్ 409ను తొలగిస్తూ కాకాణిని జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించారు.

ఆయనపై అంత ప్రేమెందుకో...?

- కాంట్రాక్టర్ నుంచి నగదు రికవరీపై దోబూచులాట
- నాణ్యత లేకుండా సోమశిల రోడ్డు నిర్మాణం
- పదేళ్ల క్రితం తిరస్కరించిన క్యూసీ చీఫ్ ఇంజనీర్
- చర్యలకు విజిలెన్స్ సిఫార్సు
- పైగా ఆర్‌అండ్‌బి మంత్రి కూడా ఆదేశాలు
- అయినా కదలని ఆశాఖ అధికారులు

నెల్లూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ నివేదిక అంటే లెక్కలేదు... విజిలెన్స్ డీజీ సిఫార్సులపై గౌరవం లేదు... ఆర్‌అండ్‌బీ సెక్రటరీ ఉత్తర్వులు అంటే బాధ్యత లేదు... సాక్షాత్తూ ఆర్‌అండ్‌బీ మంత్రి ఆదేశించినా భయమే లేదు....! కానీ ప్రజాధనాన్ని దోచుకున్న కాంట్రాక్టర్ అంటే మాత్రం ఎంతో ప్రేమ..! ఇదీ క్లుప్తంగా ఆర్‌అండ్‌బీశాఖలో పరిస్థితి. ఆత్మకూరు-సోమశిల రోడ్డును పదేళ్ల క్రితం నాసిరకంగా నిర్మించడంతో అనతికాలంలోనే దెబ్బతింది. అప్పట్లోనే ప్రజలు గగ్గోలు పెట్టడంతో ఏకంగా క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ వచ్చి విచారించి, రోడ్డు వర్కు మొత్తాన్ని రిజెక్ట్ చేశారు. ఆ తర్వాత విజిలెన్స్ అధికారులు కూడా లోతుగా విచారించి కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేయడంతోపాటు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. కానీ ఏళ్లు గడిచిపోతున్నా ప్రజాధనాన్ని రికవరీ చేయడం గానీ, బాధ్యులపై చర్యలు తీసుకోవడంగానీ, మళ్లీ దెబ్బతిన్న రోడ్డును బాగుపరచడంగానీ చేయలేదు. ఈ చర్యలకు సంబంధించిన ఫైలు ఆ కార్యాలయానికి, ఈ కార్యాలయానికి అంటూ తిరుగుతోందితప్ప ఫలితం ఉండడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్‌కు కొమ్ము కాస్తూ ప్రజాధనం రికవరీపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ వ్యవహారంలో భారీగా చేతులు తడిసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● రిజెక్ట్ చేసిన క్యూసీ సీఈ

ఆత్మకూరు-సోమశిల రోడ్డు అభివృద్ధికి పదేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. కిలోమీటర్ 17 నుంచి కిలోమీటర్ 40 వరకు రెండు వరుసల రోడ్డు విస్తరణకు సుమారు రూ.25 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఓ కాంట్రాక్టర్ ఈ వర్కును 16 శాతం లెస్‌కు దక్కించుకున్నారు. 2015లో రోడ్డు నిర్మాణ పనులు జరగ్గా కొందరు స్థానికులు నాణ్యత లోపంగా పనులు జరుగుతున్నాయని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత రాష్ట్ర అధికారులకు కూడా ఫిర్యాదులు అందడంతో అప్పటి క్వాలిటీ కంట్రోల్ సీఈనే విచారణకు వచ్చారు. రోడ్డు నాణ్యతను పరిశీలించి నిబంధనల మేరకు నాణ్యత లేదని నిర్ధారించారు. అప్పటి వరకు జరిగిన పనుల్లో మొత్తం ఇదే మాదిరిగా నిర్మాణం జరగడంతో ఆ వర్కునే



- మిగతా 6వ పేజీలో

బువ్వ భలేగుంది !

- సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం తయారీ
- పథకంపై విద్యార్థుల సంతృప్తి
- త్వరలో పెంచిన మెనూ చార్జీల అమలు



సన్నబియ్యంతో చేసిన వెజిటబుల్ బిర్యానీ

ఆత్మకూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థలో పలు కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు సన్న బియ్యంతో కమ్మటి భోజనం పెడుతున్నది. అంతేకాక త్వరలో పెంచిన మెనూ చార్జీలు అమలులోకి తీసుకురానున్నది. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఒక్కొరికి రూ. రూ.5.88 వస్తుంది. ఆ మొత్తాన్ని రూ. 6.19లకు పెంచింది. ఉన్నత పాఠశాల విద్యార్థికి ఇస్తున్న రూ. 8.57లను రూ. 9.29లకు పెంచింది. గతంలో దొడ్డు బియ్యంతో భోజనం తయారుచేసి వడ్డిస్తుండడంతో పిల్లలు సరిగా తినేవారు కాదు. చాలా మంది అర్ధాకలితో అలమటించేవారు. మరికొందరు విద్యార్థులు ఇళ్లకు వెళ్లి భోజనం చేసి వచ్చేవారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు క్యారేజీలో మధ్యాహ్న భోజనం తెచ్చుకునే వారు. ఈ సమస్యలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే సన్న బియ్యంతో భోజనం అందించడానికి శ్రీకారం చుట్టింది. మెనూ ప్రకారం సన్నబియ్యంతో కమ్మటి భోజనం పెడుతున్నది. మధ్యాహ్న భోజనం అమలు తీరుపై గురువారం 'ఆంధ్రజ్యోతి' పలు ప్రభుత్వ పాఠశా లలను విజిట్ చేసి విద్యార్థులను, ఉపాధ్యాయులను పలకరించింది. విద్యార్థులు గతం కంటే సన్న బియ్యంతో వండిన భోజనం రుచికరంగా ఉందని సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు తాము సైతం పాఠశాలల్లో వండిన భోజనమే తింటున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్ సంఖ్య తగ్గుతుందని ఉపాధ్యాయులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. ముందుగా వంటగదిలోకి వెళ్లి ఏజెన్సీ నిర్వాహకులను పలకరించింది. గతంలో ఎంత బాగా వండినా లావు బియ్యం కావడంతో అన్నం ముద్దగా ముద్దగా తయారయ్యేదని తెలిపారు. ఈ ఏడాది సన్నబియ్యంతో వండిపెట్టడంతో విద్యార్థులు తృప్తిగా భోజనం చేస్తున్నారని తెలిపారు. మెనూ ప్రకారం సన్న బియ్యంతో వండిన వెజిటేబుల్ బిర్యానీ, ఉల్లగడ్డ కుర్మా, కోడిగుడ్డు ఫ్రై విద్యార్థులకు వడ్డించారు



ఆత్మకూరులో సంతోషంగా భోజనం చేస్తున్న విద్యార్థినులు

భోజనం రుచిగా ఉంది



మా పాఠశాలలో పెడుతున్న మధ్యాహ్న భోజనం చాలా రుచిగా ఉంది. సన్న బియ్యం కావడంతో అన్నం మెత్తగా పొడిపొడిగా బాగుంది. కడుపు నిండా తృప్తిగా తింటున్నాం. మెనూ ప్రకారం వండి వడ్డిస్తున్నారు. కూరలు కూడా రుచికరంగా ఉన్నాయి. కడుపునిండా తింటున్నాం. బాగా చదువుకుంటున్నాం.

- ఎన్ మౌనిక, 7వ తరగతి, ఆత్మకూరు

భోజనం చాలా బాగుంది



మా స్కూల్లో పెట్టే మధ్యా హ్న భోజనం చాలా బాగుంది. ఇంటి భోజనం ఉన్నట్లుగా ఉంది. సన్నబియ్యంతో వంట చేస్తున్నారు. తృప్తిగా తింటు న్నాం. భోజనం కావాలంటే మళ్లీ అడిగి పెట్టించుకుంటాం. చాలా సంతోషంగా ఉంది.

- షేక్ జమీర్, 8వ తరగతి, ఆత్మకూరు

బువ్వ భలే ఉంది..



అప్పుడు పెట్టే బువ్వ కంటే ఇప్పుడు పెడుతున్న బు వ్వ బాగుంది.మా ఇంట్లో తినే అన్నం కంటే బాగుంది. కొన్ని రోజుల నుంచి అన్నం బాగుండడంతో మేమంతా బాగా తింటున్నాం.రోజు ఇలాగే పెడితే బాగుంటుంది.

- పఠాన్ హబీబా,3వ తరగతి

హెల్పర్లుకు జీతం పెంచాలి



మధ్యాహ్న భోజన పథకం హెల్పర్లకు ప్రస్తుతం నెలకు రూ.4000 ఇస్తున్నారు. దాంతో ఎవరూ ముందుకు రావడం లేదు. మా పాఠశాలలో నలుగురు హెల్పర్లు ఉన్నారు. వారికి జీతం చాలదని పనిలోకి రాకపోతుంటే నేనే ఇంకొంత సొంత డబ్బులు ఇచ్చి పని చేసుంచు కుంటున్నా. టీడీపీ అధికారంలోకి వస్తే హెల్పర్లకు జీతం రూ. 5000కు పెంచుతామని హామీ ఇచ్చారు. అది అమలు చేయాలి. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తే సంతోషంగా ఉంటుంది.

- పఠాన్ షమీమ్, ఏజెన్సీ నిర్వాహకురాలు, ఆత్మకూరు

ఆదర్శ పాఠశాలలో భోజనం భేష్

అనంతసాగరం: ప్రభుత్వ పాఠశాలలకు కూటమి ప్రభుత్వం నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేస్తోంది. ఈ క్రమంలో విద్యార్థులు, వారి తల్లిండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదర్శ పాఠశాలను 'ఆంధ్రజ్యోతి' గురువారం మధ్యాహ్నం సందర్శించింది. విద్యార్థులకు వెజిటబుల్ బిర్యానీ, సాంబారు వడ్డించడంతో భోజనం బాగుందని వారు ఆనందం వ్యక్తం చేశారు.



అనంతసాగరం ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

సికిల్ సెల్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సికిల్ సెల్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. గురువారం నగరంలోని రాజాగారి వీధి పట్టణ ఆరోగ్య కేంద్రంలో అవగాహన ప్రదర్శన జరిగింది. ఆమె మాట్లాడుతూ 0 నుంచి 40 ఏళ్ల వయసున్న వారందరికి సికిల్ సెల్ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వైద్య బృందం ఇంటింటికి వస్తుందని తెలిపారు. ప్రధానంగా ఎస్టీ కాలనీల్లోని వారికి ఈ స్ర్కీనింగ్ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా ట్రైబుల్ ప్రాజెక్టు మేనేజర్ మల్లికార్జునరెడ్డి, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ నాగేంద్ర, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

'ప్రకాశం' కరస్పాండెంట్

కంచర్ల రామయ్య కన్నుమూత



కంచర్ల రామయ్య (ఫైల్)

కందుకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్, సీనియర్ జర్నలిస్టు కంచర్ల రామయ్య (76) గురువారం సాయంత్రం కన్నుమూశారు. నెలరోజులుగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామయ్య మల్టీఆర్గాన్ ఫెయిల్యూర్‌తో తనువు చాలించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి కంచర్ల శ్రీకాంత్ తండ్రే కంచర్ల రామయ్య. కందుకూరు సమీపంలోని అత్తంటి వారిపాలెంలో సామాన్యరైతు కుటుంబంలో ఆయన జన్మించారు. ఓ ప్రముఖ దినపత్రికలో విలేకరిగా చేరి రాష్ట్రస్థాయి జర్నలిస్టుగా ఎదిగారు. ఆయన రిటైర్‌మెంట్ తర్వాత కందుకూరులో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పారు. జర్నలిస్టుగా, విద్యావేత్తగా ఎందరికో ఉద్యోగ, ఉపాధి కల్పనకు రామయ్య కృషి చేశారు. రామయ్యకు భార్య, కుమారులు విజయ్ శ్రీనివాస్, శ్రీకాంత్ ఉన్నారు.

● సీఎం చంద్రబాబు, లోకేష్ సంతాపం

కంచర్ల రామయ్య మృతిపట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లతో పాటు పలువురు ప్రముఖులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తంచేశారు. రామయ్య మృతి బాధాకరమని సీఎం చంద్రబాబు తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. కంచర్ల రామయ్య మృతి దిగ్ర్భాంతి కలిగించిందని లోకేష్ పేర్కొన్నారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం, టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్, వివిధరంగాల ప్రముఖులు రామయ్య మృతిపట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

● రేపు అంత్యక్రియలు

కంచర్ల రామయ్య అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున మృతదేహాన్ని కందుకూరులోని ఆయన నివాసానికి తీసుకుని వస్తారని తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్థివ దేహాన్ని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలకు తీసుకెళ్లి అక్కడ ప్రజల సందర్శనార్థం ఉంచుతారని వారు తెలిపారు. శనివారం ఉదయం కళాశాల ప్రాంగణంలోనే ప్రత్యేక ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 530

రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందిస్తా ..!

లింగసముద్రం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రం మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారిగా గుడ్లూరు మండల రెగ్యులర్ వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న బి రవికుమార్‌ను ఉన్నతాధికారులు నియమించారు. దీంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న టి అబ్రహంలింకన్ పామూరు మండల వ్యవసాయ అధికారిగా బదిలీపై వెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు రవికుమార్‌ను ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారిగా నియమించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ అందుబాటులో ఉంటూ వారికి అవ సరమైన సూచనలు అందిస్తూ అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తానని చెప్పారు.

మరమ్మతులకు నోచుకోని సాగునీటి చెరువులు

● మాగాణి భూములకు అందని నీరు
● ఆయకట్టు రైతుల అవస్థలు

వలేటివారిపాలెం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి చెరువులు మరమ్మతులకు నోచుకోలేదు. ఫలితంగా చెరువుల్లో చిల్లచెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరిగి అడవులను తలపిస్తున్నాయి. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు సరఫరా కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వలేటివారిపాలెం మండలంలోని బంగారక్కపాలెం, చుండి, అయ్యవారిపల్లె అంకభూపాలపురం, పోకూరు, నలదలపూరు, శాఖవరం, వలేటివారిపాలెం తదితర గ్రామాల్లోని చెరువుల్లో చిల్లచెట్లు, తుమ్మచెట్లు ఏపుగా పెరిగాయి. అంతేగాకుండా చెరువులకు వర్షం నీరు వచ్చే కాలువల్లో కూడా చిల్లచెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. దీంతో చెరువుల్లోకి వర్షంనీరు సక్రమంగా పారడం లేదని, అడవి పందులు సంచరిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా



వలేటివారిపాలెం రామన్నచెరువులో దట్టంగా పెరిగిన చిల్లచెట్లు

చెరువు కట్టలపై చెట్లు, పుట్టలు పెరిగి కట్టలు బలహీనపడ్డాయి. వరదనీరు భారీగా చేరితే చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉంది. అంతేగాకుండా చెరువుల అలుగులు కూడా ధ్వంసం అయ్యాయి. చెరువుల్లో చిల్లచెట్లు తుమ్మచెట్లు ఏపుగా పెరగడంతో వరదనీరు నిల్వ ఉండే అవకాశాలు కూడా లేవు. దీంతో ఆయకట్టు చివరి భూములకు నీరు సరఫరా అయ్యే అవకాశాలు లేవని రైతులు వాపోతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువులకు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువులకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం:త్రివిక్రమ్, ఇరిగేషన్ ఏఈ

మండలంలోని 38 సాగునీటి చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. వాటిలో నాలుగు చెరువులకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. అవి కూడా ఒక్కో చెరువుకు నాలుగు లక్షలు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. మిగిలిన చెరువులకు నిధులు మంజూరు కాలేదు.

న్యూస్ బాక్స్

మహాలక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకారంలో అమ్మవారు

కలిగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరులో ఉన్న మహాలక్ష్మమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం



శ్రీదేవీ, భూదేవితో చెన్నకేశవస్వామి.

బిట్రగుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల కేంద్రమైన కుమ్మర వీధిలో కొలువై ఉన్న చెన్నకేశవస్వామి, వీరాంజనేయస్వాముల ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ముగిసాయి. అందులో భాగంగా బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవిలతో చెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ ఉభయకర్తలుగా చక్కా నారాయణ కుటుంబ సభ్యులు, వల్లూరు రవీంద్రబాబు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

శిథిలావస్థలో ఉన్న వాటర్‌ట్యాంక్ కూల్చివేత

● గ్రామస్థుల హర్షం



వాటర్ ట్యాంక్ కూల్చివేతను పరిశీలిస్తున్న గ్రామస్థులు.

కావలి రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చౌదరిపాలెంలో శిథిలావస్థలో ఉన్న వాటర్‌ట్యాంక్‌ను గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూల్చివేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వాటర్‌ట్యాంక్ కూల్చివేత విషయమై బుధవారం గ్రామానికి చెందిన గేరంట్ల రాంబాబు, కొంపల్లి వెంకటేశ్వర్లు మరికొందరు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు కమిషనర్ శ్రావణ్‌కుమార్ వాటర్ ట్యాంక్ కూల్చివేయాలని అధికారులకు సూచించారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాటర్‌ట్యాంక్‌ను కూల్చివేశారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి, కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హైస్కూల్‌కు సామగ్రి అందజేత



కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు సామగ్రిని బహూకరించిన పూర్వ విద్యార్థులు

లింగసముద్రం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు రూ.80 వేల విలువైన సామగ్రిని బహూకరించారు. గురువారం హైస్కూల్ ఆవరణలో జరిగిన ఓ కార్యక్రమంలో 1994-99 విద్యా సంవత్సరంలో ఈ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు బక్కముంతల ఓంకారం, మైలా ప్రసాద్, మద్దా బాలు పూర్వ విద్యార్థుల ప్రతినిధులుగా రూ.50 వేలు విలువైన సౌండ్‌సిస్టమ్, రూ.30 వేల విలువైన 60 కుర్చీలు ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావుకు అందించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాధవరావు పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం కొండయ్య, కె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీడీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే దగుమాటి పరామర్శ

కావలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష కుటుంబాన్ని గురువారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి టీడీపీ నేతలతో కలిసి పరామర్శించారు. ఖాదర్‌బాష (ఇట్టు) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం ఖాదర్‌బాష నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన కుటుంబానికి టీడీపీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు.



టీడీపీ నేత ఖాదర్‌బాషా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నేతలు

జర్నలిస్ట్ నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కావలి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను గురువారం కావలి ఎమ్మెల్యే దగుమటి వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు. నాగేశ్వరరావు సోమవారం రాత్రి అకాల మరణం చెందటంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, అమరావేదగిరి, పోతుగంటి శ్రీకాంత్, ఆర్యవైశ్య, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పగిలిన మంచినీటి ప్రధాన పైపులైన్

● రోడ్డు బురదమయం ● ప్రజల అవస్థలు

కావలి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ ఆర్వోబీ పక్కన ఉన్న చర్చి సమీపంలో ఉన్న మంచినీటి పైపులైన్ గురువారం మరలా పగిలి రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అంతేకాకుండా నాసిరకం పైపులైన్ల ఏర్పాటు వలన తరచూ పైపులైన్లు పగులుతూ కావలి పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల లోపు మూడు పర్యాయాలు ఒకే చోట పైపులైన్ పగిలింది. గతనెల 24వ తేదీన పైపులైన్ పగిలిపోవటంతో దానిని మరమ్మతులు చేసి మంచినీటి సరఫరా పునరుద్ధరించే సరికి నాలుగు రోజులు పట్టింది. దీంతో ఆ నాలుగు రోజులు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే మరలా అదేచోట జూన్ 1వ తేదీ పైపులైన్ పగిలిపోయింది. దీంతో మరలా మరమ్మతులు పనులు చేపట్టి దానిని పూడ్చకుండా పర్యవేక్షణ నిమత్తం అలాగే వదిలి వేశారు. మరలా గురువారం పైపులైన్ పగలటంతో వెంటనే మరమ్మతులు చేపట్టారు. కాగా, తరచూ పైపులైన్‌లు పగిలిపోతుండటంతో పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి చొరవతీసుకుని దెబ్బతిన్న పైపులైన్ స్థానంలో శాశ్వత ప్రాతిపదికన ఐరన్ పైపులైన్ వేసేందుకు పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించేలాగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పైపులైన్ పగిలి బురదమయంగా మారిన రోడ్డు

డయేరియా నివారణపై అవగాహన కల్పించాలి



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న వైద్యసిబ్బంది

కలిగిరి, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): డయేరియా నివారణపై గ్రామస్థాయిలో ప్రజలకు పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించాలని వైద్యాధికారిణి డా. బిజ్జం గీతారెడ్డి సూచించారు. ఈసందర్భంగా గురు వారం స్థానిక పీహెచ్‌సీలో అతి సారా వ్యాధి నివారణ చర్యలకు సంబంధించి గోడపత్రిక ఆవిష్క రించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ మండల పరిధిలో ఉన్న ఐదు సంవత్సరాల వయస్సు లోపు పిల్లలు ఉన్న ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులకు డయేరియాపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అతిసారా సోకిన చిన్నారులకు పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఎవరికైనా అతిసారా సోకినట్లయితే ఏఎన్ఎంలు లేదా ఆశా కార్యకర్తలకు సమాచారం అందించి వైద్య చికిత్సలు పొందాలని సూచించారు. చిన్నారులకు తల్లిపాలు శ్రేష్ఠమని, తల్లిపాలతోపాటు పౌష్టికాహారం అందించాలన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ సకాలంలో వ్యాధినిరోధక టీకాలు చిన్నారులకు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్ సాయిలక్ష్మి, స్టాఫ్‌నర్స్ జి స్వప్న, హెల్త్ అసిస్టెంట్‌లు నారాయణరాజు, క్రిష్ణయ్య, పద్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలను ఉంచాలి



చినపవనిలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి రవికుమార్

లింగసముద్రం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల దుకాణాల డీలర్లు ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి బి రవికుమార్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని చినపవని గ్రామంలోని శ్రీ లక్ష్మీ సాయిబాబా ఫెర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. షాపులోని రికార్డులను, నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన డీలర్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

కావలి రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 21వ తేదీన ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు జయప్రదం చెయ్యాలని ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీదేవి కోరారు. కావలి పట్టణ ఎమ్పీడీవో కార్యాలయంలో గురువారం యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాలకు గాను 144 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని, అలాగే మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం కృష్ణారావు, ఏపిఎం చంచయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రజనీకాంత్

●అల్లూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అల్లూరు ఎంపీడీఓ రజనీకాంత్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో, యోగా గురువులతో సమావేశం నిర్వహించారు. శనివారం నిర్వహించనున్న యోగా కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అత్యధికమంది హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా ఎంపిక చేసినవారి వివరాల ఆధారంగా వారికి వసతులను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, యోగా గురువులు మల్లికార్జున, కొప్పు శ్రీనివాసులు, దమ్మాల బ్రహ్మానందరావు, శ్రీహరిరెడ్డి, పాల్గొన్నారు.

వికసిత్ భారత్ కరపత్రాల ఆవిష్కరణ



వికసిత్ భారత్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మందా కిరణ్ అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో గురువారం వికసిత్ భారత్ సంకల్పం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ 11 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా కరపత్ర ఆవిష్కరణ గావించామన్నారు. కార్యక్రమంలో జిల్లా టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యులు బ్రహ్మ నందం, జీఎస్టీ మండలి సభ్యులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూడిన కరపత్రాలు ఆవిష్కరించడం జరిగిందని, ప్రతి కార్యకర్త బూత్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేసి ప్రచారం నిర్వహించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం అందించిన సహాయ సహకారాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్ళేందుకు కరపత్రాలు పంపిణీ కార్యక్రమం దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ మాల్యాద్రి, సవీంద్ర, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సీఐ చొరవతో రహదారిపై గుంతల పూడ్చివేత

కలిగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కలిగిరి సర్కిల్ ఇనస్పెక్టర్ వెంకటరమణ చొరవతో కలిగిరి-కొండాపురం మార్గంలో కలిగిరి శివారుప్రాంతం వద్ద ఎన్నో ఏళ్ళుగా దుస్థితిలో ఉన్న రహదారి కష్టాలకు గురువారం ఉపశమనం కలిగింది. మే నెల 29న దుస్థితిలో గ్రామీణ రహదారు- పట్టించుకోని అధికార్లు అంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. ఈ క్రమంలో అప్పటినుంచి స్థానికులు రోడ్డు నిర్మాణానికి తమ వంతు ప్రయత్నాలు చేయడం జరిగింది. ఈ సమస్య పోలీసు శాఖవద్దకు వెళ్ళడంతో స్పందించిన సీఐ, ఎస్ ఉమాశంకర్‌తో కలిసి రహదారి దుస్థితిని పరిశీలించారు. చిన్నపాటి వర్షం వచ్చినా వారంరోజులపాటు రోడ్డుపై నిలిచిన మురుగునీరు, దుర్వాసనలతో తాము పడు తున్న ఇబ్బందులు స్థానికులు సీఐ దృష్టికి తీసుకువచ్చారు. మురుగునీటిలో నడవడానికి వీలులేక మహిళలు, వృద్ధులు పడుతున్న కష్టాలకు చలించిన సీఐ వెంకటరమణ వెంటనే టిప్పర్ల ద్వారా రెడ్‌మిక్స్ తరలించి గుంతలను పూడ్పించి స్థానికుల కష్టాలు తొలగించారు. తమ కష్టాలు తొలగడంతో వాహనదారులు, స్థానికులు పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలియజేశారు.



రెడ్‌మిక్స్‌తో గుంతలు పూడ్చిన తర్వాత రోడ్డు

వైభవంగా వెంగమాంబ తిరునాళ్ల

(3వ పేజీ తరువాయి)

ప్రారంభమైన వెంగమాంబ ప్రదానోత్సవం గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఉత్సవాల ముగింపు సందర్భంగా పచ్చవ వంశీయులు మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య సారెను తీసుకొచ్చి అమ్మవారికి అందచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

● ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించేందుకు వేలాది మంది తరలివచ్చారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి తొమ్మిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కి చెందిన ఏఎస్‌పీ సుంకి సురేంద్రరెడ్డి ఎడ్లు ప్రథమస్థానం, కడప జిల్లా మైదుకూరుకి చెందిన కుర్రా వెంకటేష్‌యాదవ్ ఎడ్లు ద్వితీయ స్థానం, కడప జిల్లా ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వారశీల గురివిరెడ్డి, అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఎం.రమేష్‌బాబుయాదవ్ ఎడ్లు తృతీయస్థానం సాధించాయి. బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లు 4వ స్థానం, నంద్యాల జిల్లా జిల్లెల గ్రామానికి చెందిన గొట్టికే హేత్విక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి ఎడ్లు 5వ స్థానంలో నిలిచాయి. విజేతలకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, అధికారులు, దాతలు వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేల చొప్పున నగదు బహుమతులు అం దజేశారు. ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, దేవదాయ శాఖ అధి కారులు విజయవంతంగా నిర్వహించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పా టు చేశారు. వెంగమాంబ సేవాసమితి, భక్తమండలి, పూర్వ విద్యార్థులు, పలువురు దాతలు భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు.



పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు



శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

● భోజ్యా, కప్పరాళ్లతిప్ప ఎస్సై

బిట్రగుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎస్సై భోజ్యా అన్నారు.

ఈ తరుణంలో...

? దాడులు, అల్లర్లపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

! గొడవలు జరిగేలా ఉంటే ముందస్తు చర్యలు చేపడతాం, పరస్పర దాడులకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాము. ఆకతాయల అల్లర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

? మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ఎటువంటి చర్యలు చేపట్టారు.

! రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో నిరంతరం తనిఖీలు చేస్తున్నాం.

? నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. గ్రామ కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం. అలాగే సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్నాం.

164 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 544 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 380 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-138, ఆర్ఆర్-14, సీఆర్-6, జంపింగ్ లాట్స్-6 కారణాలతో 164 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.245.40గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

వ్యవసాయ డిప్లమోకు దరఖాస్తు గడుపు పెంపు

అనంతసాగరం జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లమో కోర్సు చేరేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉన్నట్లు సోమశిల అగ్రికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ కే పల్లంరాజు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం 9441206497ను సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు రెవెన్యూ దినోత్సవం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో నిర్వహిస్తున్నారు. రెవెన్యూ డే నిర్వహించడానికి అంగీకరించిన కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు తదితరులకు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య

సైదాపురం, జూన్ 19(ఆంధ్ర జ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఓ గుర్తు తెలియని యువ కుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాంతికుమార్ తెలిపారు.

రైలుపట్టాల పక్కన గుర్తుతెలియని మృతదేహం

బిట్రగుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్ దక్షిణ యార్డు రెండవ నెంబరు ట్రాక్ వద్ద సుమారు 45 సంవత్సరాల వయస్సు గల మృతదేహాన్ని గురువారం గుర్తించినట్లు కావలి రైల్వే పోలీసులు తెలిపారు. వారం రోజుల క్రితం గుర్తు తెలియని రైల్లో నుంచి పడి మృతిచెంది ఉండవచ్చని తెలిపారు. శరీరం చాలావరకు కుళ్ళిపో యిందని, మృతుని మెడలో ఎరుపు, నలుపు, పసుపు రంగుల దారాలకు ఆంజనేయ స్వామి డాలర్ ఉందని, నల్లని నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేంకటేశ్వరరరావు తెలిపారు.

మోటారుబైక్ బోల్తాపడి వైసీపీ నేతకు గాయాలు

కావలి రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ బుడంగుంట క్రాస్ రోడ్డు సమీపంలో గురువారం మోటారుబైక్ అదుపుతప్పి బోల్తాపడి వైకుంఠపురానికి చెందిన వైసీపీ నాయ కుడు పరుసు మాళికి గాయాలు అయ్యాయి. దీంతో ఆయనను 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ: కాగా, ప్రమాదంలో పరుసు మాళి గాయపడ్డాడన్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య విషయాన్ని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకువెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించి నెల్లూరులోని వైద్యులతో మాట్లాడారు.

బస్సు టైర్లు పంచర్ త్రుటిలో తప్పిన ప్రమాదం

సంగం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముం బాయి జాతీయ రహదారిపై, సంగం సమీపంలో ఆర్టీసీ బస్సు వెనుక రెండు టైర్లు ఒక్కసారిగా పేలడంతో తృటిలో ప్రమాదం తప్పిన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. వివ రాల మేరకు నెల్లూరుకు చెందిన ఆర్టీసీ బస్సు సీతారామపురం నుంచి నెల్లూరుకు వెళ్తుంది. మార్గ మధ్యలో పెరమన క్రాస్ రోడ్డు దాటిన తరువాత బస్సు వెనుక ఉన్న రెండు టైర్లు ఒక్కసారిగా పేలి పెద్ద శబ్దం రావడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. డ్రైవర్ చాకచక్యంగా బ్రేక్‌లు వేసి నిలిపివేశారు. దీంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ సమయంలో ఎటువంటి వా హనాలు రాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎస్ఐకి తప్పిన ప్రమాదం

దుత్తలూరు (ఉదయగిరి), (ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకుని ఇంటికెళ్తున్న ఎస్ఐకు ప్రమాదం తప్పిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. కలిగిరి ఎస్ఐ ఉమా శంకర్‌ను నర్రవాడలోని వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు విధులు కేటాయించారు. గురువారం విధులు ముగించుకుని తన కారులో కలిగిరి వెళ్తుండగా బండ కిందపల్లి గ్రామ సమీపంలోకి రాగానే కారు ముందు టైరు పేలింది. దీంతో కారు రోడ్డుపై పల్టీలు కొట్టుకుంటూ పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. అటుగా వెళ్తున్న వారు గమనించి ఎస్ఐను కారులో నుంచి బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఎస్ఐ సురక్షితంగా బయటపడ్డారు.

ప్రజాపరిపాలనకు రెవెన్యూశాఖ అంకితం

● ప్రభుత్వ శాఖలన్నింటికీ తలమానికం ● నేడు రెవెన్యూ దినోత్సవం


కోవూరులోని తహసీల్దారు కార్యాలయం

కోవూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాపరిపాలనలో రెవెన్యూ శాఖ ప్రధానమైంది. ప్రజలకు ప్రభుత్వ సేవ లందించేందుకు, ప్రజాసమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో రెవెన్యూ శాఖ పాత్ర కీలకం. రెవెన్యూ సర్వీసెస్ డే (రెవెన్యూ దినోత్సవం)ను ప్రతీ ఏటా జూన్ 20న ఉద్యోగులు నిర్వహించుకుంటారు. ఈసందర్భంగా ప్రజాసేవకు పునరంకితమవుతామంటూ ప్రతిజ్ఞ పూనుతారు. ప్రతీ ఏటా నామమాత్రంగా నిర్వహిస్తుండగా ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిధుల్ని కేటాయించడంతో ఉద్యోగులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

238 సంవత్సరాల ఘన చరిత్ర

బ్రిటీష్ ప్రభుత్వం 1786వ సంవత్సరం జూన్ 20న దేశవ్యాప్తంగా 'బోర్డు ఆఫ్ రెవెన్యూ' ను ఏర్పాటుచేసింది. దీంతో దేశంలో రెవెన్యూ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ ఏర్పడి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తోంది. అంతకు పూర్వము నుంచే దేశంలో రెవెన్యూ వ్యవస్థ ఉన్నట్లు ఆధారాలున్నాయి. భక్తరామదాసుగా ప్రసిద్ధుడైన కంచర్ల గోపన్న 1680 ప్రాంతంలో తహసీల్దారుగా పనిచేస్తూ భద్రాచలంలో ఆలయనిర్మాణాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సిన భూమి శిస్తుతో కట్టించి గోల్కొండనవాబు ఉత్తర్వులతో కటకటాల పాలైన చరిత్ర అందరికీ తెలిసిందే.

రెవెన్యూ ఉద్యోగులే కీలకం

భూ సమస్యల పరిష్కారమే కాదు. ఎన్నో సేవల్ని రెవెన్యూ వ్యవస్థ అందిస్తోంది. నిత్యావసర వస్తువుల పంపిణీ, ఎన్నికల ప్రక్రియ, విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల్ని ఆదుకోవడం లాంటి ప్రధాన అంశాలన్నింటిలోనూ రెవెన్యూ ఉద్యోగులే కీలకం. జిల్లాలో శంకరన్ లాంటి కలెక్టర్లను, మండలాల్లో సేవలందించిన తహసీల్దార్ల సేవలను సింహావలోకనం చేసుకుంటారు.

చెక్కుచెదరని కార్యాలయాలు

రెవెన్యూ వ్యవస్థలో ప్రధానమైనవి తహసీల్దారు కార్యాలయాలు. కోవూరు, కావలి, ఆత్మకూరు, గూడూరు పట్టణాల్లో 125 సంవత్సరాల కిందట బ్రిటీషు వారు నిర్మించిన తహసీల్దారు కార్యాలయాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. గతంలో రెవెన్యూ వ్యవస్థలో కీలకమైన 'జమాబందీ' ఈ కార్యాలయాల్లోనే జరిగేవి. కాలంతోపాటు అనేక మార్పులు చోటుచేసుకున్నప్పటికీ కార్యాలయాలు చెక్కుచెదరక సేవలందిస్తుండటం గమనార్హం.

ఎంతో సంతోషంగా ఉంది



రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వ హించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధుల్ని కేటాయించడం సంతోషంగా ఉంది. రెవెన్యూ శాఖలో చేరినప్పటి నుంచి అంకితభావంతో పనిచేస్తున్నాము. ప్రజలకు సేవలందించడంలో ఎప్పుడూ అందుబాటులో ఉంటాము. వానొచ్చినా, వరదొచ్చినా మేము సేవలందిస్తాము. ఇరవైనాలుగు గంటలూ సేవ చేసేందుకు సిద్ధంగా ఉంటాము.

-- సునీల్ కుమార్, అటెండరు, తహసీల్దారు కార్యాలయం, కోవూరు

ఆందోళన నడుమ ఏఎన్ఎంల రీ కౌన్సెలింగ్

● మరో రెండు యూనియన్లను హైకోర్టు గుర్తించటంతో గందరగోళం
● కలెక్టర్‌కు తమ గోడు వెల్లడించిన నర్సులు ● రీకౌన్సెలింగ్ రద్దు చేయాలంటూ ఆందోళన

నెల్లూరు (వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్ఎంల కౌన్సెలింగ్ రసాభాసగా మారింది. బుధవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జూమ్ ద్వారా 134 మంది ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ జరిగింది. అయితే తమను గుర్తించటం లేదని హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్, అసోసియేషన్, పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయాస్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ నెల 18న హైకోర్టు బదిలీల్లో ఈ రెండు యూనియన్లను గురించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యయన్ బదిలీల్లో ఈ యూనియన్‌లను కూడా గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారమే ఏఎన్ఎంల కౌన్సెలింగ్ పూర్తి చేసిన వైద్యాధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం 19 రీ కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో ఏఎన్ఎంలు వైద్య ఆరోగ్యశాఖ అధికారి వద్ద ఆందోళనకు దిగారు. వెంటనే రీ కౌన్సెలింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. అయితే హైకోర్టు ఆదేశాలు, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని అధికారులు నచ్చ చెప్పినా వారు వినలేదు.

యూనియన్లకు డబ్బులు చెల్లించిన వారెందరో..

ఇదిలా ఉంటే యూనియన్ సిఫార్సు లెటర్‌కు ఆయా యూనియన్‌లకు పెద్ద సంఖ్యలో ఏఎన్ఎంలు ముడుపులు చెల్లించి సిఫార్సు లెటర్లు తెచ్చినట్లు సమాచారం. ఏపీ ఎన్జీవో సంఘంతో పాటు ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ 134 మంది ఏఎన్ఎంలలో 30 శాతం వరకు ముడుపులు తీసుకుని అప్పటికప్పుడు సిఫార్సు లెటర్లు ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తమకు అనుకూలంగా బదిలీలు జరుపుకున్న యూనియన్ నేతలు తమకు సంబంధించిన ఏఎన్ఎంలను వారు కోరుకున్న చోటికి బదిలీ చేయించుకున్నారు. దీంతో సిఫార్సు లెటర్లు లేని వారు ఈ చర్యను తీవ్రంగా అడ్డుకున్నారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అయితే ఉన్నట్లుండి హంస అసోసియేషన్‌కు, పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్‌కు కోర్టు ద్వారా అనుమతులు తెచ్చు కోవటంతో కేవలం హంస యూనియన్ మాత్రం ఏఎన్ఎంలకు సిఫార్సు లెటర్లు ఇచ్చింది. దీంతో గురువారం రీ కౌన్సెలింగ్ జరగటంతో తాము కోరుకున్న చోటికి బదిలీకానివారు తీవ్ర నిరసనను తెలియచేశారు.


ఏఎన్ఎంలకు రీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కలెక్టర్‌ను కలిసిన ఏఎన్ఎంలు

పలువురు ఏఎన్ఎంలు కలెక్టర్ ఆనంద్‌ను కలిశారు. బదిలీల కౌన్సెలింగ్‌లో తమకు అన్యాయం జరిగిందంటూ గోడు వెళ్లబోసుకున్నారు. ఏకంగా 71 మందికి సిఫార్సు లెటర్లు ఇచ్చారని, వారికి తొలి ప్రాధాన్యత ఇస్తే జిల్లా కేంద్రానికి ఎక్కడో మారుమూల ప్రాంతాలలో 10 నుంచి 15 ఏళ్లగా పని చేస్తున్న తమకు దగ్గరగా వచ్చే అవకాశం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ల అర్హత లేని వారికి లెటర్లు ఇచ్చాయని ఆందోళన చేశారు. దీనిపై కలెక్టర్ ఆనంద్ స్పందించారు. వైద్యాధికారులకు ఫోన్ చేసి నిబంధనల ప్రకారమే బదిలీల కౌన్సెలింగ్ చేయాలంటూ హెచ్చరించారు. దీనికి వైద్యాధికారులు జవాబిస్తూ ఈ కౌన్సెలింగ్‌లో తమ ప్రమేయం ఏమీ లేదని, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా యూనియన్ సిఫార్సు లెటర్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలియచేశారు. 47 సిఫార్సు లెటర్లకు ప్రాధ్యాన్యత ఇచ్చి బదిలీలు చేస్తున్నామని వారు ఈ సందర్భంగా వివరించారు.

రూ.8 కోట్లు వెచ్చించినా ఏంలాభం ?

● చిట్టడవిలా పేదల ఇళ్ల స్థలాలు ● చిల్లచెట్లతో నిండిన కొండికందుకూరు లేఅవుట్
● దొంగల పాలైన విద్యుత్ తీగలు, ఇతర సామగ్రి ● స్థానికులకు పట్టాలివ్వాలంటున్న సర్పంచి

కందుకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పేదలకోసం మండలంలోని కొండికందుకూరు వద్ద 14 ఎకరాల్లో గత జగన్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన లేఅవుట్ నిరుపయోగంగా మారింది. ఈ లేవుట్‌కు భూమి కొనుగోలు, మెరక చేయడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సుమారు రూ. 8 కోట్ల ప్రజాధనం వెచ్చించారు. అనంతరం కందుకూరులోని 1,080 కుటుంబాల వారికి అక్కడ ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అంతేకాక కొన్ని గృహాలకు కాంట్రాక్టర్లతో బేస్‌మెంట్ల నిర్మాణం కూడా హౌసింగ్ అధికారులు పూర్తిచేయించారు. అయితే పట్టణానికి సుదూరంగా ఉన్న ఇక్కడ నివసించేందుకు ఒక్క కుటుంబం కూడా ముందుకు రాలేదు. దీంతో ఆలేవుట్ నేడు నిరుపయోగంగా మారింది.

● **అడవిలా మారింది !**

రెండేళ్లుగా అక్కడ ఎలాంటి కార్యకలాపాలు లేకపోవటంతో చిల్లచెట్లు దట్టంగా పెరిగి అడవిలా మారింది. దీంతో ఈ లేఅవుట్ అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా ఉండటమేకాక అక్కడ మౌలిక సదుపాయాల కోసం ఏర్పాటుచేసిన పరికరాలన్నీ దొంగల పాలవుతున్నాయి. గృహనిర్మాణాల కోసం ఏర్పాటుచేసిన పైపులు, నీటి ట్యాంకులను దొంగలు ఎత్తుకెళ్లిపోగా, ఇటీవల ఆ లేఅవుట్‌లోని విద్యుత్ వైర్లను కూడా పూర్తిగా దొంగలు చోరీచేశారు. కొండికందుకూరు గ్రామానికి సమీపంలో ఉన్న ఈ లేఅవుట్‌లో విద్యుత్ సౌకర్యం కోసమే రూ. 60 లక్షలకు పైగా వెచ్చించి ప్రత్యేకంగా విద్యుత్‌లైను లాగటంతోపాటు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ లేఅవుట్‌లో ఒక్క విద్యుత్‌తీగ కూడా లేకుండా దొంగలు అపహరించుకుపోయారు. మరికొద్దిరోజులుపోతే ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు కూడా కనిపించవని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



స్థానికులకే పట్టాలివ్వాలి

14 ఎకరాల్లో అన్ని మౌలిక సదుపాయాలతో లే అవుట్‌ను అభివృద్ధి చేశారు. స్థానిక పేదలకు పట్టాలుఇస్తే ఈలేవుట్ వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. కొండికందుకూరు,సమీప గ్రామాల్లో నివాసస్థలం లేని నిరుపేదలు ఎందరో ఉన్నారు. వారందరికీ ఇక్కడ పట్టాలు ఇచ్చేందుకు ప్రజాప్రతినిధులు,అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కొండికందుకూరు సర్పంచి కుమ్మర బ్రహ్మయ్య

వెంగమాంబ ఆలయ అభివృద్ధికి చర్యలు

● ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కాకర్ల

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలం లోని నర్రవాడ గ్రామంలో వెలసి ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు సర్వేపల్లి, ఉదయగిరి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్ తెలిపారు. గురువారం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ వలసవాసుల ఆరాధ్యదైవమైన వెంగమాంబ పేరంటాలమ్మ ఆల యానికి భక్తుల తాకిడి అధికంగా ఉందన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటు న్నారన్నారు. అయితే ఆలయం వద్ద భక్తులకు తగినన్ని వసతులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆలయ అభి వృద్ధికి ప్రస్తుతం రూ.4 కోట్లు నిధులు మంజూరయ్యాయ న్నారు. ఈ నిధులతో వసతుల కల్పనకు చర్యలు చేపట్టడంతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబుని కలిసి మరో రూ.4 కోట్లు నిధుల మంజూరుకు చర్యలు చేపడతామ న్నారు. వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల సమయానికి భక్తుల సౌకర్యార్థం కొన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్లు పేలపూడి వెంకటరత్నం, బయ్యన్న, టీడీపీ నాయకులు మల్లంపాటి గురవయ్యనాయుడు, ఉండేలా గురవారెడ్డి, శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో విజిలెన్స్ అధికారుల దాడులు

● 950 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం

బిట్రగుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ బొగ్గుదిబ్బల కాలనీలో విజిలెన్స్ సీఐ నరసింహరావు, విజిలెన్స్ తహసీల్దారు క్రిష్ణప్రసాద్‌లు గురువారం తనిఖీలు నిర్వహించారు. గుర్రంకొండ రాకేష్ ఇంట్లో తనిఖీలు చేయగా 950 కేజీల రేషన్ బియ్యం గుర్తించినట్లు వారు తెలిపారు. రాకేష్‌ను అదుపులోకి తీసుకునేందుకు అధికారులు ప్రయత్నించే లోపు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. రేషన్ బియ్యాన్ని స్వాధీన పరుచుకుని సమీపంలోని రేషన్‌షాపులో అప్పగించారు. ఆర్ఐ రామ్‌కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై భోజ్యా తెలిపారు.


విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలు

జిల్లాలో ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ : జాయింట్ కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం తదితర పథకాలను పొందటంలో ఎదురతున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఓ ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ శాఖ సబ్ డివిజన్ సేవ కోసం నిర్ధారించిన ఫీజు రూ.500ను మినహాయింపు ఇచ్చి, కేవలం నామమాత్రపు దరఖాస్తు ఫీజు రూ. 50ను సంబంధిత గ్రామ సచివాలయంలో చెల్లించిన వారికి జాయింట్ పట్టాదారుల భూములకు ఉచితంగా సబ్ డివిజన్ చేయిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 30లోగా అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సాంకేతికతను రైతులకు చేరువ చేయాలి

● యంత్రపరికరాల పంపిణీలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి అవసరమైన, అందుబాటులో ఉన్న ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులను రైతులకు చేరువ చేయాలని కలెక్టర్ ఆనంద్ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. నెల్లూరులోని ముత్తుకూరురోడ్డులో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానంలో గురువారం వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సబ్సిడీ కింద యంత్ర, పరికరాలను ఆయన రైతులకు అందజేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద జిల్లాలో 1452 యంత్రపరికరాలను రైతులకు అందజేశామని చెప్పారు. వాటి మొత్తం విలువ రూ.6,80,48,750లుకాగా అందులో రూ.2, 86,96,220లు రాయితీగా మంజూరైనట్లు పేర్కొన్నారు. పొలంలో మట్టి నమూనాల సేకరణ నుంచి పంట చేతికందే వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన శాస్త్రీయపరమైన అంశాలు, తీసుకో వాల్సిన జాగ్రత్తలపై రైతులు కూడా అవగా హన పెంచుకోవాలని కోరారు. రైతులకు అవస రమైన పరికరాలను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలకు సూచించారు. నియోజకవర్గాల వారీగా అందించిన పరికరాల వివరాలను జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ రీజనల్ మేనేజర్ విద్యాసాగర్, శాస్త్రవేత్త వినీత, ఏడీ సర్వేజీరావు, అనిత, కన్నయ్య, శివనాయక్, ఏవో మంజుల తదితరులు పాల్గొన్నారు.


పరికరాల పనితీరును కలెక్టర్ ఆనంద్‌కు తెలియజేస్తున్న డీఏవో సత్యవాణి

రాహుల్‌తోనే దేశాభివృద్ధి

● కాంగ్రెస్ నాయకులు


కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నెల్లూరు (వైద్యం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) :భారతదేశం అన్నీ రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే అది కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం నెల్లూరులోని ఇందిరాభవన్‌లో రాహుల్‌గాంధీ 55వ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటూరి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, దేశభద్రత, మహిళా సాధికారత, యువత అభ్యున్నతి వంటి వాటికి పెద్దపీట వేస్తున్నది రాహుల్‌గాంధీయే అని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వంలో దేశం ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెల్లాంబాక మోహన్‌రెడ్డి, పప్పర్తి గణేష్‌బాబు, హుస్సేన్‌బాషా, సత్తనపల్లి బాలయ్య, కిశోర్, రెహ్మాన్, నసీమా, రాజేష్‌రెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆయనపై అంత ప్రేమెందుకో...?

(3వ పేజీ తరువాయి)

రిజక్ట్ చేశారు. అప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు సుమారు రూ.8 కోట్ల బిల్లులు చెల్లించారు. దీంతో ఆ బిల్లులను రికవరీ చేయాల్సిందిగా క్వాలిటీ కంట్రోల్ సీఈ ఆదేశించారు. ఇదే సమయంలో నాణ్యతను పరిశీలించని సంబంధిత అధికారులపైనా చర్యలకు సిఫార్సు చేశారు. ఇదంతా జరిగి ఇప్పటికి పదేళ్లు కావస్తోంది.

● **విజిలెన్స్ చెప్పినా లెక్కలేదు..!**

క్వాలిటీ కంట్రోల్ సీఈ ఇచ్చిన నివేదిక ప్రకారం కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఆర్అండ్‌బీ అధికారులు స్పందించకపోవడంతో 2017లో ఆత్మకూరు-సోమశిల రోడ్డు వర్కుపై విజిలెన్స్ విభాగం విచారణ ప్రారంభించింది. ఈ విచారణలో అనేక అవకతవకలు వెలుగుచూశాయి. నాణ్యత లేకుండా రోడ్డు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని నిర్ధారించారు. ఇందుకు సంబంధించి కాంట్రాక్టర్ చేత మరోసారి రోడ్డు వేయించడంతో పాటు రికవరీ చేయాలని విజిలెన్స్ సిఫార్సు చేసింది. అలానే ఇందుకు బాధ్యులైన ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈలపై చర్యలు తీసుకోవాలంటూ గతేడాది మే నెలలో ఆర్అండ్‌బీ సెక్రటరీకు అప్పటి విజిలెన్స్ డీజీ నివేదిక అందజేశారు. ఆ తర్వాత ఆర్అండ్‌బీ సెక్రటరీ నుంచి ఈఎన్‌సీకు ఆదేశాలు వెళ్లాయి. ఏడాది కాలంగా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోకుండా డ్రామాలు ఆడుతున్నారు. కింది నుంచి పైకి, పైనుంచి కిందకు ఫైల్‌ను తిప్పుతూ కాలం గడుపుతున్నారు. ఈ వర్కు విషయంలో చర్యలు తీసుకోకపోవడానికి ఆఖరుకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) కూడా తప్పుబట్టింది.

● **మంత్రి ఆదేశాలూ బేఖాతర్**

రోడ్డు విషయంలో అధికారుల తీరును గతేడాది పలు కథనాల రూపంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. కాంట్రాక్టర్‌కు కొమ్ము కాస్తూ, రోడ్డు బాగు చేయకుండా ప్రజలను ఇబ్బందులు పెడతున్న వైనాన్ని బయట పెట్టింది. దీంతో ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందించారు. ఎందుకు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడం లేదు..? ఎందుకు మళ్లీ లేయింగ్ వేయడం లేదో.. ఐదు రోజుల్లోపు వివరణ ఇవ్వాలంటూ ఆర్అండ్‌బీ ఎస్ఈను ఆదేశించారు. ఇప్పటికి నాలుగు నెలలు గడిచినా మంత్రికి సమాధానం ఇవ్వకపోవడమే కాకుండా కనీసం కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడం గానీ, ప్రజా సొమ్మును రికవరీ చేయడం గానీ చేయలేదు.

సీఈకు నివేదించాం

ఆత్మకూరు-సోమశిల రోడ్డుకు సంబంధించి నివేదిక ఇవ్వాలని నెల్లూరు ఈఈకు సూచించాం. కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. ప్రస్తుత పరిస్థితిని తెలియజేస్తూ ఈఈ ఇచ్చిన నివేదికను సీఈకు పంపాం. ఎంత మేర రికవరీ చేయాలన్నది వారు నిర్ణయిస్తారు. తదుపరి ఉత్తర్వుల ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

- గంగాధర, ఆర్అండ్‌బీ ఎస్ఈ

జిల్లా గ్రంథాలయానికి త్వరలో రూ.3 కోట్లు మంజూరు

● గ్రంథాలయ శాఖ డైరెక్టర్ కృష్ణమోహన్

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి అవసరమయ్యే రూ.3కోట్లను త్వరలో మంజూరు చేస్తామని ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుడు ఏ కృష్ణమోహన్ వెల్లడించారు. ఆయన గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. పోటీ పరీక్షల మెటీరియల్, గ్రంథాలయంలో సౌకర్యాలపై గ్రంథాలయ పాలకులతో చర్చించారు. శనివారం జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం ఫ్లెక్సీలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే కుమార్‌రాజాతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


జిల్లా గ్రంథాలయ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ కృష్ణమోహన్ తదితరులు

ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో విజిలెన్స్ విచారణ

కావలి టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాల వైద్యుల వ్యవహార శైలి, అభియోగాలు, ఆసుపత్రి నిర్వహణ లోపాలపై గురువారం విజిలెన్స్ విచారణ జరిగింది. విజిలెన్స్ ఆఫీసర్ డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ డాక్టర్ బీసీకె నాయక్ పర్యవేక్షణలో స్వీపర్ స్థాయి నుంచి డాక్టర్ స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సహా ఉదయం 10 గంటలకు ప్రారంభమైన విచారణ రాత్రి 8గంటల వరకు జరిగింది. వైద్యుల మధ్య ఆధిపత్య పోరు సమన్వయ లోపం, ఇటీవల కాలంలో ఆసుపత్రిలో జరిగిన పలు అభివృద్ధి పనుల నిధుల విషయంలో ఆరోపణలు, ఆసుపత్రి కమిటీ వైద్యాధికారుల మధ్య సమన్వయ లోపాలు వెరసి ఆసుపత్రి నిర్వహణ గాడి తప్పడం, ఆసుపత్రి వ్యవహారం రాష్ట్రస్థాయికి చేరింది. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కర్నాటి రోహిత్ తనకు సంబంధంలేని విషయాల్లో జోక్యం చేసుకుంటున్నారని అందరిపై ఆధిపత్యం చెలాయిస్తున్నారన్న ఆరోపణపై ప్రధానంగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. దీనిపై విజిలెన్స్ అధికారులను ఆంధ్రజ్యోతి ప్రతినిధి వివరణ కోరగా అన్ని అంశాలపై ఆరోపణలున్న మాట వాస్తవమేనని, వాటిపై విచారణ జరుపుతున్నామని వివరణ ఇచ్చారు.


సిబ్బందిని విచారిస్తున్న విజిలెన్స్ కమిటీ